www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 10-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 192 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా.7.39 తదుపరి పంచమి; నక్షత్రం: కృత్తిక సా.5.31 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ.6.46-8.12; దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, మ.12.25-1.12; అమృతఘడియలు: మ.3.22-4.48; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.10; సూర్యాస్తమయం: 5.53 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


Chinta Sasidhar Foundation

VISHWA SAMUDRA
CHALLENGE IT. CHANGE IT.

NANDHA GOKULAM
Life School

ప్రభుత్వ-ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహోన్నత 'జీరో పావర్టీ - P4' కార్యక్రమానికి అనుగుణంగా



- పిల్లలను ఉపాధి పొందగలిగే, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం
- రైతుల నూకలు (బ్రోకెన్ రైస్) కొనుగోలు చేసి, వారికి ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం
- ఎద్దు మరియు రైతుల కోసం స్థిరమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడం

శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి

అక్టోబర్ 10, 2025, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో

ప్రారంభంకానున్న సంస్థలు

నంద గోకులం లైఫ్ స్కూల్







- ఆర్థికంగా వెనుకబడిన, మేధస్సు (High IQ) కల బాలుర కోసం రెసిడెన్షియల్ పాఠశాల.
- నంద గోకులం ప్రాంగణంలోని 19 ఎకరాల్లో క్యాంపస్.
- ప్రపంచ స్థాయి మౌలిక వసతులు; సాంకేతిక సామర్థ్యంగల Wi-Fi క్యాంపస్.
- పూర్తిగా ఎయిర్-కండిషన్డ్ పాఠశాల; అర్థవంతంగా రూపొందించిన బోధనా స్థలాలు.
- గోవులు, ఎడ్ల మధ్య ప్రకృతి సహజ బాల్యం.
- సేంద్రీయ వ్యవసాయంలో పాల్గొనడం.

విద్యతో జీవితాల అభ్యున్నతి

విశ్వ సముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్





- 24 ఎకరాల్లో బయో-ఇథనాల్, కార్బన్ డయాక్సైడ్ (CO_2), డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ విత్ సాల్యూబుల్స్ (DDGS) ఉత్పత్తి.
- ఈ ప్రాంతంలో 15,000 టన్నులకుపైగా నూకలు (బ్రోకెన్ రైస్) కొనుగోలు (250 కి.మీ పరిధిలోని 300కు పైగా రైస్ మిల్లుల నుంచి).
- నూకలను (బ్రోకెన్ రైస్) ఫీడ్‌స్టాక్‌గా ఉపయోగించి రోజుకు 200 KLPD ఇథనాల్ ఉత్పత్తి చేసే సామర్థ్యం.
- భారత ప్రభుత్వ ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (EBP) ద్వారా పెట్రోల్‌లో 20% మిశ్రమ లక్ష్యానికి మద్దతు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రైతు-హిత హరిత కార్యక్రమం

నంద గోకులం సేవ్ ద బుల్ కాజ్





- 280 ఎకరాల విస్తీర్ణంలో 400కు పైగా ఎద్లు, ఆవులు, దూడలకు ఆశ్రయం.
- అంతరించిపోతున్న దేశీయ ఎడ్ల జాతుల పునరుద్ధరణ.
- 'నంది పవర్' - ప్రత్యేకంగా రూపొందించిన ఎడ్ల ట్రెడ్మిల్; సుమారు 5 KW విద్యుత్ ఉత్పత్తి, తద్వారా రైతుకు ఎడ్ల పోషణకై సరిపడ ఆదాయం.
- డిజిటల్ బుల్ అడాప్షన్ - ఎవరైనా వర్చువల్‌గా ఎద్దును దత్తత తీసుకుని రైతులకు మద్దతు ఇవ్వగలరు.
- అడాప్షన్ లింక్: https://nandhagokulam.com/adopt

ఎడ్లను సంరక్షించి, దేశీయ జాతులను పునరుజ్జీవింపచేసే కార్యక్రమం

vishwasamudragroup.com • vishwasamudra.in • chintasasidharfoundation.com • nandhagokulam.com • nglifeschool.com • vsbio.in

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

బరిలోకి టీమిండియా ● నేటి నుంచి విండీస్‌తో రెండో టెస్టు



గిల్

గంభీర్

ఉదయం 9.30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్, జడేజా, సుందర్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

వెస్టిండీస్: టి. చందర్‌పాల్, క్యాంప్‌బెల్, అథనజె, బ్రాండన్ కింగ్, షాయ్ హోప్, చేజ్ (కెప్టెన్), గ్రీవ్స్, వారికన్, పియర్, బ్లేడ్స్, సీల్స్.

పిచ్, వాతావరణం: ఇక్కడి వికెట్ తొలి రెండు రోజుల పాటు బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. ఆ తర్వాత స్పిన్నర్లకు స్లో టర్న్ లభించే అవకాశం ఉంది. విండీస్ బ్యాటర్లు ఈ పిచ్‌ను సద్వినియోగం చేసుకుంటే కాస్త పోటీనివ్వవచ్చు. వర్షం నుంచి ఎలాంటి ఆటంకం ఉండే అవకాశంలేదు.



న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టును పూర్తి ఏకపక్షంగా మార్చేసి మూడు రోజుల్లోపే ముగించిన టీమిండియా.. ఇప్పుడు క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య ఆఖరిదైన రెండో టెస్టు జరుగనుంది. గతమెంతో ఘనమైన కరీబియన్ టీమ్ భారత జట్టుతో ఏ విభాగంలోనూ సరితూగే స్థాయిలో లేదు. దీంతో ఈ టెస్టులోనూ గిల్ సేనకు పెద్దగా పోటీ ఉండకపోవచ్చు. అయితే తమ జట్టుకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న దిగ్గజ ఆటగాళ్లు లారా, రిచర్డ్స్, రిచర్డ్‌సన్ మ్యాచ్‌కు ముందు విండీస్ ఆటగాళ్లతో సంభాషించి వారిలో ఉత్తేజాన్ని నింపనున్నారు. తొలి టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలో కలిపినా విండీస్ బ్యాటర్లు కనీసం 90 ఓవర్లు ఆడలేకపోయారు. అలాగే ఒక్కరు కూడా హాఫ్ సెంచరీ సాధించలేదు. 2002లో భారత్‌పై చివరి విజయం సాధించిన విండీస్ తాజా టెస్టులో ఏమేరకు పోటీనిస్తుందో వేచి చూడాల్సిందే. ఇక అరుణ్ జైట్లీ మైదానంలో భారత్ 1987లో చివరిసారిగా టెస్టు మ్యాచ్‌లో ఓడింది.

మార్పుల్లేకుండానే..: అన్ని విభాగాల్లో పటిష్ఠంగా కనిపిస్తున్న టీమిండియా తమ తుది జట్టులో మార్పులు చేసే అవకాశం లేదు. అయితే సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ బ్యాటింగ్‌పై ఎక్కువగా దృష్టి సారించే అవకాశం ఉంది. తొలి టెస్టులో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసిన నితీశ్‌కు బ్యాటింగ్ చేసే చాన్స్ రాలేదు. అందుకే ఈ టెస్టులో అతడిని ముందుగా పంపే అవకాశం ఉంది. ఇక తొలి టెస్టులో టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ అద్భుతంగా ఆడినా వన్‌డౌన్‌లో సాయి సుదర్శన్ మాత్రం ఏడు పరుగులకే పరిమితమయ్యాడు. రాహుల్, జురెల్, జడేజా శతకాలతో ఫామ్‌ను చాటుకోగా.. గిల్, జైస్వాల్ కూడా రాణించారు. బౌలింగ్‌లో పేసర్లు బుమ్రా, సిరాజ్ అదుర్స్ అనిపించుకున్నారు. కుల్దీప్, సుందర్ స్పిన్‌లో ప్రభావం చూపుతున్నారు.

నితీశ్‌ను మరింతగా పరీక్షిస్తాం..

నితీశ్ కుమార్‌కు క్రీజులో ఎక్కువ సమయం గడిపేలా చూస్తామని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. 'నితీశ్ బ్యాటింగ్‌పై మేం చర్చించాం. అతడిని కేవలం విదేశాల్లోనే ఆడించడం సరికాదు. రోజులో 10-15 ఓవర్లపాటు బౌలింగ్ చేయడంతో పాటు బ్యాటింగ్ కూడా చేయగల ప్లేయర్‌కు మద్దతివ్వాల్సి ఉంటుంది. అందుకే క్రీజులో అతడికి ఎక్కువ సమయం గడిపే అవకాశం ఇవ్వాలనుకుంటున్నాం. ముఖ్యంగా భారత్ పిచ్‌లపై నితీశ్ బ్యాటింగ్‌ను గమనించాల్సిన అవసరం ఉంది' అని గిల్ వివరించాడు. కెరీర్‌లో ఆడిన ఎనిమిది టెస్టుల్లో ఏడింటిని తను విదేశాల్లోనే ఆడగా.. అహ్మదాబాద్ టెస్టులో బ్యాటింగ్‌కు దిగాల్సిన అవసరం రాలేదు.

విరాట్ లేకుండా స్టేడియం నిండేనా?

న్యూఢిల్లీ: స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి అభిమాన గణం ఎక్కువే. ఇక అతడి స్వస్థలం ఢిల్లీలో ఆడుతుంటే స్థానిక అరుణ్ జైట్లీ మైదానం పూర్తిగా నిండిపోవాల్సిందే. అతను తొమ్మిది నెలల క్రితం రంజీ మ్యాచ్ ఆడితేనే 12 వేలకు పైగా ప్రేక్షకులు హాజరయ్యారు. అయితే శుక్రవారం నుంచి భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టెస్టు ఇక్కడే జరుగనుంది. కానీ తొలిసారిగా విరాట్‌తో పాటు రోహిత్ శర్మ కూడా లేకుండా న్యూఢిల్లీలో భారత్ టెస్టు ఆడబోతోంది. దీంతో ప్రేక్షకులు ఏమేరకు హాజరవుతారోనన్న సందేహం వ్యక్తమవుతోంది. కోచ్ గంభీర్ కారణంగానే తాము ఆరాధించే క్రికెటర్లు ఆటకు వీడ్కోలు పలికారన్న కోపం కూడా ఇద్దరి ఫ్యాన్స్‌లోనూ ఉంది.

భారత్‌కు ఝలక్



డి క్లెర్క్ (84 నాటౌట్)

- మలుపుతిప్పిన డి క్లెర్క్
- 3 వికెట్లతో దక్షిణాఫ్రికా గెలుపు
- రిచా పోరాటం వృథా
- వన్డే వరల్డ్ కప్



రిచా (94)

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో నాడిన్ డి క్లెర్క్ (54 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 84 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా మూడు వికెట్ల తేడాతో భారత్‌కు షాకిచ్చింది. తొలుత భారత్ 49.5 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌటైంది. రిచా ఘోష్ (77 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 94), ప్రతీక రావల్ (37), స్నేహ్ రాణా (33) పోరాటాలు వృథా అయ్యాయి. ట్రయాన్ 3 వికెట్లు.. కాప్, డి క్లెర్క్, ఎంలబా తలో రెండు వికెట్లు సాధించారు. ఛేదనలో సౌతాఫ్రికా 48.5 ఓవర్లలో 252/7 స్కోరు చేసి గెలిచింది. కెప్టెన్ లారా వొల్వార్ట్ (70), ట్రయాన్ (49) రాణించారు. డి క్లెర్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

నిలబడిన లారా..: బ్రిట్స్ (0)ను మూడో ఓవర్‌లోనే క్రాంతి రిటర్న్ క్యాచ్‌తో డకౌట్ చేయడంతో.. ఆరంభంలోనే సౌతాఫ్రికా ఆట గతితప్పింది. లూస్ (5)ను అమన్‌జోత్ స్వల్ప స్కోరుకే వెనక్కిపంపింది. కాప్(20)ను రాణా బౌల్డ్ చేయగా.. బోష్ (1)ను దీప్తి రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపింది. జెఫ్టా (14)ను శ్రీచరణి వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో సఫారీలు 81/5తో ఇబ్బందుల్లో పడ్డారు. అయితే, ట్రయాన్‌తో కలసి లారా ఆదుకొనే ప్రయత్నం చేసింది. కీలక సమయంలో క్యాచ్‌లు చేజార్చిన భారత ఫీల్డర్లు ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం కల్పించారు. చివరి 4 ఓవర్లలో సౌతాఫ్రికా విజయానికి 41 రన్స్ కావాల్సి ఉండగా.. క్రాంతి వేసిన 47వ ఓవర్‌లో డి క్లెర్క్ 6,6,4తో 18 రన్స్ రాబట్టింది. దీంతో సమీకరణం 18 బంతుల్లో 23 రన్స్‌కు దిగివచ్చింది. ఈ దశలో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లు బాదిన డి క్లెర్క్.. మరో ఏడు బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ఫినిష్ చేసింది.

మంధాన విఫలం..: మరోసారి టాపార్డర్ వైఫల్యంతో కష్టాల్లో పడిన భారత్.. రిచా ఎదురుదాడితో పోరాడగలిగే స్కోరు చేసింది. ఒక దశలో భారత్ 153/7తో కష్టాల్లో పడగా.. రిచా, రాణా ఎనిమిదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యంతో జట్టు స్కోరును 250 దాటించారు. స్మృతి మంధాన (23) మళ్లీ విఫలమైంది. హర్లీన్ డియోల్ (13), ప్రతీక, జెమీమా (0), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (9), దీప్తి శర్మ (4) పెవిలియన్‌కు క్యూ కట్టడంతో.. భారత్ 47 పరుగుల తేడాతో ఐదు వికెట్లు చేజార్చుకొంది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రిచా ఎటాకింగ్ ఆటతో మ్యాచ్ గతిని మార్చింది. అయితే, ఆఖరి ఓవర్‌లో డి క్లెర్క్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో క్యాచవుటైన రిచా త్రుటిలో శతకం చేజార్చుకొంది.

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
న్యూజిలాండ్ x బంగ్లాదేశ్

స్కోరు బోర్డు

భారత్: ప్రతీకా రావల్ (సి) బ్రిట్స్ (బి) సెఖుఖునె 37, మంధాన (సి) లూస్ (బి) ఎంలబా 23, హర్లీన్ (బి) ఎంలబా 13, హర్మన్ (సి) కాప్ (బి) ట్రయాన్ 9, జెమీమా (ఎల్బీ) ట్రయాన్ 0, దీప్తి (సి) జఫ్టా (బి) కాప్ 4, అమన్‌జోత్ (సి) లూస్ (బి) ట్రయాన్ 13, రిచా (సి) ట్రయాన్ (బి) డి క్లెర్క్ 94, రాణా (సి) వొల్వార్డ్ (బి) కాప్ 33, క్రాంతి (నాటౌట్) 0, శ్రీచరణి (సి) వొల్వార్డ్ (బి) డి క్లెర్క్ 0; **ఎక్స్‌ట్రాలు: 25; మొత్తం: 49.5 ఓవర్లలో 251 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-55, 2-83, 3-91, 4-92, 5-100, 6-102, 7-153, 8-241, 9-251; **బౌలింగ్:** కాప్ 9-0-45-2, ఖాకా 7-0-47-0, డి క్లెర్క్ 6.5-0-52-2, ఎంలబా 10-0-46-2, సెఖుఖునే 7-0-29-1, ట్రయాన్ 10-0-32-3.

సౌతాఫ్రికా: లారా(బి) క్రాంతి 70, బ్రిట్స్ (సి అండ్ బి) క్రాంతి 0, లూస్ (సి) రిచా (బి) అమన్‌జోత్ 5, కాప్ (బి) రాణా 20, బోష్ (సి అండ్ బి) దీప్తి 1, జఫ్టా (ఎల్బీ) శ్రీచరణి 14, ట్రయాన్ (ఎల్బీ) రాణా 49, డి క్లెర్క్ (నాటౌట్) 84, ఖాకా (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 48.5 ఓవర్లలో 252/7; వికెట్ల పతనం:** 1-6, 2-18, 3-57, 4-58, 5-81, 6-142, 7-211; **బౌలింగ్:** క్రాంతి 9-0-59-2, అమన్‌జోత్ 5.5-0-40-1, రాణా 10-0- 47-2, శ్రీచరణి 10-1-37-1, దీప్తి 10-0-54-1, హర్మన్ 4-0-15-0.

1

ఈ మ్యాచ్‌లో 23 పరుగులు చేసిన మంధాన.. ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక రన్స్ (982) సాధించిన క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఈ క్రమంలో 1997లో ఆస్ట్రేలియా క్రికెటర్ బెలిండా క్లార్క్ 970 పరుగుల రికార్డును స్మృతి అధిగమించింది.


8వ నెంబరులో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక పరుగులు సాధించిన ప్లేయర్‌గా రిచా (94) సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ ఏడాది శ్రీలంకతో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ప్లేయర్ ట్రయాన్ 74 పరుగుల రికార్డును ఘోష్ బద్దలుకొట్టింది.

రో-కో వరల్డ్‌కప్‌లోనూ ఆడతారు:గిల్

న్యూఢిల్లీ: భారత వెటరన్ స్టార్ ఆటగాళ్లు విరాట్, రోహిత్ శర్మల కెరీర్ కొనసాగింపుపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే ఆసీస్ పర్యటనే వారికి చివరిది కావచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ నూతన వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రం రో-కోపై పూర్తి విశ్వాసం ప్రకటించాడు. ఆ ఇద్దరి సేవలు జట్టుకు ఎంతో అవసరమని తేల్చాడు. 'రాబోయే వన్డే వరల్డ్‌కప్‌లోనూ వారి పాత్ర కచ్చితంగా ఉంటుంది. ఆ ఇద్దరి అపార అనుభవం వెల కట్టలేనిది. విరాట్, రోహిత్‌లకున్న సమర్థత, నైపుణ్యం చాలా తక్కువ మంది క్రికెటర్లకు ఉంటుంది. మెగా టోర్నీ లక్ష్యంగా వారి సన్నద్ధత సాగుతుంది' అని గిల్ స్పష్టం చేశాడు.

ఆధిక్యంలో కాస్పరోవ్

ఆనంద్‌తో లెజెండ్స్ క్లచ్ చెస్



సెయింట్ లూయిస్ (అమెరికా): లెజెండ్స్ క్లచ్ చెస్‌లో భాగంగా దిగ్గజ ఆటగాళ్లు విశ్వనాథన్ ఆనంద్-గ్యారీ కాస్పరోవ్ (రష్యా) మధ్య 12 గేమ్‌ల పోరు గురువారం ఇక్కడ ప్రారంభమైంది. ఆరు గేమ్‌లు ర్యాపిడ్, ఆరు గేమ్‌లు బ్లిట్జ్ విధానంలో జరగనున్నాయి. ఇక..తొలి నాలుగు గేమ్‌లు ముగిసే సరికి కాస్పరోవ్ 2.5-1.5తో ఆధిక్యంలో నిలిచాడు. 1,2,4 గేమ్‌లు డ్రాగా ముగియగా...మూడో గేమ్‌లో కాస్పరోవ్ నెగ్గాడు. 1,2 ర్యాపిడ్ గేమ్‌లు కాగా..3,4 బ్లిట్జ్‌లో జరిగాయి.



చరిత్ర సృష్టించిన భారత జట్టు

కాంస్యం ఖాయం
ప్రపంచ జూ. మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

గువాహటి: కొరియాను ఓడించిన భారత్ ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా టోర్నమెంట్‌లో కనీసం కాంస్య పతకం ఖరారు చేసుకుంది. తద్వారా బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో తొలి పతకంతో చరిత్ర సృష్టించింది. గురువారం ఉత్కంఠ భరితంగా జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఆతిథ్య భారత్ 44-45, 45-30, 45-33తో కొరియాపై గెలుపొందింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఇండోనేసియాతో భారత్ తలపడనుంది. మరో క్వార్టర్ ఫైనల్లో కొరియా 45-35, 45-35తో తైపీని ఓడించింది.

భారత పారా వాలీబాల్ కెప్టెన్ ప్రశాంత్


మరో ముగ్గురు తెలుగోళ్లకు చోటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పారా సిట్టింగ్ వాలీబాల్ వరల్డ్‌కప్‌లో పాల్గొనే భారత జట్టు కెప్టెన్‌గా జి. ప్రశాంత్ నియమితుడయ్యాడు. అమెరికాలోని ఇండియానాలో వచ్చే ఆదివారం నుంచి ఈ పోటీలు జరగనున్నాయి. ప్రశాంత్ స్వస్థలం వరంగల్ జిల్లా మైలారం. మొత్తం 14 మందితో జట్టు ప్రకటించగా.. అందులో ప్రశాంత్‌తో కలిపి నలుగురు తెలుగువాళ్లున్నారు. వి. కల్యాణ్ (మంచిర్యాల), ఆర్. నరేష్ యాదవ్ (నల్లగొండ), ఎ.గణేష్ (విశాఖపట్నం)కు జట్టులో చోటు దక్కింది.

టీపీఎల్‌లో అత్యధిక ధర పలికిన రిత్విక్

ముంబై: వచ్చే డిసెంబర్‌లో జరిగే టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) ఆటగాళ్ల వేలంలో హైదరాబాద్ క్రీడాకారుడు బొల్లిపల్లి రిత్విక్ (చెన్నై స్మాషర్స్), తమిళనాడు ప్లేయర్ శ్రీరామ్ బాలాజీ (గుర్గావ్ గ్రాండ్ స్లామర్స్) అత్యధికంగా రూ.12 లక్షల ధర పలికారు. గురువారం జరిగిన వేలంలో లియాండర్ పేస్, సానియా మీర్జా, మహేష్ భూపతి పాల్గొన్నారు. హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మికను రూ.8.60 లక్షలకు ఎస్‌జి పైపర్స్ బెంగళూరు దక్కించుకుంది. హైదరాబాద్ స్ట్రయికర్స్ మరో తెలుగు ఆటగాడు జె.విష్ణువర్ధన్‌ను రూ.6 లక్షలకు కొనుగోలు చేసింది.

ముకేశ్ నం. 1



దేశంలోని 100మంది కుబేరుల్లో అంబానీదే అగ్రస్థానం

- గౌతమ్ అదానీ నం.2
- సావిత్రి జిందాల్‌కు 3 వ స్థానం
- ఫోర్బ్స్ జాబితా విడుదల
- లిస్ట్‌లో ఆరుగురు తెలుగువారు

న్యూఢిల్లీ: దేశంలో అత్యంత ధనవంతులైన 100 మంది వివరాలతో ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ అగ్రస్థానంలో నిలిచారు. ఆయన ఆస్తి 105 బిలియన్ (10,500 కోట్ల) డాలర్లు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో రూ.9.32 లక్షల కోట్లు. గత ఏడాదితో పోలిస్తే ముకేశ్ అంబానీ ఆస్తి 12 శాతం తగ్గిందని ఫోర్బ్స్ తెలిపింది. కాగా, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 92 బిలియన్ డాలర్ల (9,200 కోట్ల డాలర్లు=రూ.8.17 లక్షల కోట్లు) సంపదతో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. ఓపీ జిందాల్ గ్రూప్ చైర్మన్ సావిత్రి జిందాల్ కుటుంబం 40.2 బిలియన్ డాలర్ల (4,020 కోట్ల డాలర్లు=రూ.3.57 లక్షల కోట్లు) నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో ఉంది. దేశంలోని టాప్ టెన్ ధనవంతుల్లోని ఏకైక మహిళ ఆమే. భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్, హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్‌నాడార్ 4,5 స్థానాల్లో నిలిచారు. తెలుగువారి విషయానికొస్తే, ఈ జాబితాలో ఆరుగురికి చోటు లభించింది. తెలుగు సంపన్నుల్లో దివీస్ ల్యాబ్స్ అధిపతి మురళి దివి అగ్రస్థానంలో ఉన్నారు.

దేశంలో టాప్-10 శ్రీమంతులు

ర్యాంక్	పేరు	కంపెనీ	ఆస్తి (రూ.లక్షల కోట్లు)
1	ముకేశ్ అంబానీ	రిలయన్స్ ఇండస్ట్రీస్	9.32
2	గౌతమ్ అదానీ కుటుంబం	అదానీ గ్రూప్	8.17
3	సావిత్రి జిందాల్ కుటుంబం	ఓపీ జిందాల్ గ్రూప్	3.57
4	సునీల్ మిట్టల్ కుటుంబం	భారతి ఎయిర్‌టెల్	3.03
5	శివ్ నాడార్	హెచ్‌సీఎల్ టెక్	2.95
6	రాధాకిషన్ దమానీ కుటుంబం	డీమార్ట్	2.50
7	దిలీప్ సంఘ్వీ కుటుంబం	సన్ ఫార్మా	2.33
8	బజాజ్ కుటుంబం	బజాజ్ ఆటో	1.93
9	సైరస్ పూనావాలా	సీరమ్ ఇన్‌స్టిట్యూట్	1.90
10	కుమార మంగళం బిర్లా	ఆదిత్య బిర్లా గ్రూప్	1.84

రూ.88.8 లక్షల కోట్లు

- వంద మంది కుబేరుల మొత్తం సంపద ఇది
- ఈ ఏడాదిలో 9% డౌన్

ఈ ఏడాది దేశంలోని టాప్-100 ధనవంతుల మొత్తం సంపద 9 శాతం లేదా 100 బిలియన్ డాలర్లు (10,000 కోట్ల డాలర్లు=రూ.8.88 లక్షల కోట్లు) తగ్గి ట్రిలియన్ డాలర్లకు (1 లక్ష కోట్ల డాలర్లు=రూ.88.8 లక్షల కోట్లు) పరిమితమైంది. రూపాయి పతనం, స్టాక్ మార్కెట్ క్షీణత ఇందుకు కారణమయ్యాయి. దేశంలో అతిపెద్ద ధనవంతుడైన అంబానీ సహా జాబితాలోని మూడింట రెండొంతుల మంది సంపద ఈ ఏడాది తరిగిపోయిందని ఫోర్బ్స్ తెలిపింది. ఈ ఏడాది అంబానీ ఆస్తి ఏకంగా 14.5 కోట్ల డాలర్ల (రూ.1.28 లక్షల కోట్లు) మేర తరిగిపోయింది. అయినప్పటికీ ఆయన దేశంలోని ఏకైక సెంటీ బిలియనీర్ (కనీసం 100 బిలియన్ డాలర్ల ఆస్తి కలిగిన వ్యక్తి)గా ఉన్నారు. కాగా, ఈ ఏడాది అత్యధికంగా సంపద పెరిగిన వారిలో భారతి ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్ ముందున్నారు. ఈ ఏడాది ఆయన ఆస్తి 3.5 డాలర్ల (రూ.31,080 కోట్లు) మేర పెరిగింది. దాంతో మిట్టల్ ఈసారి జాబితాలో మూడు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరారు.


తెలుగు సంపన్నులు వీరే..

ర్యాంక్	పేరు	కంపెనీ	ఆస్తి (రూ.కోట్లు)
25	మురళి దివి	దివీస్ ల్యాబ్స్	88,800
70	పీపీ రెడ్డి, పీవీ కృష్ణా రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	37,473
83	గ్రంధి మల్లికార్జున రావు	జీఎంఆర్	33,300
86	ప్రతాప్ సీ రెడ్డి	అపోలో హాస్పిటల్స్	32,412
89	బీ పార్థసారథి రెడ్డి	హెటిరో గ్రూప్	31,080
91	కే సతీశ్ రెడ్డి కుటుంబం	డాక్టర్ రెడ్డీస్	30,636

బిజినెస్

టీసీఎస్ లాభం రూ.12,075 కోట్లు

క్యూ2లో 1.4% అప్ ● ఒక్కో షేరుకు రూ.11 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దిగ్గజం టీసీఎస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (క్యూ2)లో రూ.12,075 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.11,909 కోట్లతో పోల్చితే లాభం 1.4% పెరిగింది. బీఎఫ్ఎస్ఐ సహా వివిధ విభాగాల్లో ఏర్పడిన వృద్ధి లాభం పెరగడానికి దోహదపడిందని టీసీఎస్ వెల్లడించింది. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం 2.39% వృద్ధితో రూ.64,259 కోట్ల నుంచి రూ.65,799 కోట్లకు పెరిగింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 3.7% పెరిగినా లాభం 5.3% క్షీణించింది. మొత్తం కాంట్రాక్టు విలువ లేదా టీసీవీ (కాంట్రాక్టు కాలపరిమితిలో సంబంధిత కస్టమర్ నుంచి ఆశిస్తున్న ఆదాయం) రెండో త్రైమాసికంలో వెయ్యి కోట్ల డాలర్లున్నట్టు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమీర్ సెస్కారియా అన్నారు. ఈ త్రైమాసికంలో అన్ని విభాగాల్లోనూ మంచి వృద్ధిని తాము నమోదు చేసినట్టు సమీర్ చెప్పారు.

మధ్యంతర డివిడెండ్: ఒక రూపాయి ముఖ విలువ గల ఒక్కో షేరుపై 11 రూపాయల రెండవ మధ్యంతర డివిడెండును టీసీఎస్ ప్రకటించింది. నవంబరు 4వ తేదీన ఈ డివిడెండును చెల్లిస్తారు. డివిడెండు పొందేందుకు అక్టోబరు 15 రికార్డు తేదీగా నిర్ణయించారు. బీఎస్ఈలో గురువారం టీసీఎస్ షేరు 1.16% లాభంతో రూ.3,061.95 వద్ద ముగిసింది.

డేటా సెంటర్ల కోసం ప్రత్యేక అనుబంధ సంస్థ

ఇన్‌ఫ్రా, టెక్నాలజీ ఆధారిత సేవలందించగల ఏఐ, స్వతంత్ర డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పూర్తి యాజమాన్య అనుబంధ సంస్థ ఒకటి ఏర్పాటు చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. దేశంలో 1 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ కోసం ఒక ప్రత్యేక వ్యాపార విభాగం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపింది. అలాగే మార్కెటింగ్ క్లౌడ్, సీఆర్ఎం, డేటా క్లౌడ్, ఏజెంట్ ఫోర్స్, ఏఐ అడ్వైజరీ సర్వీసుల్లో స్పెషలైజేషన్ గల అమెరికాకు చెందిన లిస్ట్‌ఎంగేజ్ కంపెనీని 7.28 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసినట్టు తెలియ చేసింది.

3 నెలల్లో 20,000 మంది ఔట్

మారుతున్న వ్యాపార ముఖచిత్రానికి దీటుగా కంపెనీ పునర్నిర్మాణం పేరిట టీసీఎస్ ఒక్క త్రైమాసికంలోనే (జూలై-సెప్టెంబరు) సుమారు 20 వేల మందికి ఉద్వాసన చెప్పినట్టు కంపెనీ వెబ్‌సైట్‌లోని గణాంకాలు తెలుపుతున్నాయి. జూన్ త్రైమాసికం చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 6,13,069 ఉండగా సెప్టెంబరు చివరి నాటికి 5,93,314 ఉన్నట్టు అందులో ఉంది. అంటే నికరంగా తొలగించిన ఉద్యోగులు 19,755 అయితే కంపెనీ మాత్రం ఆ సంఖ్యను తగ్గించి చూపుతోందని ఐటీ ఉద్యోగుల యూనియన్ నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ సెనేట్ (నైట్స్) ఆరోపించింది. అయితే గురువారం ఆర్థిక ఫలితాల సందర్భంగా కంపెనీ సీహెచ్ఆర్ఓ సుదీప్ కున్నుమల్ మాత్రం తాము తొలగించింది 6,000 మంది మాత్రమేనని చెప్పారు. అయితే బీఎస్ఈకి పంపిన సమాచారంలో మాత్రం కంపెనీ ప్రకటించిన సంఖ్యలో త్రైమాసికం చివరి నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్యను, ఉద్యోగుల వలసల సంఖ్యను మినహాయించారని నైట్స్ ఆరోపిస్తోంది. అయితే కంపెనీ వెబ్‌సైట్‌లో మాత్రం పైన పేర్కొన్న గణాంకాలున్నాయని తెలిపింది. టీసీఎస్ వంటి సంస్థ చూపిన గణాంకాల్లోని ఈ వ్యత్యాసం ఏదో పొరపాటు చర్యగా భావించలేమని... రెగ్యులేటర్లు, విధానకర్తలు, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేసిన ఉద్దేశపూర్వక చర్య అని నైట్స్ వాదిస్తోంది.

హెటిరో ల్యాబ్స్‌కు ఎఫ్‌డీఏ సెగ

ముంబై: హెటిరో లేబొరేటరీస్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ ఎఫ్‌డీఏ) సెగ తగిలింది. ఆంధ్రప్రదేశ్‌లోని నక్కపల్లి ప్లాంట్ ఉత్పత్తి విధానాలపై ఎఫ్‌డీఏ ఆరు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. డాక్యుమెంటేషన్ ప్రక్రియలో తేడాలతో పాటు ఈ ప్లాంట్‌లో తయారయ్యే ఉత్పత్తులను కంపెనీ ఒక అన్‌రిజిస్టర్డ్ ల్యాబ్‌లో పరీక్షిస్తోందని తెలిపింది. దీంతో ఈ ప్లాంటు నుంచి యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ), యాంటీ రిట్రో వైరల్ ఔషధాల సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత నెల 19 నుంచి 26 వరకు ఎఫ్‌డీఏ అధికారులు హెటిరో ల్యాబ్స్‌లో తనిఖీలు చేసినప్పుడు ఈ లోపాలను గుర్తించారు.

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీఓకి రూ.4 లక్షల కోట్ల బిడ్లు

దేశ ఐపీఓ చరిత్రలో కొత్త రికార్డు
54 రెట్ల ఓవర్ సబ్‌స్ర్కిప్షన్

న్యూఢిల్లీ: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) సూపర్ డూపర్ హిట్టయింది. రూ.11,607 కోట్ల సమీకరణ కోసం ఈ కంపెనీ ఐపీఓ ద్వారా 7.13 కోట్ల షేర్లు జారీ చేయగా ఆఖరి రోజైన గురువారానికి 385 కోట్ల షేర్లకు (54.02 రెట్లు) బిడ్స్ వచ్చాయి. అప్పర్ ప్రైస్ బ్యాండ్ ప్రకారం చూస్తే ఇది దాదాపు రూ.4.4 లక్షల కోట్లకు సమానం. భారత పబ్లిక్ ఇష్యూ మార్కెట్ చరిత్రలో ఇప్పటి వరకు మరే ఐపీఓ ఇంత భారీ స్థాయిలో సబ్‌స్ర్కైబ్ కాలేదు. గత ఏడాది సెప్టెంబరులో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు వచ్చిన రూ.3.24 లక్షల కోట్లే ఇప్పటి వరకు రికార్డు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓ ఆ రికార్డును తిరగరాసింది.

వెండి ధర రికార్డు స్థాయికి: వెండి ధర రేసు గుర్రంలా పరిగెడుతోంది. గురువారం ఢిల్లీలో కిలో వెండి ధర ఒకే రోజు రూ.6,000 పెరిగి రూ.1.63 లక్షలకు చేరి రికార్డు సృష్టించింది. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు కిలో వెండి ధర 72 శాతం పెరిగినట్టయింది. మరోవైపు పది గ్రాముల మేలిమి బంగారం ధర మాత్రం రూ.1,236,600 వద్ద స్థిరంగా ఉంది. గత వారం రోజుల్లో ఢిల్లీలో కిలో వెండి ధర ఒకే రోజు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) వెండి ధర 50 డాలర్ల పైకి చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది.

సెన్సెక్స్ 398 పాయింట్లు అప్

కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీ కంపెనీల షేర్ల కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్ గురువారం పునరుజ్జీవం సాధించింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సైతం సెంటిమెంట్ పుంజుకునేందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 398.44 పాయింట్ల లాభంతో 81,172.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 135.65 పాయింట్ల లాభంతో 25,181.80 వద్ద క్లోజైంది.

నాట్కో 'రిస్డిప్లామ్'కు ఓకే

న్యూఢిల్లీ: బహుళ జాతి ఔషధ కంపెనీల అడ్డగోలు దోపిడీకి ఢిల్లీ హైకోర్టు చెక్ పెట్టింది. అరుదైన వెన్నెముక కండరాల క్షీణత (ఎస్ఎంఏ) వ్యాధి చికిత్సలో ఉపయోగించే 'రిస్డిప్లామ్' ఔషధాన్ని జెనరిక్ ఔషధ రూపంలో దేశీయ మార్కెట్లో విడుదల చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన నాట్కో ఫార్మాకు ఢిల్లీ హైకోర్టు అనుమతినిచ్చింది. దీనికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను జస్టిస్ సీ హరిశంకర్, జస్టిస్ దిగ్‌పాల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది.

కేసు పూర్వాపరాలు: 'రిస్డిప్లామ్' అనే ప్రాణరక్షక ఔషధంపై స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేసే రోష్ సంస్థకు పేటెంట్ హక్కులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీ ఈ ఔషధాన్ని 'ఎవిస్డి' పేరుతో ఒక్కో బాటిల్ రూ.6 లక్షల చొప్పున భారత్‌లో మార్కెట్ చేస్తోంది. నాట్కో ఫార్మా దీనికి జెనరిక్ వెర్షన్‌లో బాటిల్ రూ.15,900కే అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. ఇది తమ పేటెంట్ హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని రోష్.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. అయితే రోష్ వాదనలో పెద్దగా పస లేదని, చిన్నచిన్న మార్పులతో ఎప్పటికప్పుడు కొత్త ఔషధమని చెబుతూ పేటెంట్ గడువు పొడిగించుకుంటోందని నాట్కో కోర్టుకు తెలిపింది. ఈ వాదన విన్న ఢిల్లీ

ఢిల్లీ హైకోర్టులో రోష్ కంపెనీకి చుక్కెదురు

హైకోర్టు సింగిల్ జడ్జి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నాట్కో చౌకగా తన జెనరిక్ ఔషధాన్ని విడుదల చేసేందుకు అనుమతించారు. దీనిపై రోష్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పీల్ చేసింది. తాజాగా ద్విసభ్య ధర్మాసనం కూడా ఆ తీర్పును సమర్థించడంతో రోష్‌కు చుక్కెదురైంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,150 ▲	1,13,800 ▲	1,69,000 ▲
విజయవాడ	1,26,800 ▲	1,22,000 ▲	1,69,000 ▲
విశాఖపట్నం	1,26,740 ▲	1,14,000 ▲	1,77,000 ▲
రాజమండ్రి	1,24,150 ▲	1,13,800 ▲	1,56,000 ▲
ప్రొద్దుటూరు	1,28,000 ▲	1,17,700 ▲	1,60,000 ▲
ముంబై	1,22,629 ▲	1,12,328 ▲	1,59,550 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	540
వరంగల్	522	గోదావరి	535
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	124
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	97
కర్నూలు	102	నెల్లూరు	102
విశాఖపట్నం	127	అనంతపురం	102
గోదావరి	124		

హైదరాబాద్ జీసీసీల అడ్డా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రానున్న రోజుల్లో తెలంగాణ నెక్స్ట్ జెన్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) హబ్‌గా అవతరించనుందని స్పెషాలిటీ స్టాఫింగ్ సంస్థ ఎక్స్‌ఫినో వెల్లడించింది. గురువారం నాడిక్కడ సంస్థ సహ వ్యవస్థాపకుడు కమల్ కరంత్, సీఈఓ ఫ్రాన్సిస్ పదమదన్ మాట్లాడుతూ.. గడచిన 30 నెలల్లో భారత్‌లో కొత్తగా 300 జీసీసీలు ఏర్పాటు కాగా అందులో 64 ఒక్క హైదరాబాద్‌లో ఏర్పాటయ్యాయన్నారు. ఇదే సమయంలో బెంగళూరులో 52 జీసీసీలు ప్రారంభయ్యాయని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 360 జీసీసీలు ఉండగా వీటిల్లో 3.1 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాగా సంవత్సరాంతం నాటికి మరో 30 వరకు జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభం కావచ్చని భావిస్తున్నట్లు చెప్పారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



హంగేరియన్ రచయిత
లాస్లో క్రాస్జ్నహోర్కైకు సాహిత్య నోబెల్ 10

శుక్రవారం | 10-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 192 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా.7.39 తదుపరి పంచమి; నక్షత్రం: కృత్తిక సా.5.31 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ.6.46-8.12; దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, మ.12.25-1.12; అమృతఘడియలు: మ.3.22-4.48; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.10; సూర్యాస్తమయం: 5.53 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్థానిక ఎన్నికలకు బ్రేక్!

బీసీలకు 42% రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే.. 50% మించరాదన్న వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం

- నిలిచిపోయిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ
- సర్కారుకు నోటీసులు.. కౌంటర్‌కు 4 వారాల గడువు
- పిటిషనర్ల సమాధానానికి మరో 2 వారాలు
- ఆరు వారాల పాటు విచారణ వాయిదా
- బీసీల ఇంప్లీడ్ పిటిషన్లు విచారణకు స్వీకరణ
- రాష్ట్రపతి వద్ద 3 నెలలుగా 42% రిజర్వేషన్ల బిల్లులు
- ఇటీవలి సుప్రీం తీర్పు నేపథ్యంలో అవి చట్టాలైనట్లే..
- ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కోర్టులు జోక్యం చేసుకోరాదని స్పష్టమైన తీర్పులున్నాయి
- 50% పరిమితి రాజకీయ రిజర్వేషన్లకు వర్తించదు
- రిజర్వేషన్లపై అసెంబ్లీకి చట్టం చేసే అధికారముంది
- ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదీర్ఘ వాదన



హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠ భరితంగా మారిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను హైకోర్టు నిలిపేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై స్టే విధిస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జీవోపై స్టే ఇవ్వడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని సుప్రీంకోర్టు విధించిన పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించిందన్న పిటిషనర్ల వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. దీనిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి నాలుగు వారాలు, ప్రభుత్వ కౌంటర్‌కు ప్రత్యుత్తరం ఇవ్వడానికి పిటిషనర్లకు రెండు వారాల సమయం ఇచ్చింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా

మిగతా 11వ పేజీలో...

సుప్రీం తీర్పు మేరకు బీసీ బిల్లును ఆమోదించినట్లే!

- రాష్ట్రపతి ఆమోదం పొంది.. చట్టం అయినట్లే
- అందుకే బీసీలకు రిజర్వేషన్లపై జీవో ఇచ్చాం 12
- 42% ను అడ్డుకున్నదే బీజేపీ, బీఆర్ఎస్: భట్టి
- స్టే ఉత్తర్వులు పరిశీలించాక తదుపరి కార్యాచరణ: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే స్టే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు 11
- '9'తో కాంగ్రెస్ భూస్థాపితం: కేంద్ర మంత్రి బండి
- బీసీలకు కాంగ్రెస్, బీజేపీ వెన్నుపోటు: కేటీఆర్

ఇలా మొదలైన నామినేషన్లు..
అలా బ్రేకేసిన హైకోర్టు!
- ఉదయాన్నే నోటిఫికేషన్లు ఇచ్చిన కలెక్టర్లు.. 119 మంది అభ్యర్థుల నామినేషన్లు దాఖలు
- స్టే రావడంతో నోటిఫికేషన్‌లు నిలిపివేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన 11



అమెరికా ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

చైనా ప్లస్ 1 వ్యూహానికి తెలంగాణ
అత్యుత్తమ ఎంపిక

- న్యూయార్క్, టోక్యో, సియోల్‌తో మన రాజధాని హైదరాబాద్ పోటీ
- ఫార్చ్యూన్ 500 కంపెనీలన్నీ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలి
- పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదు: సీఎం
- హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులతో భేటీ

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలకులు మారినప్పుడల్లా ప్రభుత్వ విధానాలు కూడా మార్చుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానాలను తమ ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తోందని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 16 మంది ప్రతినిధులతో గురువారం ఆయన సచివాలయంలో సమావేశమయ్యారు. వివిధ రంగాలకు చెందిన మేధావులు, బిజినెస్ లీడర్లు ఈ బృందంలో ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో, భారత్

మిగతా 12వ పేజీలో...



పట్టుబడిన సొమ్ముతో తహసీల్దార్ కృష్ణ

మ్యుటేషన్ కోసం రూ.5లక్షల లంచం

- ఏసీబీకి చిక్కిన నల్లగొండ జిల్లా చిట్యాల తహసీల్దార్ 12
- రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్‌లో 220 కిలోల
ఎపిడ్రిన్ స్వాధీనం

- దీని ధర దేశీయ మార్కెట్లో 10 కోట్లు
- అంతర్జాతీయ మార్కెట్లో రూ. 70 కోట్లు
- నలుగురు ముఠా సభ్యుల అరెస్టు 9
- జీడిమెట్లలో ఈగల్ బృందాల ఆపరేషన్

హరియాణా డీజీపీపై కేసు

- సీఎంకు దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ భార్య లేఖతో ఎట్టకేలకు కేసు
- తన భర్త ఆత్మహత్యకు డీజీపీ శత్రుజీత్ కపూర్, ఎస్పీ నరేంద్రలే కారణమని ఆరోపణ
- కొందరు సీనియర్లు కుల వివక్షతో వేధింపులకు గురి చేశారని ఆవేదన
- డీజీపీ డైరెక్షన్‌లో పూరన్ కుమార్‌పై కుట్ర పన్నారని వెల్లడి

10

ఇదిగో 'శాంతి'.. ఏదీ బహుమతి?

- ట్రంప్ శాంతి ప్రణాళిక తొలిదశ అమలుకు ఇజ్రాయెల్, హమాస్ ఓకే
- నోబెల్ శాంతి బహుమతి ఆశతో ఇరువర్గాలపై ట్రంప్ తీవ్ర ఒత్తిడి!
- చర్చల తర్వాత పలు అంశాలపై స్పష్టత
- పరస్పరం బందీల విడుదలకు ఏర్పాట్లు
- ఇక గాజాలో శాశ్వత శాంతి: ట్రంప్
- దేవుడి దయతో మా వాళ్లు తిరిగొస్తున్నారు: నెతన్యాహు
- ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పాటించేలా చూడాలి: హమాస్
- ట్రంప్‌తో మాట్లాడి అభినందించా: మోదీ



వాషింగ్టన్, అక్టోబరు 9: గాజాలో రెండేళ్లుగా కొనసాగుతున్న మారణహోమానికి తెరపడేందుకు రంగం సిద్ధమైంది. నోబెల్ శాంతి బహుమతిపై ఆశతో గాజాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో చేసిన ప్రయత్నాలు ఓ కొలిక్కి వచ్చాయి. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక తొలిదశ అమలుకు ఇజ్రాయెల్, హమాస్

మిగతా 10వ పేజీలో...

సమాచారం కావాలంటే..
29 ఏళ్లు

- తెలంగాణ సమాచార కమిషన్‌లో అప్పీళ్ల పరిష్కార సగటు వేగం ఇది..
- త్రిపురలో 23 ఏళ్లు, ఛత్తీస్‌గఢ్‌లో 11 ఏళ్లు
- 18 రాష్ట్రాల్లో ఏడాదికి మించి సమయం
- దేశంలో 3వ వంతు సమాచార కమిషన్లు బాధ్యతలు నిర్వర్తించని వైనం
- ఆర్టీఐ స్వచ్ఛంద సంస్థ సార్థక్ నాగరిక్ సంఘటన్

న్యూఢిల్లీ, అక్టోబరు 9: తెలంగాణ సమాచార కమిషన్‌కి తాజాగా ఏదైనా అప్పీలు వస్తే దాని పరిష్కారానికి 29 ఏళ్లు పడుతుందని రెండు దశాబ్దాలుగా సమాచార హక్కు ఉద్యమంలో భాగస్వామిగా ఉన్న స్వచ్ఛంద సంస్థ సార్థక్ నాగరిక్ సంఘటన్ తెలిపింది. నెలల వారీగా దరఖాస్తుల పరిష్కార వేగం ఆధారంగా ఈ అంచనాకు వచ్చింది. అంటే, తెలంగాణలో ప్రస్తుతం ఎవరైనా తనకు

మిగతా 10వ పేజీలో...

నకిలీ లెక్చరర్లు!



- తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి జూనియర్ లెక్చరర్లుగా క్రమబద్ధీకరణ పొందిన 700 మంది
- వరంగల్ ఆర్‌జేడీ నేతృత్వంలోని కమిటీ నిర్ధారణ
- అప్పట్లో తలా 5 లక్షల దాకా నేతలకు, బోర్డు అధికారులకు నకిలీలు ఇచ్చుకున్నట్లు ఆరోపణలు
- ఉద్యోగాలు కాపాడుకునేందుకు తాజాగా మళ్లీ డబ్బులు పోగేస్తున్నట్లు వినికిడి
- నకిలీలపై చర్యలు చేపట్టకుండా ఉండేందుకు ఉన్నత స్థాయిలో బోర్డు అధికారుల పైరవీలు
- సీఎం దృష్టి పెట్టాలని నిరుద్యోగ జేఏసీ డిమాండ్

నల్లగొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ వ్యవహారంలో అక్రమాలు జరిగాయని, 700 మంది నకిలీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించి క్రమబద్ధీకరణ పొందారని తేలింది. రెండేళ్ల క్రితం.. అంటే 2023లో రాష్ట్రవ్యాప్తంగా 3,800 మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఈ లెక్చరర్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలనను చేపట్టిన వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) నేతృత్వంలోని

మిగతా 9వ పేజీలో...



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల్ని అడ్డుకుంటున్న పోలీసులు

బీఆర్ఎస్ చలో బస్‌భవన్ ఉద్రిక్తం

- సిటీబస్సుల్లో చార్జీల పెంపునకు నిరసనగా కార్యక్రమం
- ఆర్టీసీ బస్సుల్లో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు ఆ పార్టీ నేతలు
- కాలినడకన బస్ భవన్‌కు.. ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం
- బస్సుల రాకపోకలు అడ్డుకునేందుకు పార్టీ శ్రేణుల యత్నం.. పలువుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు 7



థాయ్‌లాండ్ అడవుల్లో
వెంకటేశ్వరుడు!

7

వివరాలు నవ్య పేజీలో..

భారత్-యూకే భాగస్వామ్యం.. ప్రపంచ
సుస్థిరతకు మూల స్తంభం!

- ఇరుదేశాల మధ్య బంధం నమ్మకమైనది
- ప్రతిభ, సాంకేతికతతో ముందుకెళ్తోంది
- బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో చర్చల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
- భారత వృద్ధి పథంలో భాగస్వాములవ్వండి
- అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపు
- ఖలిస్థానీ తీవ్రవాదంపైనా స్టార్మర్‌తో చర్చ!
- రక్షణ రంగంలో ఇరుదేశాల మధ్య రూ. 4151 కోట్ల ఒప్పందం
- స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం గొప్ప ముందడుగు: బ్రిటన్ ప్రధాని స్టార్మర్
- భారత్‌లో కొత్తగా 9 బ్రిటన్ వర్సిటీలు



బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో ప్రధాని మోదీ

ముంబై, అక్టోబరు 9: భారత్, యూకేలు సహజ భాగస్వాములని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇరు దేశాల మధ్య బంధాలు మరింత వృద్ధి చెంది.. ప్రపంచ సుస్థిరతకు, ఆర్థికాభివృద్ధికి మూల స్తంభంగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం

మిగతా 10వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి కుసుమిస్తుందా?

అమెరికా అధ్యక్షుడి నోబెల్ శాంతి పురస్కార కాంక్ష రెండేళ్ళ యుద్ధాన్ని కొలిక్కితెస్తున్నట్టుంది. పతకం మోజులో ఆయన పాలస్తీనియన్లకు అన్యాయం చేశాడనీ, అయినా, అరబ్, ముస్లిం దేశాలు కక్కలేక, మింగలేక ఆ ఇరవైసూత్రాల శాంతిపథకాన్ని పొగుడుతున్నాయని కొందరు విమర్శిస్తున్నారు. మొదట్లో దోహాలోనూ, శ్వేతసౌధంలోనూ ఒకే రీతిలో ఉన్న ఆ ప్రణాళిక ఆ తరువాత నెతన్యాహూ వైపు బాగా మొగ్గి, ట్రంప్ ఒత్తిళ్ళు, హెచ్చరికలు, లక్ష్మణరేఖల బలంతో బలవంతంగా పట్టాలెక్కిందని అంటున్నారు. ఎవరు చెప్పారు మనకు నష్టం జరుగుతోందని, మన సైనికులు వెనుకడుగువేయాలని, ఊసేలేని పాలస్తీనా రాజ్యాన్ని మనం ఒప్పుకుంటున్నామని? అంటూ హిబ్రూలో బెంజమెన్ నెతన్యాహూ తన ప్రజలకు భరోసా ఇస్తున్నారు. గాజా మీద ఏకపక్ష యుద్ధంలో వేలాది మందిని సంహరించి, లక్షల మందిని నిరాశ్రయులను చేసి, దానిని వల్లకాడుగా మార్చినా కూడా నెతన్యాహూ సాధించలేక పోయినదానిని శాంతిప్రణాళిక పేరిట శ్వేతసౌధం ఆయనకు పళ్ళెంలో పెట్టి ఇచ్చింది. హమాస్ దుంపనాశనం, బందీల విడుదల తన లక్ష్యాలుగా, యుద్ధాన్ని నచ్చినంత కాలం, ట్రంప్ మెచ్చినంతవరకూ పొడిగిస్తూ వచ్చిన ఇజ్రాయెల్ అధినేతకు యుద్ధక్షేత్రంలో దక్కనిది శ్వేతసౌధంలో చిక్కింది. బందీలను వెనక్కు తెచ్చేవరకూ వెనకడుగువేయబోనని శపథం చేసి, అంతిమంగా నిలబెట్టుకున్నాను అని నెతన్యాహూ గర్వపడుతున్నారు. మితవాదులు, మహా జాతీయవాదులు, మత దురహంకారులతో నిండిన ఆయన కూటమి ప్రభుత్వంలోని నాయకులు మాత్రం, గాజాలో ఒక్క పాలస్తీనా ప్రాణి కూడా మిగలకూడదన్న మా లక్ష్యం ఇక నెరవేరదా? అని వాపోతున్నారు.

ప్రకటిత కాల్పుల విరమణ ఒప్పందం కడవరకూ నిలిచి, అన్ని దశలూ పూర్తిచేసుకోవడం ప్రధానం. బందీల అప్పగింతలు, సైనికుల వెనుకడుగుల లెక్కలు రాసుకున్నదానికి అనుగుణంగా సాగినప్పుడే ట్రంప్‌ను ప్రపంచ దేశాధినేతలు కీర్తిస్తున్న ఈ సందర్భానికి అర్థం ఉంటుంది. ఒప్పందం కుదిరిందన్న ప్రకటనతో అటు ఇజ్రాయెల్‌లోనూ, ఇటు గాజాలోనూ వెల్లువెత్తిన హర్షాతిరేకాలు ఇక శాశ్వతంగా నిలవాలి. అనేకసార్లు ఒప్పందాలకు మోకాలడ్డిన నెతన్యాహూను ఇటీవల ఖతార్ మీద చేసిన దాడి ఈమారు ఆత్మరక్షణలో పడవేసింది. శాంతిచర్చలు ముందంజలో ఉండగా, కీలకమైన హమాస్ నేతలను మట్టుబెట్టడం ద్వారా నెతన్యాహూ అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన తన యుద్ధ కాంక్షను మరోమారు వెళ్ళగక్కడం కంటే, మధ్య ఆసియాలో తనకు అత్యంత కీలకమైన, అతి మిత్రదేశమైన ఖతార్‌లోకి ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు చొరబడి బాంబులు కురిపించిన ఆ ఘటనను అమెరికా అధ్యక్షుడు వెనకేసుకురావడం అరబ్ దేశాలను నిర్ఘాంతపరిచింది. దోహాపై దాడిని నెతన్యాహూ తనకు చెప్పే చేశాడని ఒకసారి, తన ప్రమేయంలేదని మరోసారి, అయినా తప్పేనని వ్యాఖ్యానించి ట్రంప్ కూడా పరువుపోగొట్టుకున్నారు. రక్షణకవచంగా ఉంటానన్న అమెరికా అలా భక్షకుడి పక్షాన నిలిచి తమకు ధోకా ఇచ్చినందుకు అరబ్‌దేశాలు ఆగ్రహించడమే కాక, అవన్నీ బలంగా జట్టుకట్టడం మొదలైంది. దీంతో, అప్పటివరకూ తలెగరేస్తూవచ్చిన నెతన్యాహూ మెడలు వంచి శ్వేతసౌధం నుంచే ఖతార్ అధినేతకు ఫోన్‌లో సారీ చెప్పించడం ద్వారా ట్రంప్ కొంత ప్రాయశ్చిత్తం చేసుకున్నారు. ప్రత్యేక ఆదేశాలతో ఖతార్ భద్రతకు మరింత కట్టుబడ్డారు.

అరబ్ దేశాలు చేజారిపోతూ, మరోపక్క పాలస్తీనా రాజ్యాన్నీ, ఇరుగుపొరుగు సిద్ధాంతాన్నీ ఐరోపా అధినేతలంతా బలంగా ముందుకు తోస్తున్న తరుణంలో సమయం మించిపోతున్న సంగతి ట్రంప్ గ్రహించినట్టు ఉంది. తాను అధికారంలోకి రాగానే ఒక్క టెలిఫోన్ కాల్‌తో రష్యా అధ్యక్షుడు పుతిన్ మెడలు వంచగలననీ, ఒక్కరోజులో ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలననీ భ్రమసిన ట్రంప్‌ను అసహనం ముంచెత్తుతోంది. ఏడుయుద్ధాలు ఆపినా, బరాక్ ఒబామాను ప్రశంసించిన మాదిరిగా మిగతా ప్రపంచం తనను కీర్తించనందుకు ఆగ్రహం కలుగుతోంది. తనకు నోబెల్ రాకపోతే అమెరికాకే అవమానమని వారం క్రితం కూడా హెచ్చరించిన ట్రంప్, రాజ్యవిస్తరణ లక్ష్యంతో రగిలిపోతున్న నెతన్యాహూను నియంత్రించి, ఒప్పందాన్ని తుదివరకూ నిలబెట్టి, యుద్ధాన్ని ముగించాలి.

ఈ అధర్మదాడికి జవాబుదారీ ఎవరు?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పైకి బూటు విసిరిన న్యాయవాది పేరు రాకేశ్ కిశోర్ కాకుండా రహీమ్ ఖాన్ అయి ఉంటే ఏమి జరిగి ఉండేది? ఆసక్తికరమైన ప్రశ్న, సందేహం లేదు. పాల్పడిన అపరాధానికి శిక్షించకుండా అతడిని వదిలివేయడం జరిగేది కాదు. జాతీయ భద్రతా చట్టం, (కశ్మీరీ ముస్లిం అయి ఉంటే) ప్రజా భద్రత చట్టం, బహుశా, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద కూడా అతడు తప్పక అభియోగాలను ఎదుర్కోవలసివచ్చేది. నాగరిక సంస్కారం లోపించిన ప్రజాభిప్రాయం నేర న్యాయ విచారణ ప్రక్రియను ప్రభావితం చేయగల విద్వేషపూరిత, సంకుచిత సంఘర్షణలు ప్రబలంగా ఉన్న సామాజిక పర్యావరణ వ్యవస్థపై దృష్టి పెట్టేలా ప్రజలను పురిగొల్పేందుకే నేను ఆ ప్రశ్నను సంధించాను.

సీజేఐపై బూటు దాడికి దారితీసిన ఘటనల క్రమాన్ని నిశితంగా చూద్దాం. ఖజురహోలోని ఒక ఆలయంలో విరిగిన విష్ణుమూర్తి ప్రతిమ నొకదానికి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి గవాయ్ కొట్టివేశారు. ఆ సందర్భంగా 'ఇది, ప్రచార కండూతితో దాఖలు చేసిన పిటిషన్' అని సీజేఐ వ్యాఖ్యానించారు. 'పిటిషనర్ విష్ణువుకు భక్తవరేణ్యుడు అయితే ఆయనే దేవుడిని ప్రార్థించాలి, కొంచెం ధ్యానం చేయాలి' అని కూడా గవాయ్ అన్నారు. ఒక విధంగా వెటకారం ధ్వనిస్తున్నట్టుగా ఉన్న ఆయన మాటలు పూర్తిగా అనవసరమైనవి. అయితే అవి విచారణలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యలు మాత్రమే అని గుర్తుంచుకోవాలి. ఖజురహోలో విష్ణు ప్రతిమ పునః ప్రతిష్ఠాపన కోర్టు పరిధిలోని అంశం కాదని, దానిపై నిర్ణయం తీసుకోవల్సింది భారత పురావస్తు సర్వే అని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

సర్వోన్నత న్యాయస్థానం సహేతుక తీర్పులు చదివే విజ్ఞత, సామాజిక మాధ్యమాల్లో చెలరేగిపోతుండే రాజకీయ, సైద్ధాంతిక సేనా శ్రేణులకు దురదృష్టవశాత్తు పూర్తిగా కొరవడింది. ఖజురహో విష్ణుమూర్తి విగ్రహంపై సీజేఐ వ్యాఖ్యలు మితవాద రాజకీయ, సైద్ధాంతిక బృందాల నుంచి అనియంత్రిత ఆగ్రహావేశాల ప్రతిస్పందనలను వెల్లువెత్తించాయి. దేశ పాలకుల అండదండలు ఉన్నందునే ఈ మితవాద శ్రేణులు అలా రెచ్చిపోయాయి. వ్యూహాత్మకంగా వెల్లువెత్తిన ఈ 'ప్రజాగ్రహం'తో తన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వడం సీజేఐకి అనివార్యమయింది. 'తాను మతాలను విశ్వసిస్తానని, అన్ని మతాల ఆరాధనా మందిరాలను సమరీతి భక్తి ప్రపత్తులతో సందర్శిస్తుంటానని, 'నిజమైన లౌకికవాదం'లో తనకు సంపూర్ణ నమ్మకం ఉందని' గవాయ్ అన్నారు. అయితే ఈ వివరణ సామాజిక మాధ్యమాలలో ఆయనపై తీవ్ర విమర్శలు చేస్తున్న కరడుగట్టిన మితవాదులను సంతృప్తిపరచలేదు. సరికదా మరింత తెగింపుతో మీమ్‌లు, హ్యాష్ ట్యాగ్‌లు, యూట్యూబ్ వీడియోలతో సీజేఐ గవాయ్‌పై తమ దాడిని కొనసాగించారు.

ఈ ఆవేశపూరిత వాతావరణంలో 71 సంవత్సరాల సీనియర్ న్యాయవాది రాకేశ్ కిశోర్, సుప్రీంకోర్టులో సీజేఐ గవాయ్‌పై బూటును విసిరివేయడం ద్వారా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేయదలుచుకున్నాడు. 'సనాతన్ ధర్మ్ కా అప్మాన్, నహి సహేగా హిందుస్థాన్!' (సనాతన ధర్మానికి అవమానం కలిగితే భారతదేశం సహించదు) అని వ్యాఖ్యానించాడు. తనపై దాడి పట్ల జస్టిస్ గవాయ్ సంయమనంతో వ్యవహరించి, విచారణ విధులు కొనసాగించారు. బూటు విసిరిన సనాతనవాదిపై కేసు దాఖలు చేసేందుకు తిరస్కరించారు. తన అనాగరిక చర్యపట్ల రాకేశ్ కిశోర్‌లో ఎలాంటి పశ్చాత్తాపం లేదు. తనకు లభించిన 'ప్రఖ్యాతి'కి ఆనందిస్తూ 'అటువంటి పని మళ్లీ చేస్తాను' అని కూడా రాకేశ్ కిశోర్ అన్నాడు. ఈ మహాశయుడిపై స్వయంగా చర్య చేపట్టవలసిన ఢిల్లీ పోలీసులు సీజేఐపై బూటు దాడి వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా మిన్నకుండిపోయారు. దీంతో కోర్టు ధిక్కారానికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్ మరింత నిర్భయంగా ఏవేవో మాట్లాడడం కొనసాగిస్తున్నారు. తన చర్యను సమర్థిస్తున్న వారి నుంచి మరింతగా ప్రశంసలు అందుకుంటున్నారు. సమాజ జీవితం నుంచి బహిష్కరణకు గురికావల్సిన అపరాధికి ఇటువంటి వైభవం లభించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

సీజేఐపై దాడిపట్ల న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ మౌనంగా ఉండిపోయారు. బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఘటన సంభవించిన ఎనిమిది గంటల అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిస్పందించారు. 'ఈ ఉదయం సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి పట్ల ప్రతి భారతీయుడూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. మన సమాజంలో ఇలాంటి అనాగరిక చర్యలకు తావులేదు. ఇది పూర్తిగా ఖండించదగినది' అని ప్రధానమంత్రి ట్వీట్ చేశారు. స్వాగతించాల్సిన మాటలు, సందేహం లేదు. అయితే ఈ సందర్భంలో ఒక పాత విషయాన్ని గుర్తు చేసుకోవల్సిన అవసరమున్నది. 2019లో నాథూరామ్ గాడ్సేను బీజేపీ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాకూర్ కొనియాడారు. దీనిపై మోదీ ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమెను పూర్తిగా క్షమించలేనని అన్నారు. అయితే ఆ బీజేపీ ఎంపీపై ప్రభుత్వం గానీ, పార్టీ గానీ ఎలాంటి చర్య తీసుకోలేదు. మరింత గందరగోళానికి ఆస్కారమివ్వకుండా ప్రగ్యా ఠాకూర్ తన పార్లమెంటు సభ్యత్వ కాలాన్ని పూర్తిచేశారు. ఆమె హిందూత్వ భావజాల అనుయాయి. కనుకనే గాడ్సేను మెచ్చుకోవడానికి వెనుకాడలేదు. ఆ మాటకు వస్తే సంఘ్ పరివార్ ఇప్పటికీ గాడ్సే ఆరాధన నుంచి తనను తాను దూరం చేసుకోలేదు.

తాను సనాతన ధర్మ 'రక్షకుడు'నని చెప్పుకున్న రాకేశ్ కిశోర్ కూడా సంఘ్ పరివార్ భావజాల వ్యవస్థలో భాగమే కదా. మహాత్ముడిని హతమార్చేందుకు గాడ్సే తుపాకీ పేల్చగా రాకేశ్ కిశోర్ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసేందుకు సాపేక్షంగా మృదు ఆయుధమైన ఒక బూటును ఉపయోగించుకున్నాడు. ఈ రెండు ఘటనల్లోనూ అసహన మనస్తత్వమే ప్రస్ఫుటమయిందన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. 'హిందువుల మనోభావాలు' దెబ్బతిన్నాయన్న వ్యక్తిగత అవగాహనతోనే నాడు గాడ్సే, నేడు రాకేశ్ కిశోర్ అనుచిత చర్యలకు పాల్పడ్డారు. తమ మనోభావాలకు కలిగిన విఘాతంతో ఇరువురి భావోద్వేగాలు హింసాత్మకంగా పరిణమించాయి. మరి ఈ ప్రచండ హిందూత్వ వాదులు 'San Tan Se Juda' (ఇస్లామ్‌ను దూషించినందుకు శిక్ష శరీరం నుంచి తలను నరికివేయడం) అని నినదించే ఇస్లామిస్టుల నుంచి ఎలా భిన్నమైనవారు? మనోభావాలు దెబ్బతినడం అన్నది ఒక మత సమూహానికే పరిమితం కాక, భిన్న మత సమూహాలలో పరివ్యాప్తమై ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో సీజేఐపై బూటు దాడిని మాత్రమే ఖండిస్తే సరిపోదు. మనోభావాల విఘాతానికి హింసాత్మకంగా ప్రతిస్పందించడం సమర్థనీయం కాదు. అది పూర్తిగా గర్హించవలసిన విషయం.

సీజేఐపై బూటు దాడి వ్యవహారంలో మరో సమస్యాత్మక కోణం ఉన్నది. భారత ప్రధాన న్యాయమూర్తి అయిన రెండో దళితుడు జస్టిస్ గవాయ్. నవ బౌద్ధ సంప్రదాయం, అంబేడ్కర్ భావజాలాన్ని విశ్వసించే ఒక రాజకీయ కుటుంబం నుంచి ఆయన ప్రభవించారు. జస్టిస్ గవాయ్ తండ్రి భారతీయ రిపబ్లికన్ పార్టీ ఉద్యమంలో ప్రముఖ నాయకుడు. జస్టిస్ గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తి కావడం సమాజంలోని అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు లభించాలన్న అంబేడ్కర్ స్వప్నసాకారానికి చిహ్నంగా భావించవచ్చు. దళిత ఉద్యమంలో కుటుంబ మూలాల కారణంగా జస్టిస్ గవాయ్ మొదటి నుంచి మితవాదుల దాడులకు గురవుతున్నారు. ఏడాది క్రితం 'బుల్డోజర్ న్యాయం'పై ఆయన తన తీర్పు వెలువరించినప్పుడు మితవాద బృందాల నుంచి తీవ్ర విమర్శలకు గురయ్యారు. 'బుల్డోజర్ న్యాయం'ను అమలుపరచడంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అగ్రగామిగా ఉన్నది. దృఢమైన, రాజీపడని హిందూత్వ ప్రభుత్వమది. మరి 'బుల్డోజర్ న్యాయం'కు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన జస్టిస్ గవాయ్‌పై హిందూత్వవాదులు ధ్వజమెత్తడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఈ నేపథ్యంలో సీజేఐపై బూటు దాడి వెనుక ఉన్న లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి. జనసమ్మతంగా ఉన్న రాజ్యాంగబద్ధ పాలనా వ్యవస్థలో 'సనాతన ధర్మ' ఆధిక్యతను నెలకొల్పేందుకు జరిగిన ప్రయత్నమే జస్టిస్ గవాయ్‌పై బూటు దాడి. న్యాయవాది రాకేశ్ కిశోర్ తన బూటు దాడిలో కేవలం జస్టిస్ గవాయ్‌ని మాత్రమే కాకుండా వివేకవంతమైన, న్యాయ బద్ధంగా, వివక్షారహితంగా పని చేస్తున్న న్యాయవ్యవస్థను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. ఆ నిష్పాక్షిక న్యాయవ్యవస్థను బెదిరించేందుకు, బలహీనపరిచేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమే ఆ దాడి. న్యాయవాది రాకేశ్ కిశోర్ చర్య ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించేందుకై ఒక పథకం ప్రకారం జరిగిన ప్రయత్నమే ఆ బూటు దాడి. తద్వారా అది ఒక రాజకీయ లక్ష్యాన్ని విస్పష్టంగా ప్రకటించింది. ఆ లక్ష్యమేమిటో ప్రజలు అందరూ గ్రహించాలన్న ధ్యేయంతోనే న్యాయవాది రాకేశ్ కిశోర్ తెంపరితనంతో ఆ చర్యకు పాల్పడ్డాడు. కొన్ని సంవత్సరాల క్రితం అయితే అతడిని మన సమాజంలో అధిక సంఖ్యాకులకు ఆమోద యోగ్యంగా లేని ఒక భావజాల అనుయాయిగా పరిగణించి ఉండేవారు. ఇప్పుడు పరిస్థితి అది కాదు. సమాన పౌరసత్వం ప్రాతిపదికన పని చేస్తున్న రాజ్యాంగబద్ధ పాలనా వ్యవస్థ స్థానంలో హిందూత్వ భావజాలంతో నడిచే పాలనా వ్యవస్థను నెలకొల్పడానికి ఆరాటపడుతున్న మెజారిటేరియన్ ప్రపంచ దృక్పథానికి అతడు ప్రతినిధి. అందుకే ఆ బూటు దాడి చాలా ప్రమాదకరమైనది, సమర్థించరానిది. బహుళ మతాలు విలసిల్లుతున్న సమాజంలో పాలనా వ్యవస్థ మత విశ్వాసాలకు అతీతంగా ఉండాలి. మతపరమైన మనోభావాలకు విఘాతం కలిగిందనే నెపంతో పాల్పడే ఎటువంటి హింసాత్మకచర్యలనైనా ప్రతి ఒక్కరూ నిర్ద్వంద్వంగా ఖండించాలి.

> **జనసమ్మతంగా ఉన్న రాజ్యాంగబద్ధ పాలనా వ్యవస్థలో 'సనాతన ధర్మ' ఆధిక్యతను నెలకొల్పేందుకు జరిగిన ప్రయత్నమే భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై బూటు దాడి. న్యాయవాది రాకేశ్ కిశోర్ తన చర్యకు కేవలం జస్టిస్ గవాయ్‌ని మాత్రమే కాకుండా వివేకవంతమైన, న్యాయబద్ధంగా, వివక్షారహితంగా పనిచేస్తున్న న్యాయవ్యవస్థనూ లక్ష్యంగా చేసుకున్నాడు. మతపరమైన మనోభావాలకు విఘాతం కలిగిందనే నెపంతో పాల్పడే ఎటువంటి హింసాత్మకచర్యలనైనా ప్రతి ఒక్కరూ నిర్ద్వంద్వంగా ఖండించాలి.**

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ట్రంప్ వ్యర్థ ప్రలాపాలు



■ సునీతా నారాయణ్

మట్టివాసన

వాతావరణ మార్పు ఒక 'మహా వంచన' – ఇది, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వక్కాణించిన మాట. ఐక్యరాజ్యసమితి 80వ సర్వ ప్రతినిధి సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ ఆరోపణ చేశారు. ఆయన ఉద్దేశంలో వాతావరణ మార్పును అరికట్టేందుకు తక్షణమే కార్యసాధక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నవారు అందరూ దగాకోరులే సుమా! తన అసంబద్ధ ప్రలాపంలో హరిత ఇంధన పరివర్తనకు ప్రయత్నిస్తోన్న యూరోప్‌ను ట్రంప్ మరీ నిందించారు. శిలాజ ఇంధనాలకు స్వస్తి చెప్పి హరిత ఇంధనాలను మరింతగా వినియోగించుకునేందుకు యూరోపియన్ దేశాలు చేస్తున్న ప్రయత్నాల వల్ల వ్యయాలు పెరుగుతాయి, అభివృద్ధి అంతమవుతుందని ఆయన విమర్శించారు. వాతావరణ మార్పును ధ్రువీకరిస్తున్న వైజ్ఞానిక నిదర్శనాలను ఆయన కొట్టివేశారు. బొగ్గు కాలుష్యరహిత స్వచ్ఛమైన ఇంధన వనరు అని ట్రంప్ నొక్కి చెప్పారు. మీ అవగాహనా సామర్థ్యాన్ని న్యూనపరిచేందుకో, ట్రంప్ వాదనలు ఎంత అహేతుకమో వివరించేందుకో నేను ఇది రాయడం లేదు. వాతావరణ మార్పు ఎంత వాస్తవమో మనకు అనుభవపూర్వకంగా తెలుసు. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ వైపరీత్యాలు పెచ్చరిల్లిపోతూ అపార ఆర్థిక విధ్వంసానికి, అంతులేని మానవ విషాదానికి కారణమవుతున్నాయి.

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రసంగిస్తున్నప్పుడు ట్రంప్ మహాశయుడు నిజంగా ఎవరిని ఉద్దేశించి మాట్లాడారు? అన్నదే అసలు ప్రశ్న. ఈ విషయమై మనం చర్చించి తీరాలి. ఐరాసలో సమావేశమైన ప్రపంచ నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడలేదు; మీరు, నా లాంటి వాళ్లను ఉద్దేశించి కూడా ఆయన మాట్లాడలేదు. అభివృద్ధి చెందిన దేశాలలో మధ్యతరగతి, శ్రామికవర్గ జనావళిని ఉద్దేశించే ఆయన ఆ ప్రసంగాన్ని వెలువరించారని నేను భావిస్తున్నాను. తమ ఆర్థిక వ్యవస్థలు ప్రపంచీకరణ అవడం వల్ల తాము ఎంతగానో నష్టపోయామని, దగా పడ్డామని ఈ రెండు వర్గాలవారు నమ్ముతున్నారు. తమ దేశాలను దురాక్రమించిన 'వలసకారులు' తమ జీవనాధారాలను కొల్లగొడుతున్నారనే భావం ఈ రెండు వర్గాల ప్రజల మనసుల్లో ఉన్నది. ఆ భావం మరింత ప్రగాఢంగా నాటుకుపోయేలా చేయడమే ట్రంప్ లక్ష్యం. బలహీన ప్రభుత్వాలు వలసకారుల వెల్లువను అనుమతిస్తున్నాయని ట్రంప్ ఆక్రోశిస్తున్నారు. ఈ వలసల కారణంగా జీవన వ్యయాలు పెరిగిపోతున్నాయని, నిజ వేతనాలు తగ్గిపోతున్నాయని, ఈ పరిణామాలు పాశ్చాత్య నాగరికత పతనానికి దారితీస్తాయని ట్రంప్ ఆందోళన చెందుతున్నారు.



కాలుష్య రహిత అభివృద్ధే అన్ని విధాల శ్రేయోదాయకమైనది. పర్యావరణ సమతౌల్యతకు హాని చేసే అభివృద్ధి మన ఉమ్మడి ఆవాసమైన ఈ ధరిత్రిని తప్పక ధ్వంసం చేస్తుంది. ఐక్యరాజ్యసమితిలో ట్రంప్ ప్రసంగం వాతావరణ మార్పు భావన సహేతుకతను నిర్మూలించేందుకు చాలా జాగ్రత్తగా రూపొందించిన వ్యూహం. దీన్ని మనం సమర్థంగా ఎదుర్కోవాలి.

ఈ సందేశాన్ని ప్రపంచమంతటికీ, మరీ ముఖ్యంగా పాశ్చాత్య దేశాలు అన్నిటికీ తీసుకువెళ్లాలన్నది ట్రంప్ ధ్యేయంగా ఉన్నది. తద్వారా పాశ్చాత్య దేశాలలో 'వామపక్ష పిచ్చివాళ్ల' (ఇది ఆయన మాటే, నాది కాదు) పట్ల వ్యతిరేకత ప్రబలిపోయేలా చేయాలని ఆయన సంకల్పించుకున్నారు. సామాజిక న్యాయం, వాతావరణ చర్యకు నిబద్ధమైన ప్రభుత్వాలకు దూరమై 'సరైన' విధానాల పట్ల ప్రజలు ఆకర్షితులయ్యేలా చేసేందుకు జరిగిన రాజకీయ ప్రయత్నంగా ఐక్యరాజ్యసమితిలో ట్రంప్ ప్రసంగాన్ని చూడాలి. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి నేతృత్వం వహించిన, స్వేచ్ఛా విపణి ప్రపంచీకరణ వ్యవస్థను నిర్మించిన పాశ్చాత్య దేశాలలో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారనే విషయాన్ని కూడా మనం విస్మరించ కూడదు. ట్రంప్ తన మాటలతో వారిలో ఆ ఆగ్రహం మరింతగా ప్రజ్వరిల్లేలా చేస్తున్నారు. తద్వారా పాశ్చాత్య ప్రపంచ రాజకీయాలలో తాను ఒక మౌలిక మార్పు తీసుకురాగలనని ఆయన విశ్వసిస్తున్నారు.

బహుళ పాక్షిక వ్యవస్థకు, ప్రపంచ సంఘీభావానికి, వాతావరణ మార్పు నిరోధక చర్యలకు వ్యతిరేకంగా ఉన్నవారు అంతిమ విజయం సాధించాలని ట్రంప్ ప్రగాఢంగా అభిలషిస్తున్నారు. ఇది ఇంతకు ముందెన్నడూ చూడని రీతిలో పాలనా వ్యవస్థల మార్పును సంకల్పించడమే. అదే సంభవిస్తోంది మరి. యూరోప్ వాతావరణ విధానాలు ఎదురుగాలులను ఎదుర్కొంటున్నాయి. తదుపరి విడత ఉద్గారాల తగ్గింపు లక్ష్యాల విషయమై ఒక ఒప్పందాన్ని సాధించడంలో యూరోపియన్ కమిషన్ విఫలమయింది. ఈ విధానాలకు ప్రతిఘటన అంతకంతకూ పెరుగుతోంది. ట్రంప్ వలే వాతావరణ మార్పును నిరాకరిస్తున్న రాజకీయ పార్టీల పట్ల అనుకూలత పెరుగుతోంది. ఇది చాలా శోచనీయం.

ఈ మార్పులు మరింత వేగవంతమవ్వాలని ట్రంప్ ఆశిస్తున్నారు. అప్పుడే ప్రపంచం తన పక్షానికి వస్తుందనేది ఆయన భావిస్తున్నారు. ఇదొక రాజకీయ చదరంగం. వాతావరణ మార్పు అనేది ఇందులో ఒక పాచిక. ఇంధన వాణిజ్యంలో ఆర్థిక ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ఈ రాజకీయం జరుగుతోంది. ఇందులో భాగంగానే వాతావరణ మార్పు నిరోధక అజెండా అనేది 'వామపక్ష వెర్రి వాళ్లది' అని ట్రంప్ పదే పదే అపహసిస్తున్నారు. వాతావరణ మార్పు విపత్తుతో మానవాళి మనుగడే సంక్షోభంలో పడిందని విశ్వసిస్తున్న, కాలుష్య ఇంధన వ్యవస్థలను నిర్మూలం చేయాల్సిన అవసరముందని భావిస్తున్న వారందరూ ఆయన దృష్టిలో వామపక్ష వెర్రివాళ్లే! ఇటువంటి వైఖరి ప్రజలు ఏదో ఒక పక్షం వైపు మొగ్గేలా చేస్తుంది. కొవిడ్ విలయం కాలంలో ఇదే జరిగింది. యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలా లేక అందులోనే కొనసాగాలా అనే విషయమై ఓటింగ్ సమయంలో బ్రిటన్‌లోనూ సంభవించింది కూడా ఇదే కాదూ? సమాజంలో ఇటువంటి చీలికలు సమస్యను మరింత సంక్లిష్టం చేస్తాయి. కులీనులు వెర్సెస్ సామాన్యులుగా సమాజాన్ని చీల్చివేస్తాయి. మరింత ఘోరమైన విషయమేమిటంటే ఈ ధోరణి వైజ్ఞానిక పరిశోధనలనూ కొట్టివేస్తోంది. నిపుణులు వాస్తవాన్ని అర్థం చేసుకోవడం లేదని దుయ్యబడుతున్నది. సామాన్య ప్రజల బాధాకర వాస్తవాలను అర్థం చేసుకోవడం లేదని ఆక్షేపిస్తోంది.

ఈ ప్రమాదకర ధోరణులకు వ్యతిరేకంగా మనం పోరాడాలి. ఐక్యరాజ్యసమితిలో ట్రంప్ అవమానకరమైన మాటల కంటే ఇవి మరింత హానికరమైనవి. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పనిచేస్తున్న పర్యావరణ వాదులను అలా ఆక్షేపించడం వారి కృషిని, నిబద్ధతను తక్కువ చేయడమే అవుతుంది. ట్రంప్ దృష్టిలో వర్ధమాన దేశాలలోని పర్యావరణ వాదులు అభివృద్ధి నిరోధకులే! పర్యావరణం, అభివృద్ధి అనేవి ఒకే నాణేనికి బొమ్మ–బొరుసు లాంటివనే సత్యాన్ని గుర్తించేందుకు ఆయన నిరాకరిస్తున్నారు. ఈ కారణంగానే మేము చాలా జాగ్రత్తగా, ఉద్దేశపూర్వకంగా వాతావరణ మార్పు నిరోధక విధానాలు మా దేశాల అభివృద్ధి వ్యూహాలలో భాగంగా ఉండేలా చేసేందుకు కృషి చేస్తున్నాము. కాలుష్యం లేకుండా సాధించే అభివృద్ధే నిరపాయకరమూ, ప్రయోజనకరమూ అవుతుందని మేము విశ్వసిస్తున్నాం. ఈ సత్యాన్ని మేము ఎప్పటికీ విస్మరించం. పర్యావరణ కాలుష్యాన్ని పెంపొందించే అభివృద్ధి మన ఉమ్మడి ఆవాసమైన ఈ ధరిత్రిని తప్పక ధ్వంసం చేస్తుంది. ఈ దృష్ట్యా ఐరాసలో ట్రంప్ ప్రసంగాన్ని ఆయన చేసిన మరో శబ్దాడంబర భాషణగా తీసివేయకూడదు. వాతావరణ మార్పు భావన సహేతుకతను నిర్మూలించేందుకు చాలా జాగ్రత్తగా రూపొందించిన వ్యూహమది. దీన్ని మనం సమర్థంగా ఎదుర్కోవాలి.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

స్వదేశీయే నిజమైన దేశభక్తి

స్వదేశీ వస్తువుల వినియోగం గురించి మహాత్మాగాంధీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు ఇచ్చిన పిలుపు ప్రతి భారతీయునికీ ఒక దిశానిర్దేశం. వారు చెప్పినట్లు దేశభక్తి అనేది కేవలం సరిహద్దుల వద్ద తుపాకి పట్టుకొని నిలబడడానికే పరిమితం కాదు. దైనందిన జీవితంలో మనం చేసే కొనుగోళ్లలో, మన వినియోగపు అలవాట్లలో అది ప్రతిబింబించాలి. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే మన రైతుకు తగిన ధర లభిస్తుంది, మన పరిశ్రమలు లాభపడతాయి, మన యువతకు ఉపాధి లభిస్తుంది... ఇలా మన డబ్బు మన దేశంలో తిరుగుతూ మన ఆర్థిక వ్యవస్థకు శక్తినిస్తుంది. అదే విదేశీ ఉత్పత్తులు వాడితే మన సంపద విదేశాలకు వెడుతుంది. ఆ డబ్బుతో వారు తమ దేశాన్ని అభివృద్ధి చేసుకుంటారు. కొన్నిసార్లు మన దేశ ప్రయోజనాలకు విరుద్ధంగానూ వినియోగిస్తారు. మనమే ఇచ్చిన డబ్బు మనకు సమస్యలు సృష్టించేలా మారుతుంది.

మన దేశంలోని వివిధ సంస్థలు కేవలం వ్యాపారం చేయడమే కాదు, సమాజానికి మేలు చేయడంలోనూ ముందుంటాయి. విద్య, వైద్యం, పరిశోధన, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో కూడా అవి అపారమైన సేవలు అందిస్తున్నాయి. ఉదాహరణకు టాటా ట్రస్ట్, మహీంద్రా గ్రూప్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, విప్రో–అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, రిలయన్స్ ఫౌండేషన్, అదానీ ఫౌండేషన్, బజాజ్ ట్రస్ట్, టీవీఎస్ ఫౌండేషన్ వంటివి.

క్యాన్సర్ చికిత్స ఖర్చులు సాధారణ, మధ్యతరగతి కుటుంబాలకు తడిసి మోపెడవుతున్నాయి. పెద్ద ఆస్పత్రులలో చేరాలంటే లక్షల్లో ఖర్చవుతుంది. ఎలాంటి ఆర్థిక సాయం లేక, ఎక్కడ, ఎలా మెరుగైన చికిత్స పొందాలనే సందిగ్ధంలో చాలామంది విలవిలలాడుతున్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, టాటా మెమోరియల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ (ముంబై), టాటా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ (తిరుపతి), ఇంకా కొన్ని ఆస్పత్రులు నిస్సహాయులైన వారికి గొప్ప సేవలు అందిస్తున్నాయి. మనం స్వదేశీ సంస్థలకు మద్దతు ఇస్తే, వారు తిరిగి సమాజానికి సేవ చేయగలుగుతారు. ఇలా వ్యాపారం–సేవ–దేశాభివృద్ధి అనే ఒక సుస్థిర చక్రం ఏర్పడుతుంది. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం కేవలం ఆర్థిక లావాదేవీ కాదు, అది నిజమైన దేశభక్తి పథం.

– ఎంజీఆర్ భాస్కర్

ఆత్మగౌరవ గానమే ఉపాలీయం



దళిత సాహిత్యాన్ని పదునెక్కించిన పాటకు మూలవాసి తాత్వికతను అద్దిన వాగ్గేయకారుడు ఎర్ర ఉపాలి. తెలంగాణ ఉద్యమాల చరిత్రకు తనవంతు కృషిని జతచేసిన జాంబవంతుని వారసుడు. పల్లె పల్లెన పాటల డప్పు మోగినవాడు. దళిత సాహిత్యం ఉవ్వెత్తున ఎగసిన తొంభయ్యవ దశకమే ఉపాలిని ప్రభవింపజేసింది. భారతదేశంలో వర్గ పోరాటం మాత్రమే విముక్తిని సాధించలేదని, దానికి కులచైతన్యం కూడా అవసరమని భావించాడు మారోజు వీరన్న. ఆయన జీవించిన కాలంలోనే మాదిగ వాగ్గేయకారునిగా కన్ను తెరిచాడు ఉపాలి. అప్పటి వరకు తనకు తెలిసిన పల్లె పాటలను పాడుకుంటూ ఊరూరా తిరిగేవాడు. అలాంటి ఉపాలికి వీరన్న సిద్ధాంతం ఎంతో నేర్పింది. మరోవైపు గద్దర్, మాస్టార్జీ పాటల ప్రభంజనం ఉపాలిని ఆలోచింపజేసింది. దీంతో పాటంటే ప్రజలను ఆలోచింపజేసేదే కావాలి తప్ప, ఎంటర్‌టైన్‌మెంట్ కాదని విశ్వసించాడు.

ఉపాలి పాటల్లో మూలవాసి సిద్ధాంతం ప్రతిధ్వనించేది. ఏది రాసినా చారిత్రక కోణం నుంచి చెప్పుకురావడం ఆయన ప్రత్యేకత. ఈ దేశం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలదని బలంగా నమ్మాడు. బహుజనుల ఎదుగుదలకు ఆటంకంగా ఉన్న మనువాదం మీద మంటలై మండినవాడు ఎర్ర ఉపాలి. ఆయన కలంలో, గళంలో ఒక నిప్పుల సెగ ఉండేది. దగాపడ్డ బతుకుల్లో ఉండే డప్పుల ధర్మాగ్రహం లావాలా ప్రవహించేది. మిగిలిన వాగ్గేయకారుల్లాగా ఉపాలి ఏది పడితే అది రాయలేదు. ఆయన పాటకు ఫూలే–అంబేడ్కర్‌లు అందించిన మూలవాసి తాత్వికత భూమికగా ఉండేది. అందుకే 'నిశ్శబ్దాల అవనిలో శబ్దం పుట్టించినవాణ్ణి, శతాబ్దాలుగా శ్రమకు శ్రీకారం చుట్టినోణ్ణి' అని ధిక్కారంగా పలికాడు. ఈ ధిక్కారం దండోరా అందించిన చూపు నుంచి వచ్చింది.

గ్రామీణ యువతకే కాదు, యూనివర్సిటీ వరకు వచ్చినవారికి సైతం తమ మూలాల గురించి తెలుసుకోవాలంటే ఉపాలి పాటలే ఆధారంగా నిలిచాయంటే.. ఆ పాటల ప్రభావం ఎంతో అర్థం చేసుకోవచ్చు. అందుకే ఉపాలి పాటకు చారిత్రక జ్ఞానాన్ని అందించే శక్తి ఉంది. అణచివేయబడుతున్న ఆధిపత్య శక్తుల మీద చేయవలసిన జ్ఞానపోరాటానికి దిశానిర్దేశం చేసే దిక్సూచి అది. ఉపాలి కృషికి దక్కాల్సిన గౌరవం దక్కలేదు. తన పాటలను కనీసం రికార్డు చేసుకోలేని దుర్భర దారిద్ర్యం ఆయన బతుకంతా వెంటాడింది. 20 ఏళ్ళ క్రితం 'పల్లె గొంతుల పాట' అని తన పాటలను పుస్తకంగా వేసుకున్నాడు. ఆ తరువాత వందలాది బహుజనోద్యమ పాటలు రాశాడు. కానీ, వాటన్నింటినీ అచ్చులోనో, ఆడియో రూపంలోనో తీసుకురాలేక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అయినా సరే తన పాటలు ప్రతీ సభలోను నిత్యం వినబడుతూనే ఉన్నాయి. మండే నెత్తురు లాంటి పాటలకు పురుడు పోశాడు ఉపాలి. అణగారిన వారిని ఆలోచింపజేసే పాటలు రాశాడు. మూడువేల ఏండ్లుగా పోరాడుతున్న దళిత, బహుజనులు అలిసిపోవద్దు, మరింత శక్తితో పోరాడాలని ఆశించాడు.

ఉపాలికి ఆత్మాభిమానం ఎక్కువ. ఎంతటి పేదరికాన్నైనా పంటి కిందే అదిమి పట్టుకొని, గొప్ప ఆత్మవిశ్వాసాన్ని వెలిబుచ్చేవాడు. అది ఉపాలికి మూడువేల ఏండ్లుగా కొట్లాడుతున్న మాదిగ కుల ఆత్మగౌరవం నుంచి అబ్బింది. అందుకే తను రాసిన ఒక పాటలో "మాదిగ జాతే మాదిరా/ మము మించిన నీతే లేదురా" అంటాడు. ఈ రకమైన ఆత్మగౌరవ ప్రకటన ఈ కులసమాజంలో మరో కులం నుంచి మనం చూడలేం. దళితుల్లో బాగుపడిన కులాలు, దళితుల్లోనే వెనుకబడిన కులాల సంక్షేమాన్ని పట్టించుకోవాలన్నాడు ఉపాలి. అందుకే ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఆణిముత్యాల్లాంటి పాటలు రాశాడు. దండోరా ఉద్యమానికి తాను మాదిగ డప్పై దరువేశాడు. ఎమ్మార్పీయస్ ఉద్యమానికి మార్చ్‌పాస్టింగ్ సాంగ్ వంటి "మాదిగ మహవీరులారా... ఆది జాంబవుని వారసులారా" అంటూ పాటను అందించాడు. అది నేటికీ ఊరూరా దండోరా ఉద్యమంలో కణకణ మండుతూనే ఉంది. మాదిగ అమరవీరులు మాదిగమహాజన రాజ్యాన్ని కలగన్నారు అని సూత్రీకరించాడు ఉపాలి. నిజానికి అది ఉపాలి కల కూడా. ఇలాంటి ఉపాలి పాటలను డప్పోల్ల రమేశ్ 'ఉపాలీయం' పేరుతో సంకలనం చేసి రేపటి తరాలకు అందించాడు. ఉపాలికి ఉన్న విశాల సామాజిక అవగాహనను డా. కొంగర మహేష్ పలు ఇంటర్వ్యూల ద్వారా రికార్డు చేసి ఈ సమాజానికి అందించాడు. ఈ దేశంలో అధికారానికి దూరమైన జాంబవంతుని వారసులంతా ఏదో ఒక రోజు రాజ్యాధికారాన్ని సాధించాలని బహుజన సాంస్కృతిక ఉద్యమానికి దారులు వేశాడు.

● డా. పసునూరి రవీందర్
తెలంగాణ సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యుడు

(నేడు ఎర్ర ఉపాలి వర్ధంతి)

మానుకోటలో 'మెగా రైల్వే డిపో'



రూ.908.15 కోట్లు కేటాయించిన రైల్వేశాఖ

- డోర్నకల్‌కు రూ.48 కోట్లు కేటాయింపు
- ప్రత్యక్షంగా 1000 మందికి ఉపాధి
- పరోక్షంగా 5 వేల మందికి..

5



ఆశలపై నీళ్లు

స్థానిక ఎన్నికల పోరుకు హైకోర్టు బ్రేక్

- బీసీల రిజర్వేషన్ జీవో నెం.9పై స్టే
- నిలిచిన ఎన్నికల ప్రక్రియ
- ఆశావహుల కలలపై నీళ్లు
- కాంగ్రెస్ శ్రేణుల్లో నిరుత్సాహం

హనుమకొండ, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నిలకు బ్రేక్ పడింది. దీనితో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు గురువారం స్టే ఇచ్చింది. జీవోను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను జీవో నెం 9 ఆధారంగా ఇచ్చారు కనుక ఈ జీవోపై స్టే విధించడంతో నోటిఫికేషన్లపై కూడా స్టే కొనసాగుతుందని కోర్టు స్పష్టం చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాల దాఖలుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

కాగా, బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండు రోజుల పాటు సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఈ పరిణామంతో స్థానిక ఎన్నికల్లో తమ అదృష్టం పరీక్షించుకోవాలని ఉవ్విళ్లూరుతున్న ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. వారంతా ఒక్కసారిగా నిరుత్సాహానికి లోనయ్యారు. కాంగ్రెస్ శ్రేణులు సైతం నిరాశ చెందారు. జీవో నెంబర్ 9పై స్టేతో బీసీ వర్గాల్లో నిరుత్సాహం చోటు చేసుకున్నది. ఈ పరిస్థితుల నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు ఎలా ఉండబోతున్నాయనే విషయంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. కాంగ్రెస్ నేతలు సైతం ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

స్టేతో ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. బీసీ రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు, సుప్రీం కోర్టులో విచారణ సాగుతున్నప్పటికీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ముందుకు వెళ్లింది. ఇందులో భాగంగా గత నెల 29న జారీ అయింది. జడ్పీటీసీ, ఎంపీటీసీల తొలివిడత పోలింగ్ ఈనెల 23న, మలివిడత పోలింగ్ ఈనెల 27న అలాగే సర్పంచ్ ఎన్నికలు మూడు విడతలుగా ఈనెల 31న, నవంబర్ 4,8 తేదీల్లో జరగాల్సి ఉండింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. షెడ్యూల్ జారీ అయిన తేదీ నుంచి ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వచ్చింది. గురువారం ఉదయం ఎన్నికల జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ కూడా జారీ అయింది. నామినేషన్ల స్వీకరణ కూడా పూర్తయింది. కానీ మధ్యాహ్నానికి హైకోర్టు స్టేతో

(మిగతా 4లో..)

రెండు జిల్లాల్లో ఐదు నామినేషన్లు

హనుమకొండ జిల్లాలో 2, వరంగల్ జిల్లాలో 3..

- హైకోర్టు తీర్పుతో స్వీకరణకు బ్రేక్
- ఎన్నికలపై గందరగోళంతో ముందుకురాని అభ్యర్థులు



ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పల్లె వేణు (జయగిరి)

హనుమకొండ, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి మొదటి రోజు గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ జీవో 9 అమలుపై హైకోర్టు తీర్పు స్టే ఇవ్వడానికి ముందే ఉదయం వీరు నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ కాగానే అన్ని మండలాల్లో నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా పరిధిలో హసన్‌పర్తి మండలంలో జడ్పీటీసీ స్థానానికి ఒకటి, ఎంపీటీసీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలయ్యాయి. హసన్‌పర్తి జడ్పీటీసీ స్థానానికి మల్లారెడ్డిపల్లికి చెందిన పుట్ట లక్ష్మి అనే మహిళ నామినేషన్ వేశారు. జయగిరి ఎంపీటీసీ స్థానానికి పల్లె వేణు అనే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు.

- వరంగల్ జిల్లాలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఒకటి జడ్పీటీసీ స్థానానికి, రెండు ఎంపీటీసీ స్థానాలకు ఈ నామినేషన్లు పడ్డాయి. మధ్యాహ్నం 2.30గంటల తర్వాత హైకోర్టు తీర్పు వెలువడగానే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల సంఘం కూడా హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ప్రకటించింది. ఎన్నికలు తాత్కాలికంగా నిలిచిపోయినందువల్ల ఈ నామినేషన్లను పెండింగ్‌లో ఉంచనున్నట్టు తెలుస్తోంది.

ఆధ్యాత్మిక రంగంలో దివ్యచరితుడు 'నల్లాన్'

- ఆధ్యాత్మికతతోనే సమాజంలో సుఖశాంతులు
- రఘునాథచార్యస్వామి శత జయంతి వేడుకల్లో జీయర్‌స్వామి



ఆధ్యాత్మిక గ్రంథాన్ని ఆవిష్కరించిన స్వామి



అనుగ్రహ భాషణం చేస్తున్న అష్టాక్షరి జీయర్‌స్వామి

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ సంప్రదాయంలో విశిష్టాద్వైత సిద్ధాంతంతో మకుటంలేని మహారాజుగా వెలుగొందిన నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామి... ఆధ్యాత్మిక రంగంలో దివ్యచరితుడని అష్టాక్షరి పీఠ వ్యవస్థాపకుడు త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని శ్రీ సీతారామచంద్ర, ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి సత్ సంప్రదాయ పరిరక్షణ సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రఘునాథ దేశిక శత జయంతి ఉత్సవ వేడుకల్లో స్వామి పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు.

సంస్కృత, సాహిత్యం, వ్యాకరణం, వేదాంతం, ఉపనిషత్తులు, అళ్వార్ దివ్య ప్రబంధాలను అలవోకగా పాండిత్యాన్ని పంచే మహానుభావుడని, వారు చారిత్రక ఓరుగల్లుకు ఎంతో ఘనమైన కీర్తిని గడించి పెట్టారని పేర్కొన్నారు. సమాజంలో ఆధ్యాత్మికత మాత్రమే సుఖశాంతులను అందజేస్తుందని చెప్పారు. ప్రతీ ఒక్కరు భగవతారాధనలో లీనమై సామాజిక జీవనాన్ని గడపాలని ఆకాంక్షించారు. మహా పండితులకు, జీయర్ స్వాములకు సైతం గురువుగా, శాశ్వతంగా విజ్ఞానాన్ని పంచే 60కిపైగా ఆధ్యాత్మిక గ్రంథాలను సమాజానికి అందించిన మహానుభావుడు రఘునందుడని కీర్తించారు.

ఆధ్యాత్మిక ప్రవచకులు సముద్రాల శఠగోపాచార్య మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు రామాయణాన్ని మించిన గ్రంథం మరోటి లేదన్నారు. అన్ని కాలాలకు చెందిన మానవులకు శ్రీరామచంద్రుడు ఎళ్లవేలలా ఆదర్శప్రాయుడని ఆయన మార్గం అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథ దేశిక ఆధ్యాత్మిక సేవపై ప్రత్యేకంగా ప్రచురించిన గ్రంథాన్ని స్వామివారు ఆవిష్కరించారు. సంప్రదాయ సభ పక్షాన సుమతి వరదారెడ్డి దంపతులతోపాటు ఆలయ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన అర్చకుడు లింగిరి శ్రీనివాసాచార్యతోపాటు టి.యాదగిరి, యాద శ్రీనివాస్, ఉషారాణి, వేదాంతం శ్రీదేవి, సదానందరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఏటీసీల పనులు

- అధికారులకు కలెక్టర్ స్నేహ శబరీశ్ ఆదేశాలు



ఏటీసీల పనులను పరిశీలిస్తున్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రాస్త్ర సాంకేతిక విద్యను అందించేందుకు ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ల పనులను త్వరిగతగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. గురువారం ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నిర్మాణమవుతున్న హనుమకొండ, కాజీపేట, వరంగల్ ఏటీసీల పనుల పురోగతిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఇప్పటి వరకు పూర్తయిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటీసీలలో కోర్సులకు అనుగుణంగా మిషనరీ, టూల్స్ అన్ని అందుబాటులో ఉండాలన్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణం పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా వనరులు సమకూర్చాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సంర్భంగా వరంగల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.సీతారాములు, హనుమకొండ ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ ప్రిన్సిపాల్ జి.సక్రు, కాజీపేట ఐటీఐ, ఏటీసీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు, వరంగల్ ఇన్‌చార్జి ఓంకార్, టీజీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

12న పల్స్ పోలియో

ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కలు వేయించాలన్న డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీ ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. అప్పుడే పుట్టిన పాప నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా తల్లిదండ్రులు పల్స్‌పోలియో చుక్కలను వేయించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో పట్టణ జనాభా అధికంగా ఉన్న హనుమకొండ జిల్లాతోపాటు పాటు మొత్తం ఐదు జిల్లాల్లో ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలోపు వయస్సుగల 84301 పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 472బూత్‌లు, 17బస్టాండ్లు, రైల్వే స్టేషన్ లాంటి ట్రాన్సిట్ పాయింట్లు, మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలియో చుక్కలు వేస్తామన్నారు.

'కుడా'లో వెల్‌నెస్ సెంటర్?

- సీజీహెచ్‌ఎస్ డైరెక్టర్ రోహిణి, వరంగల్ ఎంపీ కావ్య పరిశీలన
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇక్కడే చికిత్స

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్)లో భాగంగా వెల్‌నెస్ సెంటర్‌ను నగరంలో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌కు భవనం ఎంపికలో గురువారం హనుమకొండలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీ కడియం కావ్య, సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రోహిణితో పాటు 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కుడా సీపీవో అజిత్‌రెడ్డి 'కుడా' కార్యాలయంలోని పై అంతస్తును పరిశీలించారు. ఇక్కడ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని ఓ నిర్ణయానికి వచ్చారు. సీజీహెచ్‌ఎస్ ఓ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం అయినప్పటికీ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రాథమిక (ఓపీడీ) చికిత్స సాధారణ ప్రజలకు కూడా అందుబాటులో ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఇక్కడ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు జరిగితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సామాన్య ప్రజలకు సైతం సేవలందించవచ్చని అభిప్రాయపడ్డారు.

పలు భవనాల పరిశీలన

హనుమకొండ (ఆంధ్రజ్యోతి): సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కోసం ఎంపీ కడియం కావ్య గురువారం క్షేత్రస్థాయిలో భవనాలను పరిశీలించారు. ఇటీవల కలెక్టర్, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఇతర సంబంధిత అధికారులతో పలు భవనాలను పరిశీలించి, ఎంపిక చేసిన భవనాల వివరాలను ఎంపీ కావ్య హైదరాబాద్ నుంచి వచ్చిన సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణికి తెలియ చేశారు. సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనాల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని డైరెక్టర్‌కు సూచించారు. ఇద్దరు కలిసి కాజీపేట డివిజన్ మునిసిపల్ కార్యాలయం, దూరదర్శన్ కార్యాలయంతో పాటు వరంగల్ పాత కలెక్టర్ వసతి గృహం, 'కుడా' కార్యాలయంలోని భవనాన్ని సందర్శించారు. అందులో ఉన్న వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, సీజీహెచ్‌ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ డైరెక్టర్‌తో కలిసి భవనాలను పరిశీలిస్తున్న ఎంపీ కావ్య

పాతాళ గంగ.. ఉప్పొంగంగ...

- బోరుబావులు, చేతి పంపుల నుంచి ఉబికివస్తున్న నీరు
- తాడ్వాయి మండలంలో కనువిందు చేస్తున్న ప్రకృతి విచిత్రం

తాడ్వాయి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో బోరుబావులు, చేతిపంపులు నీరు ఉబికి పోస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అధిక సంఖ్యలో బోరుబావులు, చేతిపంపులు ఉబికి పోస్తుండటంతో పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎలాంటి విద్యుత్ లేకుండా, చేతిపంపులను కొట్టకుండా నీరు బయటకు వస్తుండడం పర్యాటకులకు కనువిందు చేస్తోంది. స్థానికులు, మేడారం వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులు, పర్యాటకులు వీటిని ఆసక్తిగా వీక్షిస్తున్నారు. మేడారం నుంచి తాడ్వాయికి వచ్చే రహదారి వెంబడి 5కు పైగా చేతిపంపులున్నాయి. అధిక వర్షాల కారణంగా భూగర్భ జలాలు సాధరణ స్థాయి కంటే ఎక్కువ పెరిగి అనేక చోట్ల బోరు బావుల నుంచి నీరు సహజంగా ఉబికి వస్తోందని విశ్లేషకులు తెలుపుతున్నారు. 2024 సంవత్సరంలో 6.84 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు 2025 సంవత్సరం ఆగస్టు నెల నుంచి 5.78 మీటర్ల లోతుకు చేరాయని అధికారులు తెలుపుతున్నారు. అంతేకాకుండా కాళేశ్వరం ప్రాజెక్టుల వంటి నీటి ప్రాజెక్టుల వల్ల కూడా నీరు ఉబికి రావడం సాధ్యమైందని అంటున్నారు. అధిక వర్షాలు కురిసి భూగర్భంలో నీటి టేబుల్ లెవల్‌కు దిగువగా ఉన్న బోరుబావుల్లో కూడా నీరు దానంతట అదే పైకి వస్తుందని చెబుతున్నారు. ఈ విషయమై హైడ్రాలజిస్ట్ కె.కృష్ణకాంత్‌ను వివరణ కోరగా.. భూమి పొరల ఆధారంగా నీటి నిల్వల శాతం మారుతుందని, అందులో భాగంగానే బోరు బావుల నుంచి నీరు ఉబికి వస్తోందని తెలిపారు. ఇది ప్రకృతి విపత్తు కాదని తెలిపారు.



మేడారం అడవిలో చేతిపంపు ద్వారా ఉబికి వస్తున్న నీళ్లు



పిక్కలు పీకుతున్న వీధి కుక్కలు

ఎక్కడ చూసినా భౌ భౌల స్వైర విహారం



- గ్రేటర్ పరిధిలో 37,625 వీధి కుక్కలు ఉన్నట్టు అంచనా
- 8 ఏళ్లలో 25 వేల వీధికుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు
- అయినా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న సంఖ్య
- చింతల్‌లో ఒకే రోజు 18 మందిపై కుక్కల దాడి
- చింతగట్టు ఏబీసీ సెంటర్ కేంద్రంగా సిబ్బంది సేవలు
- ప్రతిపాదించిన మరో ఏబీసీ సెంటర్ మాటే లేదు
- నియంత్రణకు సమగ్ర చర్యలు తీసుకోవాలంటున్న నగరవాసులు

5

42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామా

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

హనుమకొండ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము లేకనే 42 శాతం రిజర్వేషన్లు అంటూ బడుగు, బలహీన వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని ఆయన నివాసంలో చల్లా మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు కూడా అదే మోసంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచల య్యాయన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ వల్ల ఇప్పటికే గ్రామాలలో ఆశావహులు ఖర్చుల పాలయ్యారని, వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. 420 హామీల తరహాలోనే 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాలను భాగస్వామ్యం చేసి ఢిల్లీ వేదికగా జరుగాల్సిన పోరాటాన్ని సీఎం రేవంత్ రెడ్డి గల్లీలో చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల చేతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు.

నేడు తెలంగాణ బంద్‌కు బీసీ రాజ్యాధికార పార్టీ పిలుపు



మాట్లాడుతున్న టీఆర్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్

హనుమకొండ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 9ని నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ బంద్‌కు తెలంగాణ బీసీ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) పిలుపు ఇస్తున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ తెలిపారు.

గురువారం హనుమకొండలో టీఆర్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదం రజినీకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బంద్ కొనసాగుతుందని టీఆర్‌పీ కార్యకర్తలు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, బీసీఉద్యోగులు, న్యాయవాదులు, డాక్టర్లు, ప్రజా సంఘాలు, మేధావులు బంద్‌కు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టీఆర్‌పీ నాయకులు పెండెల సంపత్ పటేల్, జంగిలి శ్రీనివాస్, పోలు రాజు, పల్లకొండ చందు, మాదం నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ వాలీబాల్ భారత కెప్టెన్‌గా ప్రశాంత్



వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు అమెరికాలోని ఇండియానా రాష్ట్రం ఫోర్టువేన్లో నిర్వహించనున్న వరల్డ్ సిట్టింగ్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్న భారత జట్టు కెప్టెన్‌గా వరంగల్ జిల్లా ఖైలారం గ్రామానికి చెందిన గాడిపల్లి ప్రశాంత్ ఎంపికయ్యారు. ఈ మేరకు పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జయ వంత్‌జీ అమరవార్ గురువారం నియామక ఉత్తర్వులను ఒక ప్రకటన ద్వారా జారీ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన గాడిపల్లి ప్రశాంత్.. అంగవైకల్యంతో బాధపడుతునే ఆటల్లో ఉన్న ఆసక్తితో పదేళ్లుగా సిట్టింగ్ వాలీబాల్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించి జిల్లా కీర్తి ప్రతిష్టలను విశ్వవాప్తం చేస్తున్నాడు. 2023లో ఈజిప్ట్‌లోని కైరోలాలో జరిగిన వరల్డ్ పారా వాలీబాల్ చాంపియనష్‌షిప్ పోటీల్లో ప్రాతి నిథ్యం వహించిన భారత పురుష జట్టుకు ప్రశాంత్ కెప్టెన్‌గా వ్యవహరించారు.

ప్రశాంత్ మాట్లాడుతూ.. అంగవైకల్యం, పేదరికం ఆటలకు అడ్డుకాదని, తనకు నచ్చిన సిట్టింగ్ వాలీబాల్‌ను ఎంచుకొని ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో పాల్గొన్నానన్నారు. అమెరికాలో నిర్వహిస్తున్న వరల్డ్ సిట్టింగ్ వాలీ బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న భారత జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేసిన పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జయవం త్‌జీ అమరవార్, రాష్ట్ర కమిటీ సభ్యులకు, కోచ్‌లకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

బల్దియాలో ఇంటిదొంగలు

- లక్షల విలువ చేసే గేట్‌వాల్వ్స్ మాయం
- ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అమ్ముకున్నట్లు ఆరోపణలు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజుల సొమ్ము రాళ్లపాటు.. బల్దియా సామగ్రి దొంగల పాలు.. అన్నట్టు ఉంది కార్పొరేషన్‌లో పరిస్థితి. వరంగల్ నగరంలోని వాటర్ ట్యాంక్‌లలో పని చేస్తున్న సిబ్బంది అక్కడి విలువైన సామగ్రి మాయం చేయడం కలకలం రేపుతోంది.

హనుమకొండ ఎఫ్‌సీఐ కాలనీలో ఈఎల్ఎస్ఆర్ (ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్) పేరుతో రెండు వాటర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్ నుంచి శుద్ధి చేసిన నీటిని ఈ ట్యాంకులలోకి ఎక్కించి అక్కడి నుంచి జులైవాడ, రామారావుకాలనీ, రెవెన్యూకాలనీ, నందిహిల్స్, శాంతినగర్, దర్గా రోడ్డుతో పాటు మరి కొన్ని ప్రాంతాలకు ఇక్కడ నుంచి మంచి నీటి సరఫరా జరుగుతుంది. అయితే ఇక్కడ ఈఈ, డీఈ, ఏఈ స్థాయి అధికారులతో పాటు నీటిని సరఫరా చేసేందుకు వాటర్ సప్లై (వాటర్ మెన్)లు పని చేస్తారు. పైప్‌లైన్, ట్యాంకుల నిర్వహణలో భాగంగా జీడబ్ల్యూఎంసీ ఆదాయం నుంచి కొనుగోలు చేసిన లక్షలాది విలువైన గేట్ వాల్వ్, పైపులు, మోటార్లు ట్యాంకుల వద్ద ఉన్న ప్రత్యేక గదులలో భద్రపరుస్తారు. ఈ నేపథ్యంలో ట్యాంకులతో పాటు పలు కాలనీలలో పైప్‌లైన్‌లు పగిలిన సమయంలో ఇక్కడి నుంచి సామగ్రిని తరలించి మరమ్మతులు చేస్తారు. పగిలిపోయిన వస్తువులను తెచ్చి ఇక్కడ భద్రపరుస్తారు. ఈ వాటర్ ట్యాంక్‌ల వద్ద ఎప్పటికీ లక్షల రూపాయల విలువైన ఇనుప సామగ్రి నిలువ ఉంటుంది.



దసరాకు ముందు గదిలో భద్రపరిచిన గేట్ వాల్వ్

4 గేట్ వాల్వ్ మాయం

ఎఫ్‌సీఐ కాలనీ సర్వీస్ రిజర్వాయర్‌లో దసరా పండగకు ముందు ఓ గదిలో నాలుగు విలువైన గేట్ వాల్వ్ భద్రపరిచినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. 300 ఎంఎం 2, 250 ఎంఎం 2 గేట్ వాల్వ్ రెండు రోజుల వ్యవధిలోనే కనిపించుకుండా పోయినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుంది. దీనిపై అక్కడే పని చేసే ఇద్దరు వాటర్ సప్లై (వాటర్ మెన్)లపై అనుమానం వచ్చి నిలదీయడంతో ప్రశ్నించిన వారిపై దాడి చేసే ప్రయత్నం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గేట్ వాల్వ్‌ను రాత్రి సమయంలో జేసీబీ సహాయంతో అక్కడి నుంచి దొంగతనంగా తరలించి బల్దియా సొమ్మును అప్పనంగా అమ్ముకున్నట్టు తెలిసింది. బల్దియా సామగ్రిని విక్రయించాలంటే సంబంధిత డీఈ, ఏఈ స్థాయి అనుమతులు ఉండాలి. కానీ ఈ చోరీ ఘటన అధికారుల కనుసన్నల్లోనే జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రేటర్ అధికారులు ఏం చేస్తున్నట్టు..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు సంబంధించిన విలువైన సామగ్రి అడ్డదారిలో విక్రయానికి తరలిపోతుంటే అక్కడి ఇంజనీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో ఇదే రిజర్వాయర్ నుంచి పెద్దఎత్తున ఇనుప సామగ్రి చోరీ జరిగినా ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు ఉన్నాయి. ఎఫ్‌సీఐ కాలనీలో నీళ్ల ట్యాంకులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇక్కడి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, దొంగలు కలిసి చోరీలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ చోరీలపై అధికారులు గానీ, సిబ్బంది గానీ పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై సంబంధిత ఈఈ రవికుమార్‌ను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, దీనిపై విచారిస్తానని తెలిపారు. ఈ చోరీ ఘటనపై పోలీసులు దృష్టిసారించి దొంగతనాన్ని ఛేదించి నిందితులను కటకటాలకు పంపించాలని అక్కడి మరికొందరు సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సమర్ధవంతంగా నిర్వర్తించండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ క్షేత్రస్థాయి పరిశీలన



పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పనులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌తో పాటు నయీంనగర్ పాత మార్కెట్, సుబేదారి వాటర్‌ట్యాంక్, ఏనుగులగడ్డ ప్రాంతంలో సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త ట్రాక్టర్, స్వచ్ఛ ఆటో డ్రైవర్ల సమయ పాలన పాటించాలన్నారు. లేబర్ యాక్ట్ ప్రకారం సిబ్బందికి పీపీఈ కిట్లతో పాటు సేఫ్‌గార్డ్స్ ఉండాలన్నారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నయీంనగర్ పాత మార్కెట్ ప్రాంతం బయో కంపోస్ట్ ఎరువు తయారీకి అనుకూలంగా ఉందని, అందుకు అవసరమైన ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. హనుమకొండలో చాలా ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని వెంటనే చర్యలు చేపట్టాలని సిటీ ప్లానర్‌కు సూచించారు. ఏనుగులగడ్డ ప్రాంతంలో బస్సులు పార్కింగ్ చేయడం సరికాదని, వెంటనే మునిసిపల్ స్థలాన్ని బస్సుల యజమానులు ఖాళీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు రవికుమార్, మహేందర్, మాదవిలత, డీఈ సారంగం పాల్గొన్నారు.

కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో జయశ్రీకి డాక్టరేట్



కేయూ క్యాంపస్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ టూబీ వర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకురాలు జయశ్రీ కుమ్మరి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి జయశ్రీకి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'హెచ్‌డీపీఎఫ్ ఏ హైబ్రీడ్ ఫీచర్ సెలక్షన్ మెథడ్ ఫర్ హర్ట్ డిజీస్ పిరియాక్షన్ ఫ్రేమ్‌వర్క్స్ యూజింగ్ మిషన్ క్లీనింగ్ ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ సాధించారు. సీడీసీ టూబీ వర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు జి.శంకర్‌లింగం, ఎన్.సతీశ్‌కుమార్‌ల సంయుక్త పరిశోధనలో జయశ్రీ పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన జయశ్రీని వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు విభాగం ప్రొఫెసర్లు అభినందించారు.

విద్యుత్ సమస్యలపై లోకల్ కోర్టులు

రాంనగర్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎన్పీడీసీఎల్ పరిధిలోని పలు సబ్‌డివిజన్‌ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఎన్.వి.వేణుగోపాల్ చారి తెలిపారు. హనుమకొండ సర్కిల్‌లోని నయీంన గర్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న యాదవనగర్, గోపాల్‌పూర్, నయీంనగర్ సెక్షన్ పరిధిలో ఉన్న వినియోగదారుల కోసం శుక్రవారం నిర్వహిస్తున్న లోకల్ కోర్టును సంబంధిత వినియోగదారులు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అదే విధంగా ఈ నెల 17న భూపాపల్లి జిల్లాలోని రేగొండ సబ్‌స్టేషన్ ఆవరణంలో, 18న వరంగల్ సర్కిల్‌లోని అరెపల్లి సబ్‌స్టేషన్ ఆవరణంలో లోకల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్.వి.వేణుగోపాల్ చారి తెలిపారు. లోకల్ కోర్టుల్లో సీజీఆర్ఎఫ్ మెంబర్ టెక్నికల్ కె.రమేశ్, మెంబర్ ఫైనాన్స్ ఎన్. దేవేందర్, ఇండిపెండెంట్ మెంబర్ రామారావు పాల్గొంటారన్నారు.

వెంకటరత్నం, రామాలకు అజో, విబో పురస్కారాలు



రామా చంద్రమౌళికి ఎంపిక చేసిన పత్రాలను అందజేస్తున్న దృశ్యం



వెంకటరత్నంకు ఎంపిక చేసిన పత్రాలను అందజేస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో విశిష్ట సేవలను అందజేసిన ఓరుగల్లుకు చెందిన డాక్టర్ గుంజి వెంకటరత్నం, రామా చంద్రమౌళిలకు అజో, విబో కందాళం ఫౌండేషన్ వారు జీవితకాల పురస్కారాలను ప్రకటించడం విశేషం. వచ్చే జనవరి మాసంలో నగరంలోని కాళోజీ కళాక్షేత్రంలో సహృదయ సహకారంతో అజో, విబో ఫౌండేషన్ నిర్వహించే సాహిత్య వేడుకల్లో విశిష్ట సాహితీమూర్తిగా డాక్టర్ జేవీ రత్నంకు రూ.లక్ష నగదు పురస్కారం, సాహితీ ప్రతిభామూర్తిగా రామా చంద్రమౌళి సేవలను గుర్తిస్తూ రూ.50వేల నగదు పురస్కారంతో సత్కారం చేయనుందని సహృదయ అధ్యక్షుడు డాక్టర్ గిరిజా మనోహర్‌బాబు చెప్పారు. 2026వ ప్రతిభామూర్తిగా గుంజి వెంకటరత్నంను కవిగా, పరిశోధనాత్మక విమర్శకుడిగా, బహుగ్రంథకర్తగా అంతేకాక మహాభారత విజ్ఞాన సర్వస్వం, ఓరుగల్లు విజ్ఞాన సర్వస్వాన్ని అందజేసినందుకు వెంకటరత్నం సారస్వత సేవలకు గుర్తింపుగా జీవితకాలపు పురస్కారాన్ని ప్రదానం చేయనుందని ఆయన తెలిపారు.

ఆదేవిధంగా సాంకేతిక విద్యారంగంలో అధ్యాపకునిగా గణనీయ సేవలందించి, కవిగా, కథ రచయితగా, నవలాకారుడిగా బహుగ్రంథకర్తగా ప్రశంసలందుకున్న రామా చంద్రమౌళిని విశిష్ట సాహితీమూర్తిగా జీవితకాల పురస్కారానికి అజో, విబో ఫౌండేషన్ ఎంపిక చేసిందని గిరిజా మనోహర్‌బాబు చెప్పారు. ఈ సందర్భంగా వారిని కలిసి ఎంపిక చేసిన పత్రాలను న్యాలగొండ భాస్కర్ రావు, ఇతర సహృదయ సభ్యులు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- విచారిస్తున్న కాజీపేట పోలీసులు

కాజీపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తన మిత్రుడిని కలిసేందుకు వచ్చిన ఓ యవకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన తిరుమల గిరి రిషికేష్ (22) అనే యువకుడు బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల కిందట కాజీపేట విష్ణుపురిలోని మిత్రుడైన హర్షిత్‌ను కలిసేందుకు కాజీపేటకు వచ్చాడు. గురువారం కాజీపేట విష్ణుపురిలోని హర్షిత్ ఇంట్లో రిషికేష్ మృతి చెందాడు. దీంతో రిషికేష్‌ను మిత్రులు వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాసులు గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు మృతి అనుమానాస్పదంగా ఉందని, విచారించి తగు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. మృతుడు అనారోగ్యంతో మృతిచెందాడా..? ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా..? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం

నగర మేయర్ గుండు సుధారాణి
ఢిల్లీలో అరైజ్ సిటీస్ కార్యక్రమానికి హాజరు



ఢిల్లీ సదస్సులో పాల్గొన్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. ఇక్లీ సౌత్ ఏషియా, ఎన్ఐయూఏ సంయుక్తాధ్వర్యంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు జరుగుతున్న అరైజ్ సిటీస్ సదస్సులో వరంగల్ నుంచి మేయర్ గుండు సుధారాణి ప్రాతినిథ్యం వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) నిర్మాణానికి రూ.4170 కోట్ల నిధులు కేటాయించారన్నారు. వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. వరంగల్ నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి సహకారం అందిస్తోందని సదస్సులో మాట్లాడారు. ఈ సదస్సులో ఏఐయూజీ డైరెక్టర్ కుంజు గిల్, ఇక్లీ డైరెక్టర్ ఎమన్‌కుమార్, బెంగాల్ స్పెషల్ సెక్రెటరి రాజీవ్ సింగ్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాలు, పట్టణాల 200 మంది ప్రతినిధులు, మేయర్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

పర్వతగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన మద్దెల శ్రీనివాస్ (42) అనే రైతు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పర్వతగిరి పోలీసులు తెలిపిన ప్రకారం... గ్రామంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తూ 1.10 ఎకరాల పొలం ఉండగా నాటు వేశాడు. అలాగే వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ, ఆరోగ్య సమస్యలతో శ్రీనివాస్ బాధపడుతూ మనోవేదనకు గురయ్యేవాడని చెప్పారు. ఈ నెల 8వ తేదీన కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రపోగా, 9న తెల్లవారుజామున లేచి చూడగా భర్త కనిపించలేదు. దీంతో వెదకగా ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశలపై నీళ్లు

(3వ పేజీ తరువాయి)

సీన్ మొత్తం మారిపోయింది. ఎన్నికల ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

సర్వత్రా చర్చ

జీవో 9పై హైకోర్టు స్టేతో సర్వత్రా చర్చ ప్రారంభమైంది. రాజకీయ వర్గాల్లో ఈ పరిణామంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఎన్నికల భవిష్యత్తు ఎలా ఉంటుందనే విషయంలో మిశ్రమ స్పందన వెలువడుతోంది. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖరారు చేస్తూ జీవో 9 జారీ కావడంతో ఆ సామాజిక వర్గం నేతల్లో ఆనందం వ్యక్తమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు మరిన్ని సీట్లు దక్కనున్న దృష్ట్యా పోటీకి అవకాశాలు మెరుగైనట్టు వారు భావించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయదలుచుకున్న బీసీ ఆశావహులు ఆ మేరకు అన్ని సిద్ధం చేసి పెట్టుకున్నారు. కానీ స్టేతో వారి రాజకీయ భవిష్యత్త సందిగ్ధంలో పడింది.

ఎంబీబీఎస్ విజేతలకు సీపీ అభినందన



మెడికల్ సీటు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ

వరంగల్ క్రైం, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన హోంగార్డు పిల్లలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ గురువారం అభినందించారు. హోంగార్డు బాలకిషన్ కుమారుడు ముప్పా చందు మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా, మరో హోంగార్డు మోహన్ కుమార్తె భవాని ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. దీంతో ఏఆర్ అధికారుల చొరవతో హోంగార్డు పిల్లలను గురువారం కమిషనరేట్‌కు పిలిపించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్న పిల్లల చదువు పట్ల అశ్రద్ధ వహించొద్దని సిబ్బందికి సూచించారు.

అదే విధంగా సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా కుమార్తె తాన్య సభ సైతం హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా తాన్య అందుబాటులో లేకపోవడంతో డీసీపీని సీపీ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనువాస్, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్, హోంగార్డ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల అశోక్, హోంగార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7120	5300
మక్కలు	1802	1521
కందులు	6029	3022
పెసళ్లు	4522	3022
పల్లికాయ (సూక)	6500	3500
పల్లికాయ (పచ్చిది)	4000	2400
పసుపు (కాడి)	11209	7889
పసుపు (గోల)	10309	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16800	12000
యూఎస్341ఏసీ	16300	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



మహబూబాబాద్ రైల్వేస్టేషన్ (ఫైల్)



డోర్నకల్ రైల్వేస్టేషన్ (ఫైల్)

మానుకోటలో మెగా రైల్వే డిపో

మంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు అంతా..

కేంద్ర మంత్రి నుంచి జిల్లాకు చెందిన రాష్ట్ర అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధుల వరకు ఈ మెగా రైల్వే మెయింటెన్స్ డిపో మంజూరుకు కృషిచేసిన వారే ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన నాయకుల విజ్ఞప్తి మేరకు కేంద్రంలోని అధికార పార్టీకి చెందిన మంత్రి బండి సంజయ్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ కేంద్రానికి లేఖలు రాశారు. మరోవైపు మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, రైల్వే ఉద్యోగ సంఘ నాయకులు కూడా ఇక్కడ పీవోహెచ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తూ వినతులు ఇచ్చారు. వినతుల్లో కోరిన వాటికంటే అదనంగానే ఇక్కడ మంజూరుకావడంతో అటు కేంద్ర బీజేపీ, ఇటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.908.15 కోట్లు కేటాయించిని రైల్వేశాఖ
- డోర్నకల్‌కు రూ.48 కోట్లు కేటాయింపు
- ప్రత్యక్షంగా 1000 మందికి ఉపాధి
- పరోక్షంగా 5వేల మందికి ఆదరవు

మహబూబాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా ప్రయత్నిస్తే సాధ్యం కానిద్దంటూ ఏదీ లేదని మహబూబాబాద్ ప్రాంతానికి తాజాగా మంజూరైన కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు రుజువు చేస్తున్నాయి. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా అందరూ ప్రజాప్రతినిధులు, నాయకులు చేసిన ప్రయత్నాలు ఈ ప్రాంత నిరుద్యోగుల, ప్రజల కలలను సాకారం చేస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రం నుంచే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయిన తెలంగాణలో రైల్వేశాఖకు సంబంధించిన పలు అభివృద్ధి పనుల మంజూరీకి స్వరాష్ట్రం సిద్ధించిన దాదాపు దశాబ్దాకాల అనంతరం బీజం పడింది. సరుకు రవాణా నిర్వహణ సౌకర్యాల పెంపుదల రైల్వే వ్యాగన్లు, ఇంజన్లు మరమ్మతుల కోసం దక్షిణ మధ్యరైల్వే మానుకోటకు ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ ప్రాంతంలో పీవోహెచ్, ఆర్‌వోహెచ్, సిక్‌లైన్, సరుకు రవాణా రోలింగ్ స్టాక్ కోసం ట్రైన్ ఎగ్జామినేషన్ సౌకర్యాలతో 'మెగా ఫ్రైట్ మెయింటెన్స్ డిపో' ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల యువత సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తోంది. పనులు వేగవంతం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరుతోంది.

రైల్వేశాఖ ఉత్తర్వుల మేరకు వరంగల్, మహబూబాబాద్ మధ్య మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు కోసం రూ.908.15 కోట్లను రైల్వేశాఖ కేటాయించింది. అంతేకాకుండా సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోని డోర్నకల్‌లో సరుకు రవాణా రైళ్లను పరీక్షించే సౌకర్యాలను పెంచేందుకు కవర్‌షెడ్లు, సిమెంటు కాంక్రీట్‌తో రైలు పట్టాలు (బాలెస్ట్ లెస్ ట్రాక్) ఏర్పాటు కోసం రూ.48 కోట్లు కేటాయించింది. ఈ ప్రాంతంలో మెగా ఫ్రైట్ మెయింటెన్స్ డిపో ఏర్పాటు కోసం 300 ఎకరాల స్థల సేకరణ, ప్రాజెక్టు ప్రణాళిక బడ్జెట్ ప్రతిపాదనలు చేపట్టి నివేదిక ఇవ్వాలని కేంద్రం రైల్వే ఉన్నతాధికారులు దక్షిణమధ్య రైల్వే అధికారులకు ఉత్తర్వులు పంపారు. ఈ మెగా రైల్వే ప్రాజెక్టు ఇక్కడ ఏర్పాటైతే ప్రత్యక్షంగా వెయ్యి నుంచి 1500 మందికి, పరోక్షంగా ఐదు వేల మందికి ఉపాధి లభించనుంది. దీంతో జిల్లాకు చెందిన పలు వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

'మెగా మెయింటెన్స్ ఫ్రైట్ డిపో' అంటే...

స్థూలంగా చెప్పాలంటే సరుకు రవాణా రైళ్ల (ఫ్రైట్ ట్రైన్స్) కోసం పూర్తిస్థాయి పరిశీలన, మరమ్మతులు, నిర్వహణ చేయడానికి అవసరమైన సౌకర్యాలతో కూడిన పెద్ద కేంద్రాన్ని 'మెగా మెయింటెన్స్ ఫ్రైట్ డిపో'ను అంటారు. రోలింగ్‌స్టాక్ అంటే రైలు పట్టాలపై కదులుతూ.. ఉండే లోకోమోటివ్ ఇంజన్‌లు ప్రయాణికుల బోగీలు, సరుకు వ్యాగన్లు, ట్రాక్‌మెయింటెనెన్స్ వాహనాలు, ఇన్‌స్పెక్షన్‌కార్‌లు, క్రేన్ వంటి స్పెషల్ వెహికిల్‌లు ఈ విభాగంలో ఉంటాయి. ఇందులో పీవోహెచ్, ఆర్‌వోహెచ్, సిక్‌లైన్, సరుకు రవాణా రోలింగ్ స్టాక్ కోసం ట్రైన్ ఎగ్జామినేషన్ సౌకర్యాలుంటాయి. పిరియాడిక్ ఓవర్‌హాలింగ్ (పీవోహెచ్) విభాగంలో రైల్వే బోగీలు, వాగన్లు, ఇంజన్లు పూర్తి తనిఖీతో మరమ్మతు చేసే ప్రక్రియను నిర్వహిస్తారు. వ్యాగిన్లు, ఇంజన్లు ఏడాదిన్నర లేదా నిర్దిష్ట కిలోమీటర్లు నడిచిన తర్వాత ఈ ప్రక్రియను కొనసాగిస్తారు. ఇందులో భాగంగా బ్రేకులు, బేరింగులు, సస్పెన్షన్, కప్లింగ్‌లు తదితర పరికరాలను పూర్తిగా పరిశీలించి, పనికి రానివి ఉంటే కొత్తవి మారుస్తారు. రొటీన్ ఓవర్ హాలింగ్ (ఆర్‌వోహెచ్) ఇది రైల్వే వ్యాగన్లు నిరంతరం సురక్షితంగా నడవడానికి అవసరమైన చిన్న రిపేర్లు, గ్రీసింగ్, ఆయిల్ మార్పులు తదితర సాధారణ రొటీన్ చెకప్‌లు ఇందులో చేస్తారు. 'సిక్‌లైన్' అంటే పాడైన, ధ్వంసమైన రైళ్లు, బోగీలను నిలిపి మరమ్మతులు చేసే ప్రాంతం. ఇది రైల్వేస్టేషన్‌కు దగ్గరగా ఏర్పాటు చేస్తారు. ఇక్కడ చిన్న నుంచి మధ్యస్థ తరహా మరమ్మతులు చేస్తారు. చివరిది 'ట్రైన్ ఎగ్జామిన్ ఫెసిలిటీస్' అంటే రైలు బయలుదేరే ముందు పూర్తిగా చెక్‌చేసే సదుపాయాలు ఉంటాయి. రైలు బ్రేకులు, వీల్ బేరింగులు, కప్లింగులు, లైటింగ్, సిగ్నలింగ్ తదితర అన్నీ వ్యవస్థలను పరిశీలించే సౌకర్యాలుంటాయి. దీని వల్ల సరుకు రవాణా రైళ్లు సురక్షితంగా సమయానికి నడుస్తాయి.



తాళ్లపూసపల్లి సమీపంలో లోకోమోటివ్ పీవోహెచ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న రైల్వే భూమి



గతంలో భూపాలపల్లిలో శిక్షణ పొందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ టీం

సేవా స్కౌట్లు ఎక్కడ..?

కుంటుపడిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

- కొరవడుతున్న దేశభక్తి, సేవాభావం
- పెడదారిపడుతున్న యువత

భూపాలపల్లిటౌన్, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, దేశ సేవ అందించే సేవా స్కౌట్ల మనుగడ ఎక్కడ అనే ప్రశ్న పలువురి మదిలో మెదులుతోంది. రాను రాను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు కుంటుపడిపోతున్నాయి. అంతేకాదు.. యువతీయువకుల్లో దేశభక్తి, సేవాభావం పెంచే నాథులే లేకుండాపోతున్నారు. వెరసి యువత పెడదారి పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

చిన్న వయస్సు నుంచే బాలబాలికల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవాభావం, మానవతా విలువలు నేర్పించేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ పనిచేస్తుంది. ఇది పూర్తిగా ఉచిత సేవలు అందించే స్వచ్ఛంద సంస్థ. దీనిని బాలబాట ఉద్యమం అని కూడా అంటారు. బాలుర బృందాలను స్కౌట్స్, బాలికల బృందాలను గైడ్స్ అంటారు. ఈ ఉద్యమాన్ని సర్ రాబర్ట్ బెడన్ పవల్ 1907లో దక్షిణాఫ్రికాలో జరిగిన బోయర్ యుద్ధాల్లో గాయపడిన వారికి సేవ చేయడానికి ప్రారంభమైంది. దేశంలోని నిరక్షరాస్యతను నిర్మూలించడమే కాకుండా, విపత్తులు సంభవించినప్పుడు, ప్రజలు ఆపద సమయాల్లో ఉన్నప్పుడు ఆదుకునే సేవలు చేయడం, పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసే కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అనేక కార్యక్రమాలు చేపడతారు. వీరికి ఆయుధాలు లేకుండా కర్రను మాత్రమే ధరించి ఈతకొట్టడం, వంతెనలు ఎక్కడం, ప్రథమ చికిత్స వంటి శిక్షణలు కూడా పొందుతారు. ప్రత్యేక దుస్తులు ధరించడం, టీంకు ఒక లీడర్ ఉండడం వీరి ప్రత్యేకత.

నిర్వహణ వీరిదే..

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ టీంకు గాను తెలంగాణ రాష్ట్రంలో చీఫ్ కమిషనర్‌గా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, గవర్నర్‌గా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి ఉంటారు. అలాగే జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షుడుగా, జిల్లా విద్యాశాఖ అధికారి చీఫ్ కమిషనర్‌గా ఉంటారు. అయితే కొంతకాలంగా దీని గురించి పట్టించుకున్న నాథులే కరువయ్యారు. దీనికి సంబంధించిన కార్యక్రమాలు సైతం కనుమరుగయ్యాయి. యువతలో క్రమశిక్షణ మాట అటుంచితే.. దేశభక్తి పూర్తిగా కోల్పోయే దుస్థితి దాపురించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

సింగరేణిలో

భూపాలపల్లి జిల్లా అంటేనే సింగరేణి బొగ్గు గనులు. ఇక్కడ గత ఐదేళ్ల క్రితం స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ఎంతో చురుగ్గా సాగేవి. గనుల్లో ఏ ప్రమాదం జరిగినా.. వారికి వారివంతు సహాయాన్ని అందించేవారు. అలాగే విపత్తులు జరిగి నప్పుడు మేం ఉన్నామంటూ.. ముందుకు వచ్చేవారు. వివిధ రకాల సేవా కార్యక్రమాలు జరిగేవి. జిల్లాలో రైతుల ఆత్మహత్యలు ఆపేందుకు తనవంతు బాధ్యతగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

వయోజన విద్య, ప్రభుత్వ పథకాలపై అవగాహన, ఎయిడ్స్ నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. దీనికి గతంలో ఇక్కడ సింగరేణిలో పనిచేసిన శ్రీనివాస్ అనే డిస్ట్రిక్ట్ లీడర్ ఇలా చాలా సేవా కార్యక్రమాలు నిర్వహించి తనదైన శైలిని చాటుకున్నారు. కానీ ఇప్పుడు పూర్తిగా కుంటుపడ్డాయి. సింగరేణిలో పనిచేసే కార్మి కుల పిల్లలతో పాటు ఇతర పిల్లలు సైతం మాదక ద్రవ్యాలకు అలవాటుపడి తీరని నష్టా లను చవిచూస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

గతంలో ఇక్కడ 12యూనిట్లు నడిచేవి. కానీ ఇప్పుడు ఒకే ఒక యూనిట్ మాత్రమే యాక్టివ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ ఒక్క యూనిట్‌లో 32 మంది సభ్యులు ఉంటారు. దీంతో ప్రజలకు సరైన సేవలు అందడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. అలాగే ప్రాంత ప్రజల నోట తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఆరుగురికి ప్రాణంపోసి.. తాను కన్నుమూసి..

- హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్ డెడ్
- అవయవాల దానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు
- మృతుడు జనగామ జిల్లా వాసి
- మండేలగూడెంలో యుగంధర్‌కు కన్నీటి వీడ్కోలు



మండేలగూడెంలో గాదె యుగంధర్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు తదితరులు



గాదె యుగంధర్(ఫైల్)

రఘునాథపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తాను కన్నుమూస్తూ మరో ఆరుగురి జీవితాల్లో కొత్తవెలుగులు నింపాడు.. దసరా పండక్కి ఇంటికి వచ్చి హైదరాబాద్ వెళ్తుండగా యువకుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బ్రెయిన్ డెడ్ అవడంతో పుట్టెడు బాధలో కన్నీటిని దిగమింగి.. కుమారుడి అవయవదానికి తల్లిదండ్రులు ముందుకువచ్చారు. గురువారం అశ్రునయనాల మధ్య జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మండేలగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.

గాదె మురళీధర్-శోభ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు గాదె యుగంధర్ (29) హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండక్కి స్వగ్రామానికి వచ్చిన యుగంధర్ ఈనెల 5న ఆదివారం సాయంత్రం తన మేనబావ చందుతో బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. రామంతపూర్ సమీపంలో కంట్లో దుమ్ము పడుతుందని కంటి అద్దాలు పెట్టుకుంటుండగా, ఎదురుగా మరో వాహనం రావడంతో సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉప్పల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి మరుసటి రోజు (సోమవారం) సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులు చికిత్స అందించిన వైద్యులు బుధవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. అవయవాలు దానం చేసి ప్రాణదానం చేయాలని వైద్యులు కోరడంతో యుగంధర్ తల్లిదండ్రులు పుట్టెడు బాధలోనూ ఆరు అవయవాల దానానికి అంగీకరించి ఆదర్శంగా నిలిచారు. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కళ్లు వేరు చేసి అపోలో, కిమ్స్ తదితర ఆస్పత్రుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి కోసం గ్రీన్ ఛానల్ మార్గంలో తరలించి ఆరుగురు రోగులకు అమర్చారు. అనంతరం మృతదేహాన్ని గురువారం మండేలగూడెం తరలించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే యుగంధర్ అయిదు రోజుల వ్యవధిలోనే విగతజీవిగా మారడాన్ని బంధువులతో పాటు గ్రామస్థులు జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, మజీ జడ్పీటీసీలు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, బొల్లం అజయ్‌మణికంఠ నివాళులర్పించారు.

కేయూ తెలుగు పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు రద్దు?

పారదర్శకంగా జరగకపోవడమే కారణం

కేయూ క్యాంపస్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఇటీవల నిర్వహించిన పీహెచ్‌డీ అడ్మిషన్ల ఇంటర్వ్యూల ప్రక్రియ రద్దుకు రంగం సిద్ధమైంది. యూజీసీ నిబంధనల మేరకు ఇటీవల సోషల్ సైన్స్, ఆర్ట్స్, సైన్స్‌తో పాటు ఇతర విభాగాల్లో ఖాళీలకు అనుగుణంగా ఆయా విభాగాల డీన్లు నోటిఫికేషన్లు జారీ చేశారు. అయితే ఆర్ట్స్ ఫ్యాకల్టీలో తెలుగు విభాగంలో 4 సీట్లకు అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను వెలువరించారు. తెలుగు విభాగంలో 4 సీట్లకు 30 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 11మంది జేఆర్ఎఫ్ (జూనియర్ రిసెర్చ్ ఫెల్లోషిప్ యూజీసీ న్యూఢిల్లీ) పొందిన వారుండగా మరో 19మంది జాతీయ స్థాయి నెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారున్నారు. అయితే ఇంటర్వ్యూలకు జేఆర్ఎఫ్ అర్హత కలిగిన ఒక్కరు, నెట్ అర్హత కలిగిన ఇద్దరు గైర్హాజరయ్యారు.

నిబంధనల మేరకు జాతీయ స్థాయిలో ఫెల్లోషిప్, నెట్, స్లెట్ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఫెల్లోషిప్‌లో జేఆర్ఎఫ్, నెట్, స్లెట్‌తో పాటు యూజీ, పీజీ, ఎంఫిల్, పరిశోధన పత్రాలకు మార్కుల వెయిటేజీలో మొత్తంగా అభ్యర్థుల తుది మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలకు వర్సిటీతో పాటు ఇతర వర్సిటీకి చెందిన సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లు ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా 10 మార్కులను కేటాయిస్తారు.

అయితే నిబంధనల మేరకు తెలుగు విభాగంలో ఇంటర్వ్యూ ప్రక్రియ సక్రమంగా జరుగలేదని వర్సిటీ ఉన్నతాధికారులు గుర్తించారు. మెరిట్‌కు అన్యాయం జరిగిందని అనర్హులను ఎంపిక చేసినట్లు గుర్తించారు. నిబంధనలను అతిక్రమించి అనర్హులను ఎంపిక చేయడం పట్ల వర్సిటీ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడంపై విస్మయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఏ ప్రతిపాదికన అభ్యర్థులను ఎంపిక చేశారనే అంశం చర్చనీయాంశంగా మారింది. తెలుగు విభాగంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులకు మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించి పారదర్శకంగా అడ్మిషన్ల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

పిక్కలు పీకుతున్న వీధి కుక్కలు

- నగరంలో ఎక్కడ చూసినా భౌభౌల స్వైర విహారం
- గ్రేటర్ పరిధిలో 37.625 వీధి కుక్కలు ఉన్నట్టు అంచనా
- ఒకే రోజు చింతల్‌లో 18 మందిపై కుక్కల దాడి
- చింతగట్టు ఏబీసీ సెంటర్ కేంద్రంగా సిబ్బంది సేవలు
- ప్రతిపాదించిన మరో ఏబీసీ సెంటర్ మాటే లేదు



వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్‌లలో ఎక్కడ చూసినా మందలకొద్ది వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో కుక్కల అరుపులకు కాలనీల ప్రజలు జాగారం చేస్తున్నారు. ప్రధానంగా ఉదయం 5 గంటల సమయంలో ప్రత్యేక అరుపులను సాగదీస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పాదచారులు రోడ్లపై నడవాలంటే వీధికుక్కలతో భయాందోళనలకు గురవుతున్నారు. ఐదేళ్లుగా వరంగల్ ట్రైసిటీస్‌లో వీధి కుక్కల సమస్య తీవ్రతరంగా మారుతోంది. కాలనీలలో స్వేచ్ఛగా తిరుగుతున్న కుక్కలు.. నగర ప్రజలపై దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో ఇటీవల చింతల్ ప్రాంతంలో ఒకే రోజు 18 మందిపై వీధి కుక్క దాడి చేసినా ఇప్పటివరకు ఆ ప్రాంతంలో కుక్కలు పట్టడానికి స్పెషల్ డ్రైవ్ చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సమయాల్లో వీధి కుక్కలు దాడి చేస్తున్నాయని అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా కుక్కకాటు కేసులు ఎంజీఎంతో పాటు సంబంధిత పీహెచ్‌సీలకు వస్తున్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. కొందరికి సరైన సమయానికి యాంటీ రేబిస్ ఇంజక్షన్లు అందక మరణిస్తున్నట్టు తెలిసింది. ప్రధానంగా స్కూళ్లకు వెళ్లే పిల్లలు, తల్లులు కుక్కకాటుకు గురవుతున్నారు. కొన్ని చోట్ల వీధి కుక్కలు చర్మ సంబంధ వ్యాధుల బారిన పడి ప్రజల మధ్య సంచరిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చావుదశకు చేరిన వీధి కుక్కలను సుదూర ప్రదేశాలకు తరలించి డిస్పోజల్ చేయాలని సీడబ్ల్యూఎంసీ అధికారులు ఆశిస్తున్నప్పటికీ కొందరు జంతు ప్రేమికులు చట్టాలు, సెక్షన్లు చూపిస్తుండడంతో ఏం చేయలేక చేతులెత్తేస్తున్నట్టు బల్దియా వెటర్నరీ సిబ్బంది తెలిపారు.

బల్దియా వ్యాప్తంగా 37,625 శునకాలు

గ్రేటర్ వరంగల్ 66డివిజన్‌ల పరిధిలోని విలీన గ్రామాలను కలుపుకుని 2025 మార్చి వరకు షై ఎనిమల్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ చెప్పిన లెక్కల ప్రకారం 37,625వీధి కుక్కలు సంచరిస్తున్నట్టు వెల్లడించారు. కుక్కలను పట్టుకుని కుటుంబ నియంత్ర ఆపరేషన్లు చేసినా రెండేళ్లలో కొన్ని మరణించగా, మరో పది వేలు వృద్ధి చెందినట్టు తెలిసింది. చింతగట్టు ఏబీసీ (ఎనిమిల్ బర్త్ కంట్రోల్ సెంటర్) వద్ద ప్రతీ రోజుకు 25 కుక్కల చొప్పున అర్హత కలిగిన పశువుల డాక్టర్లు కుక్కల సంతాన వృద్ధి నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు అసిస్టెంట్లు, 5గురు హెల్పర్లు ఒక కుక్క ఆపరేషన్ కోసం అరగంట కష్టపడి అన్ని జాగ్రత్తలతో శస్త్రచికిత్స చేస్తున్నారు. అక్కడ పని చేసే 12 మంది బిహారీలు నగరంలో వీధికుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నారు.ఇప్పటి వరకు 8ఏళ్లకాలంలో సుమారు 25వేల వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేష న్లు చేసినట్టు అధికారులు వెల్లడించారు. బల్దియా సంబంధిత అధికారులు వీధి కుక్కలను పట్టుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నప్పటికీ ఆడ శునకం ఏటా రెండు ఈతలు చేయగా, ఒక ఈత (ప్రసవం)లో కనీసం 5నుంచి 8 పిల్లలు చేస్తుంది. పిల్లలు సైతం ఆరు మాసాలకే ఎదకురావడం అవి కూడా పిల్లలు పెట్టడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో కుక్కలు వృద్ధి చెంది జనావాసాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని డాక్టర్లు చెప్పుకొస్తున్నారు. వర్షాకాలంలో కుక్కలు ఎక్కువ మొత్తంగా క్రాసింగ్ జరగడం వల్ల తిరిగి వర్షాకాలం వచ్చే సరికి వందల సంఖ్యలో వీధి కుక్కలు బయటకు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వీధి కుక్కలు గడ్డివాములు, చెట్ల పొదలు, వదిలేసిన పాత ఇళ్లలో ప్రసవించడంవల్ల బర్త్ డేటాను లెక్కించలేకపోతున్నామని డాక్టర్లు చెబుతున్నారు.

రెండో ఏబీసీ సెంటర్ మాటే ఎత్తరు

గ్రేటర్ వరంగల్ నగర పాలం సంస్థ ఆధ్వర్యంలో చింతగట్టు కెనాల్ ప్రాంతంలో ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్) 2018లో ఏర్పాటు చేసి అక్కడి నుంచే కుక్కల సంతాన నియంత్రణ చేస్తున్నారు. నగర ప్రజలు కుక్కకాటుకు గురికావడం పట్ల చాలామంది ఫిర్యాదులు చేయడంతో సెంట్రల్ గవర్నమెంట్ స్కీం కింద రాష్ట్రంలో నాలుగు ఏబీసీ సెంటర్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలలో రెండేసి సెంటర్లు ఏర్పాటు చేశారు. కాని 14 లక్షల జనాభా కలిగిన వరంగల్ నగరంలో ఒక్క ఏబీసీ సెంటర్ సేవలందించలేకపోతున్నారు. స్వతంత్ర యానిమల్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రస్తుతం వరంగల్ సీడబ్ల్యూఎంసీ వీధి కుక్కల నియంత్రణ కాంట్రాక్ట్ పొందింది. వీరు రోజుకు 50కుక్కలను పట్టుకొచ్చినా 10 నుంచి 20 కుక్కలకు మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరుగుతున్నాయి. చాలా కుక్కలు ఆకలితో అలమటిస్తూ కొన్ని అక్కడే మృత్యువాత పడుతున్నాయి. ఒక కుక్కను పట్టుకున్నది మొదలు ఆపరేషన్ చేసి తిరిగి యదాస్థానానికి వదిలి వేసే వరకు రూ.800 వరకు ఇస్తున్నారు. ఐదేళ్ల కిందట మరో ఏబీసీ సెంటర్‌ను ఏనుమాముల ప్రాంతంలో ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఆచరణ అసాధ్యం అవుతోంది. పాలకవర్గం, కమిషనర్ ఇతర విభాగాలపై పెట్టిన దృష్టి.. కుక్కలు, కోతుల నియంత్రణపై పెట్టాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల సమాచారం ఇవ్వండి ఇలా..



బల్దియా పరిధిలో ఎక్కడైనా ప్రజలపై కుక్కలు దాడి చేసినా, కరిచినా బాధితులు జీడబ్ల్యూ ఎంసీ సిబ్బందికి సమాచారం ఇస్తే తక్షణమే పరిష్కారం జరుగుతుందని చెప్పుకొస్తు న్నారు. ముందుగా స్థానిక మున్సిపల్ జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్, వెటర్నరీ డాక్టర్, సీఎంహెచ్‌వోకు ఫోన్‌లో సమాచారం ఇవ్వవచ్చు. వాట్సాప్‌లో తెలుపవచ్చు. లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1800 425 1980, 9701999689, 8919130853, ఆరోగ్య శాఖ టోల్ ఫ్రీ నెంబరు 104, ఆస్పత్రి అత్యవసర సేవలు 108 నెంబర్‌లకు ఫోన్ చేయవచ్చు. ప్రజల ఫిర్యాదులు స్వీకరించి న అధికారులు.. వెంటనే సంబంధిత ప్రదేశానికి అక్క డి మున్సిపల్ జవాన్‌ల సహా యంతో బిహార్ యువకులు ప్రత్యేక వాహనాలలో చేరుకుని వీధి కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తారు. వాటి సంతాన నియంత్రణ ఆపరేషన్‌లు పూర్తి చేసిన తర్వాత ఎక్కడ నుంచి పట్టుకున్నారో అక్కడే వదిలేస్తామని మునిసిపల్ వెటర్నరి అధికారి తెలిపారు.

ముగిసిన సైన్స్ డ్రామా పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు ముగిశాయి. గురువారం హంటర్‌రోడ్‌లోని సైన్స్ సెంటర్‌లో దక్షిణ భారత సైన్స్ డ్రామా జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాయంపేట తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సైన్స్ డ్రామా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో పాటు పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో డాక్టర్ బండారు మన్మోహన్, డీఎస్‌వో శ్రీనివాసస్వామి, న్యాయనిర్ణేతలు శ్రీధరస్వామి, రాములు పాల్గొన్నారు.



సైన్స్ డ్రామా పోటీల్లో గెలుపొందిన విజేతలతో నిర్వాహకులు

కేడీసీలో ఉచిత నోట్స్ పంపిణీ

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కేడీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వృక్షశాస్త్ర ఉచిత నోట్స్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ పంపిణీ చేశారు. గురువారం కళాశాలలో బోటనీ అధ్యాపకులు డాక్టర్ యుగేందర్ రూపొందించిన నోట్స్‌ను ప్రిన్సిపాల్ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం నోట్స్ రూపొందించిన అధ్యాపకుడు యుగేందర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ కోమల, అధ్యాపకులు శ్యాంప్రసాద్, సమ్మయ్య, ఘన్‌సింగ్, నరేందర్, గాంధీ, శ్రీనివాస్, దినకర్, కిరణ్, రాం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీ, పాలజెండా, బుద్దానగర్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, పెద్దమ్మగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దమ్మగడ్డ, టాటా మోటర్స్, జ్యోతిబసుకాలనీ, కేఎస్‌ఆర్ గార్డెన్, ఎస్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్, హ్యూమన్ జంక్షన్ ఏరియాలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

'వరంగల్ నుంచి బస్తర్' వరకు

పుస్తక ఆవిష్కరణ



పుస్తక ఆవిష్కరణలో అతిథులు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్పూర్ రాజమహల్‌లో మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ డాక్టర్ రమణ్‌సింగ్ చేతుల మీదుగా చరిత్రకారులు అరవింద్ ఆర్య, కట్టా శ్రీనివాస్ రచించిన 'ఓరుగల్లు నుంచి బస్తర్ వరకు' అనే చారిత్రక గ్రంథం ఆవిష్కరణ గురువారం జరిగింది. ఈ పుస్తకం తెలంగాణలోని కాకతీయ రాజధాని ఓరుగల్లు (వరంగల్) నుంచి మధ్య భారతదేశంలోని బస్తర్ వరకు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలను ఆధారాలతో వివరిస్తుంది. బస్తర్ దసరా ఉత్సవాలు, దంతేశ్వరి దేవాలయ మూలాలు, కాకతీయ వంశ ప్రభావంపై ఈ గ్రంథంలో విపులమైన పరిశోధనాత్మక విశ్లేషణలు ఉన్నాయి. అనంతరం మహారాజ కమల్ చంద్ర భంజ్‌దేవ్ మాట్లాడుతూ.. వరంగల్ నుంచి బస్తర్ వరకు ఉన్న చారిత్రక కట్టడాలు, వారసత్వ విశేషాల గురించి పుస్తకం తెలుపుతుందన్నారు. ఇది భవిష్యత్ తరాలకు ఒక చారిత్రక వారధిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న అగ్రవర్ణాలు

వడ్డేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లను అగ్రవర్ణ రాజకీయ నాయకులు అడ్డుకుంటున్నారని బీసీఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి అన్నారు. గురువారం హనుమకొండ పరిమళ కాలనీలోని బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా అగ్రవర్ణ రాజకీయ పార్టీల నాయకులు హైకోర్టును ఆశ్రయించడం వలన స్టే ఇచ్చిందని ఆరోపించారు. బీసీల 42శాతం రిజర్వేషన్లను అడ్డుకున్న వారికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా కార్యదర్శి చిలువేరు రాంచందర్, జిల్లా నాయకులు కందకట్ల రాజు, ఎ. రవితేజ, సంపత్ యాదవ్, శ్రీధర్‌రాజు, సండెల హరినాథ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన డీటీడీవో

తుడుం దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగేశ్వర్‌రావు

వడ్డేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన హనుమకొండ, జనగామ జిల్లాల డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ (డీటీడీవో)ను వెంటనే సస్పెండ్ చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి చింత నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధికార ప్రతినిధి ఈక భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి ఒక మల్టీ జోన్ నుంచి మరొక మల్టీ జోన్‌కు డిప్యూటేషన్ డీటీడీవో ఇచ్చిన డిప్యూటేషన్లను రద్దు చేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ సెప్టెంబరు 29 నుంచి అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌ను డీటీడీవో ఉల్లంఘించి హనుమకొండ సుబేదారి జులైవాడ ఏహెచ్‌ఎస్(బాలికల) ఆశ్రమం నుంచి ఎస్‌జీటీ పద్మను ఏకంగా స్టేషన్ ఘన్‌పూర్ ఏహెచ్‌ఎస్ బాలికల పాఠశాలకు డిప్యూటేషన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని అన్నారు. డీటీడీవోను బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ తోటి బిరుదు గోండు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు సోయం రాజేందర్, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా నేత బానోతు లక్ష్మణ్ నాయక్, ఆదివాసీ సంఘం నేత సోలం శరత్, రవి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

వర్ధన్నపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : యువ పరివర్తన్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట పట్టణంలో ఈనెల 10న ఉదయం 9.30 గంటలకు నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని యువ పరివర్తన్ వరంగల్ జిల్లా మేనేజర్ నరేష్ కించా, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ బెల్లంకొండ వెంకట్, వర్ధన్నపేట మేనేజర్ రంజిత్ తెలిపారు. సుమారు 34 ప్రముఖ జాతీయ, రాష్ట్ర స్థాయి కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, మార్కెటింగ్, హెల్త్ కేర్, టెక్నీషియన్, టైలరింగ్, బ్యూటీ షియన్, మెకానిక్ తదితర రంగాలలో సుమారు 300లకు పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తారని తెలిపారు.పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు వారి విద్యార్హతలతో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా(5) కాపీలు, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డు, పాస్ పోర్టుసైజు ఫొటోలతో నేరుగా జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 83286 55542 /9676843762లలో సంప్రదించాలని కోరారు.

బీజేపీ మండల ఇన్‌చార్జీల నియామకం

మిల్స్‌కాలనీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు జిల్లాలో గురువారం మండల ఇన్‌చార్జి లను నియమించారు. హసన్‌పర్తి మండల ఇన్‌చార్జిగా గురుమూర్తి శివకుమార్, ఐనవోలు-ముత్తిరెడ్డి కేశవరెడ్డి, వర్ధన్నపేట-వన్నాల వెంకటరమణ, పర్వతగిరి- ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నర్సంపేట రూరల్-కుసుమ సతీష్‌బాబు, దుగ్గొండి- వడ్డెపల్లి నర్సింహులు, నెక్కొండ-సముద్రాల పరమేశ్వర్, ఖానాపూర్-రత్నం సతీష్‌షా, చెన్నారావుపేట-కంభంపాటి పుల్లారావు, నల్లబెల్లి-గోగుల రాణా ప్రతాప్‌రెడ్డిని నియమించామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ తెలిపారు.

సీజేఐపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ లీగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బీఆర్. గవాయ్‌పై దాడికి నిరసనగా బహుజన న్యాయవాద ఫోరం ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల సుప్రీంకోర్టులో జస్టిస్ గవాయ్ విధులు నిర్వర్తిస్తుండగా ఆయనపై రాకేష్ కిశోర్ అనే న్యాయవాది బూటు విసిరిన విషయం తెలిసిందే. గురువారం ఫోరం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద దాడికి పాల్పడిన న్యాయవాది దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బహుజన న్యాయవాద ఫోరం కన్వీనర్ గంధం శివ మాట్లాడుతూ.. సనాతన ధర్మం పేరుతో ఈ దేశంలో మళ్లీ మనుధర్మ శాస్త్రాన్ని బలవంతంగా బహుజనులపై రుద్దడం కోసం మతోన్మాద శక్తులు పనిచేస్తున్నాయని అన్నారు. దానిలో భాగంగానే చీఫ్ జస్టిస్‌పై దాడి జరిగిందని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్‌గా గవాయ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ ఉన్మాద శక్తులు జీర్ణించుకోలేక పోతున్నాయని ఆయన ఆరోపించారు. ఇకనైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఏకతాటిపైకి వచ్చి మనుధర్మానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గంధం శివ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైరపాక జయాకర్, న్యాయవాదులు తీగల జీవన్‌గౌడ్, పి.కృష్ణస్వామి, పాము రమేష్, లావుడ్య సిద్ధూనాయక్, రమేష్, దీకొండ ప్రభంజన్, మాడ సృజన్, వరంగల్ కార్యవర్గ సభ్యుడు మహేందర్, నిర్మల, ప్రవీనా, జన్ను పద్మ, కంప వినోద్‌కుమార్, పల్లకొండ హరి, కడపాక రాజేందర్, పాణి, పెండ్యాల అనిల్, మేడ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తి దిష్టిబొమ్మ దహనం



రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న నాయకులు

జస్టిస్ గవాయ్‌పై దాడి అమానుషం

కాజీపేట: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ గురువారం కాజీపేట చౌరస్తాలో తేజోమై మాలకుల సంక్షేమ సంఘం నిరసన చేపట్టింది. పలువురు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్య దర్శులు మర్యాల కృష్ణ, బండి విజయ్‌లు మాట్లాడారు.. గవాయ్‌పై దాడి చేయడం అమానుషమన్నారు. దాడికి పాల్పడిన న్యాయవాదిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడిని యావత్ భారత ప్రజలంతా ఖండించాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి పప్పుల గోవర్ధన్, నాయకులు సీహెచ్ కొమ్మాలు, తండమల్ల వేణు, సిరిల్ లారెన్స్, మైలారం శంకర్, బండి రాంచందర్, శేఖర్, సాంబయ్య పాల్గొన్నారు.



చరణ్‌ను అభినందిస్తున్న హెడ్మాస్టర్, ఉపాధ్యాయ బృందం

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు మర్కజీ విద్యార్థి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.చరణ్ ఎంపికైనట్లు హెడ్మాస్టర్ జీవీ రామారావు తెలిపారు. ఇటీవల హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహించిన పోటీల్లో 70 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం చరణ్‌ను హెడ్మాస్టర్, ఉపాధ్యాయ బృందంతో అభినందించారు.



వేణుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న సినీ నటుడు బాబుమోహన్

గొలనకొండ వేణుకు డాక్టరేట్

హనుమకొండ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఆర్టీసీ రీజినల్ పరిధిలో 17 ఏళ్లుగా కండక్టర్‌గా ఉద్యోగం చేస్తూనే వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొలకొండ వేణుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వేణుకు సినీ నటుడు బాబుమోహన్ చేతుల మీదుగా డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించిన వేణును నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఈ సందర్భంగా వేణుకు అభినందనలు తెలిపారు.



సూపరింటెండెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన కమిటీ సభ్యులు

మెడికల్ ఎంప్లాయిస్ నూతన కమిటీ ఎన్నిక

వరంగల్ మెడికల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ ఎంజీఎం హాస్పిటల్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అనంతరం ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివనందం ఆధ్వర్యంలో ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గౌరవ అధ్యక్షుడిగా శివ, సలహాదారులుగా డి.రాజు, అధ్యక్షుడిగా ఎస్.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా డి.శాంత, కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా మంద సంజీవ, దామెర కృష్ణ, కృష్ణ, రమాదేవి, స్వరూప, సూరమ్మ, బాబు, యాదమ్మ, సునీత, శామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడుదాం

భారత్ బచావో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వెంగళ్‌రెడ్డి

వడ్డెపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక తెలంగాణ సాధన కోసం పోరాడుదామని భారత్ బచావో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంగళ్ రెడ్డి అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.టీపీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు జనగాం కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఆవిర్భావ సభలో ముఖ్య అతిథిగా హాజరైన వెంగళ్ రెడ్డి మాట్లాడారు. ప్రాంతేతరుడు దోపిడీ చేస్తే ప్రాంతం దాటేదాక పారదోలుదాం, ప్రాంతీయుడే దోపిడీ చేస్తే ప్రాంతంలోనే పాతర పెడుదాం అనే స్ఫూర్తితో పుట్టిన టీపీఎఫ్ పాలకుల మెడలు వంచి విజయపరంపరలో ముందుకు సాగుతుందని అన్నారు. పోరాటాల పునాదులపై సాధించుకున్న రాష్ట్రంలో అగ్రకుల సంపన్న వర్గం మినహా ఏ వర్గం ప్రజలు తమ హక్కులను, ఆకాంక్షలను సాధించుకోలేకపోయారని పేర్కొన్నారు. ప్రధానంగా ఆదివాసీల పాలిట తెలంగాణ రాష్ట్రం శాపంగా మారిందని దుయ్యబట్టారు. టీపీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షుడు జనగాం కుమారస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆదివాసీల అస్తిత్వం కోసం పోరాడుతామని అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామిక తెలంగాణే తెలంగాణ ప్రజాఫ్రంట్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోభారత్ బచావో రాష్ట్ర నేత ఎస్. రాంబ్రహ్మం, ఎస్. ఓం బ్రహ్మం, టీపీఎఫ్ రాష్ట్ర నాయకురాలు బి.రమాదేవి, ప్రజా సంఘాల నాయకులు గంగుల దయాకర్, క్రాంతి, దొమ్మాటి ప్రవీణ్, యాకర సోమన్న, బ్రహ్మాచారి, సదానందం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి, జనగాం కుమారస్వామి

సీపీఎం ఆధ్వర్యంలో చెగువేరా వర్ధంతి

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చెగువేరా వర్ధంతిని గురువారం హనుమకొండలోని సీపీఎం కార్యాలయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చెగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెగువేరా సామ్రాజ్యవాదానికి, కార్పొరేట్ శక్తుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాటాలు చేశారని కొనియాడారు. నేడు దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కార్మిక హక్కులను దెబ్బతీసే నిర్ణయాలు, వ్యవసాయ రంగాన్ని ప్రైవేటీకరించే కుట్రలు పన్నుతూ ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మడం, యువతకు ఉద్యోగావకాశాలు తగ్గించడం, విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత చెగువేరా ఆశాయాలను కొనసాగించాలని ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్, బొట్ల చక్రపాణి, రమేష్, మంద సంపత్, ఎల్.దీప, మంద మల్లేశం, డి.రాజేందర్, కె.సుదర్శన్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.



చేగువేరా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



బైఠాయించి నిరసన చేస్తున్న విద్యార్థులు

ఫీజులను తగ్గించాలని విద్యార్థుల ఆందోళన

కేయూ క్యాంపస్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పెంచిన ఫీజులను తగ్గించాలని విద్యార్థులు గురువారం కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి నిరసన, ఆందోళనకు దిగారు. మొదటి సెమిస్టర్‌లో ఫీజులను భారీగా పెంచారని నినాదాలు చేశారు. రిజిస్ట్రేషన్‌తో పాటు అన్నిఫీజులు కలిసి గతంలో ఉన్న రూ.1340ని ప్రస్తుతం రూ.3250కి పెంచారని పేర్కొన్నారు. పెంపును ఖండిస్తున్నట్లు వివరించారు. తమ డిమాండ్‌లతోకూడిన వినతిపత్రాన్ని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు తన చాంబర్‌లో కలిసి అందచేశారు. ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేశ్, ఉప్పుల శివ, అంకిత, పావని, సంజయ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఫిజీషియన్ సదస్సుకు ఆహ్వానం

వరంగల్ మెడికల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రపంచ ఫిజీషియన్ సదస్సుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను అమెరికాలో స్థిరపడిన డాక్టర్ సురేశ్‌రెడ్డి ఆహ్వానించారు. ఫిజీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న డాక్టర్ సురేశ్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.



గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

హసన్‌పర్తిలో ఇద్దరి నామినేషన్

హసన్‌పర్తి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మొదటి రోజు ఎన్నికల ప్రక్రియలో కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.మధు, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా గెజిటెడ్ హెచ్‌ఎం రోజారమణి విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో మొదటి రోజు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మధ్యాహ్నం ప్రారంభమైంది. జయగిరి నుంచి ఎంపీటీసీ స్వతంత్ర్య అభ్యర్థిగా బీసీ గౌడకు చెందిన పల్లె వేణు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రోజా రమణికి నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రక్రియపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సాయంత్రం వరకు విధులలోనే కొనసాగారు. హసన్‌పర్తి జడ్పీటీసీ అభ్యర్థిగా ఎస్సీ మహిళకు రిజర్వేషన్ ఖరారైంది. దీంతో సాయంత్రం 4.45 గంటలకు మల్లారెడ్డిపల్లి నుంచి అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ నుంచి ఎస్సీ మాల అభ్యర్థి పుట్ట లక్ష్మీ నామినేషన్ దాఖలు చేసేందుకు రావడంతో జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.మధు నామినేషన్ తీసుకోకపోవడంతో నామినేషన్ ప్రక్రియలో ఉత్కంఠ మొదలైంది.జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జడ్పీటీసీ అభ్యర్థి పుట్ట లక్ష్మీ నుంచి నామినేషన్ పత్రాన్ని స్వీకరించారు. కాగా, వీరి నామినేషన్ ప్రక్రియపై ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించకపోవడం కొసమెరుపు.



ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పల్లె వేణు (జయగిరి)

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

వడ్డెపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 2024 మార్చి నుంచి సెప్టెంబరు 2025 వరకు రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిల సాధన కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీదర్ల ధర్మేంద్ర, ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్ కందుకూరి దేవదాసు మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రిటైర్డ్‌మెంట్ బకాయిలను 18 నెలలు గడిచినా చెల్లించకపోవడం దారుణమని అన్నారు. పెండింగ్ బకాయిలను పెన్షనర్లకు వెంటనే చెల్లించాలని, ఇప్పటికే బకాయిలు అందక పలువురు పెన్షనర్లు మానసిక ఆందోళనకు, అనారోగ్యానికి గురయ్యారని అన్నారు. రిటైర్మ్‌మెంట్ బెనిఫిట్స్ అందక పిల్లల పెళ్లిల్లు చేయలేక, ఇల్లు కట్టుకోలేక, చేసిన అప్పులు తీర్చలేక, బ్యాంకు ఈఎంఐలు చెల్లించలేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 26 మంది రిటైర్డ్ పెన్షనర్లు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సాధన కమిటీ వరంగల్ ఉమ్మడి జిల్లా జాయింట్ సెక్రటరీ ఎమ్డీ అబ్దుల్ గఫార్, గౌరవ అధ్యక్షుడు మిట్టకోల చంద్రమౌళి, మహబూబ్ అలి, మోకిరి దామోదర్, గోవర్ధన్, సంజీవరెడ్డి, లక్ష్మయ్య, సోమయ్య, విష్ణువర్ధన్, ఇంద్రసేనారెడ్డి, అశోక్‌కుమార్, సూరం కుమారస్వామి, చలం తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న ఎస్. ధర్మేంద్ర, కడారి భోగేశ్వర్, కందుకూరి దేవదాస్

థాయ్‌లాండ్ అడవుల్లో

వెంకటేశ్వరుడు!

కొన్ని వేల ఏళ్ల క్రితం హిందూ మతం భారతదేశం నుంచి ప్రస్తుత దక్షిణాసియాలోని పలు ప్రాంతాలకు విస్తరించిందనటానికి అనేక ఆధారాలున్నాయి. థాయ్‌లాండ్‌లోని ఫాంగ్ నాగా అడవుల్లో ఉన్న విష్ణుమూర్తి విగ్రహం దీనికి ఒక పెద్ద ఉదాహరణ. ఈ విగ్రహం ఆ అడవులలోకి ఎలా వచ్చిందో, దాని వెనుక ఉన్న కథ ఏమిటో ఇప్పటిదాకా ఎవరికి తెలియదు. ఈ విగ్రహం వెంకటేశ్వర స్వామిని పోలి ఉండటం ఒక విశేషం. తెలుగు రాష్ట్రాల ప్రజలు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లాంటి సంస్థలు చొరవ తీసుకొని ఈ విగ్రహాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైన ఉంది.



ఒకప్పుడు శాతవాహనులకు దక్షిణాసియాలోని అనేక దేశాలతో వాణిజ్య సంబంధాలు ఉండేవి. మచిలీపట్నం, చెన్నపట్నం లాంటి రేవుల నుంచి నౌకలు ఇతర దేశాలకు వెళ్తూ ఉండేవి, వస్తూ ఉండేవి. ఈ సమయంలోనే మన దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలను, హిందూ మతాన్ని అనేకమంది ఇతర దేశాలలో ప్రచారం చేశారు. ఈ సమయంలోనే దక్షిణ భారత దేశానికి చెందిన కొందరు బ్రాహ్మణులు ప్రస్తుత థాయ్‌లాండ్ ప్రాంతానికి తరలివెళ్లారు. అక్కడ హిందూ మతాన్ని ప్రచారం చేశారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ దక్షిణ థాయ్‌లాండ్‌లోని ఫాంగ్ నాగా ప్రాంతంలోని అడవులలో ప్రతిష్ఠించిన విష్ణుమూర్తి విగ్రహం.



బౌద్ధ సన్యాసులు పూజారులు...

ఈ విగ్రహం ఆ ప్రాంతంలో ప్రతిష్ఠించటానికి అనేక కారణాలున్నాయి. ఒకప్పుడు కంబోడియా, బర్మాలకు చెందిన వారు... థాయ్‌లాండ్‌లోని పుణ్యక్షేత్రాల మీద దాడులు చేసేవారు. అక్కడి విగ్రహాలను ఎత్తుకుపోయి తమ వద్ద ప్రతిష్ఠించుకొనేవారు. ఇలాంటి మూకల నుంచి రక్షించటానికి... ఒక చెట్టు తొర్రలో కొన్ని ప్రత్యేకమైన తాంత్రిక ప్రక్రియ ద్వారా ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ప్రాంతంలోని స్థలపురాణాల ప్రకారం- కేవలం విష్ణువుపై స్వచ్ఛమైన భక్తి ఉన్నవారు మాత్రమే ఈ విగ్రహాన్ని దర్శించగలుగుతారు. సుమారు 35 సంవత్సరాల క్రితం... బౌద్ధులు ఈ ప్రాంతంలో తమ ఆరామాన్ని నిర్మించుకోవటానికి ప్రయత్నాలు మొదలుపెట్టినప్పుడు చెట్టు తొర్రలో ఈ విగ్రహం దొరికింది. అక్కడ నివసించే ఒక వృద్ధ బౌద్ధ సన్యాసి ఈ విగ్రహం ఎలా దొరికిందో నాకు వివరించారు. "మేము ఆరామం నిర్మించుకోవటానికి అనువైన స్థలం కోసం అడవిలో వెతుకుతున్నాం. ఇంతలో ఒక పిల్లవాడు మా దగ్గరకు వచ్చాడు. ఆ చెట్టు వైపు చూపించాడు. మేమందరం అక్కడికి వెళ్తే మూడు విగ్రహాలు కనిపించాయి. ఒకటి పెద్ద విష్ణువు విగ్రహం. మరొకటి అమ్మవారి విగ్రహం. ఇంకొక విగ్రహం ఏమిటో ఇంకా తెలియదు. ఈ మూడింటిని చూసి బయటకు వచ్చేసరికి ఆ పిల్లవాడు పరిగెత్తుకుంటూ ఒక రాయివైపు వెళ్లాడు. రాయిపై కాలు వేసి అదృశ్యమయ్యాడు. ఇప్పటికీ ఆ రాయి, దానిపై కాలి గుర్తులు మనకు కనిపిస్తాయి. ఆ తర్వాత ఆ పిల్లవాడు నాకు ఎప్పుడూ కనబడలేదు.." అని ఆయన పేర్కొన్నారు. ఈ విగ్రహాలు చూడటానికి చాలా అందంగా ఉన్నాయి కాబట్టి ఆ ప్రాంతంలోనే ఆరామం నిర్మించుకోవాలనుకున్నారు. ఆ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాన్ని నివాసయోగ్యంగా మార్చుకున్నారు. ఈ ప్రాంతానికి 'నారాయణ నికరం' అని పేరుపెట్టారు. అప్పటి నుంచి ఈ విగ్రహానికి బౌద్ధ సన్యాసులు తమవైన పద్ధతుల్లో పూజలు చేస్తూ ఉంటారు.

వెంకటేశ్వరస్వామి విగ్రహమేనా?

తిరుమలలో వెంకటేశ్వర స్వామిని విష్ణుమూర్తి అవతారంగా చాలామంది కొలుస్తారు. వెంకటేశ్వరస్వామికి సంబంధించిన ప్రస్తావన మనకు వరాహ పురాణం, భవిష్య పురాణం, విష్ణు పురాణం, స్కాంద పురాణాలలో కనిపిస్తుంది. స్కాంద పురాణంలో 'వెంకటాచల మహత్మ్యం' అనే ప్రత్యేక అధ్యాయం కూడా ఉంది. ఇక చోళులు, పల్లవులు... కొన్ని వేల విష్ణు విగ్రహాలను తమదైన ప్రత్యేకమైన రీతిలో చెక్కించారు. అయితే ఈ విగ్రహానికి ఉన్న కిరీటం భిన్నంగా కనిపిస్తుంది. చేతిలో గద కనిపించదు. మిగిలిన రూపమంతా వెంకటేశ్వర స్వామి మాదిరిగానే కనిపిస్తుంది. అయితే ఈ విగ్రహం ఎక్కడ నుంచి వచ్చిందనే విషయం ఇంకా తెలియదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో దీనికి సంబంధించిన శాసనాలు ఏవైనా ఉన్నాయేమో కూడా తెలుసుకోవాలి. మన పూర్వీకులు వైష్ణవ మత ప్రచారంలో భాగంగా అనేక ప్రాంతాల్లో వెంకటేశ్వర స్వామిని పోలిన విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధురలో గుప్తుల కాలానికి చెందిన ఒక విగ్రహం, బాదామిలో చాళుక్యుల కాలానికి చెందిన విష్ణువు విగ్రహం... తిరుమలలోని విగ్రహాన్ని పోలి ఉంటాయి. వీటికి కిరీటము కుటం, శంఖం, చక్రం, కౌస్తుభం ఉంటాయి. థాయ్‌లాండ్‌లోని వాట్ ఫూ, ఫాంథమ్ రంగ్ ప్రాంతాల్లోని దేవాలయాల్లో ఉన్న విగ్రహాలు తిరుమల వెంకటేశ్వరస్వామి మాదిరిగానే కనిపిస్తాయి. చివరగా... 'నారాయణనికరం' లోని విగ్రహాలపై మరింత పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది. ఈ విగ్రహం విష్ణువుదేనని నిర్ధారించుకోవటానికి నాకు సుమారు ఐదేళ్లు పట్టింది. ప్రస్తుతం చుట్టుపక్కల ఉన్న అటవీప్రాంతాల్లో శాసనాల కోసం ప్రయత్నిస్తున్నాను. ఇవి దొరికితే మరికొంత సమాచారం లభించే అవకాశం ఉంది.

• **లిదియా లక్ష్మి**
ఆధ్యాత్మిక పరిశోధకురాలు, థాయ్‌లాండ్

రాజయోగ ఆధ్యాత్మిక మార్గాన్ని ప్రపంచవ్యాప్తంగా లక్షల మందికి బోధిస్తున్న వారిలో బ్రహ్మర్షి మోహన్‌జీ ఒకరు. మన దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ఆయనకు అనేక మంది శిష్యులు ఉన్నారు. భారతీయ ఆధ్యాత్మికత మూల సిద్ధాంతం, నవతరంలో ఆందోళన తదితర అనేక అంశాలపై ఆయన 'నివేదన'తో సంభాషించారు.



ఆధ్యాత్మికతకు మతం అవసరం లేదు!

మన భారతీయ ఆధ్యాత్మిక మూల తత్త్వం ఏమిటి?

మోక్షం. ప్రపంచంలో మరే ఏ సంస్కృతిలోను ఇది లేదు. చాలా మంది మోక్షం అంటే మనిషి చనిపోయిన తర్వాత వచ్చేది అనుకుంటారు. కానీ మనం ఈ ప్రపంచంలో ఉన్నప్పుడు వచ్చే స్వేచ్ఛే మోక్షం. ఒక వ్యక్తి పూర్తిగా అంతర్ముఖుడైనప్పుడే ఈ స్థితి వస్తుంది. ఈ స్థితిలో మన చుట్టూ ఉన్న పరిస్థితులు మనపై ప్రభావం చూపించటం మానేస్తాయి.

ఇలాంటి వ్యక్తులు ఒకప్పుడు మన భారత దేశంలో ఉండేవారు. ఇప్పటికీ ఉన్నారు.

సనాతన ధర్మాన్ని మీరు ఎలా నిర్వచిస్తారు?

ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే భావనలు అన్ని సంస్కృతులలోనూ ఉన్నాయి. కానీ సనాతన ధర్మంలోని నిష్పాక్షికత ఉంటుంది. జాగ్రత్తగా గమనిస్తే- ప్రకృతి, సూర్యుడు, గాలి, నీరు- ఇవన్నీ నిష్పాక్షికమైనవి. మనలోని ఆత్మ కూడా నిష్పాక్షికమైనదే! దానికి ఎటువంటి రాగద్వేషాలు ఉండవు. ఈ రెండింటినీ అర్థం చేసుకున్నప్పుడు సనాతన ధర్మం అర్థమవుతుంది. భారతీయ సంస్కృతిలో నదులను, పర్వతాలను, ప్రకృతిని ఆరాధిస్తారు, పూజిస్తారు, గౌరవిస్తారు. రక్షించటానికి ప్రయత్నిస్తారు. ఇతర దేశాల్లో ఇలాంటి విధానం ఉండదు. ఇదే విధంగా ప్రతి వ్యక్తికి కొన్ని ధర్మాలు నిర్దేశించారు. పితృధర్మం, పుత్ర, పుత్రి ధర్మం ఈ కోవలోకే వస్తాయి. వీటిని ఆచరిస్తే ప్రతి వ్యక్తి తన చుట్టు పక్కల ఉన్న వారిని గౌరవించగలుగుతాడు. ఇలా మనకు అంతర్ముఖంగా... బహిర్ముఖంగా ఉన్న వాటన్నింటినీ గౌరవించటమే సనాతన ధర్మం.

మనుషుల అవసరాల కోసం ఈ ధర్మం మారుతోందా? ఉదాహరణకు మన అవసరాల కోసం భూమిని, కొండలను, నదులను ఎక్కువగా వాడుకుంటున్నాం కదా...

అవగాహనారాహిత్యం వల్ల ఇలా జరుగుతోంది. ప్రస్తుతం మనం టెక్నాలజీ యుగంలో ఉన్నాం. మన స్వలాభం కోసం, అవసరాల కోసం ప్రకృతిని వాడుకుంటున్నాం. అదే సమయంలో ప్రకృతికి దూరంగా జరుగుతున్నాం. ధర్మం ఎప్పటికీ మారదు. మనిషిలో- ' ఈ ప్రకృతి నాది' అనే భావన పెరిగినప్పుడు ఈ సమస్యలు పెరుగుతాయి. ఒక మనిషి ఈ భూమి మీద 30 వేల రోజులు ఉంటాడనుకుందాం. ఆ తర్వాత ఏదీ అతనిది కాదు కదా! 'నాది', 'నాకోసం', 'నా పిల్లల కోసం' అనే అజ్ఞానం వల్ల సమస్యలు తెచ్చిపెట్టుకుంటున్నాం. పిల్లలలో పోటీతత్వాన్ని, పోల్చుకోవడాన్ని పెంచుతున్నాం. 'ఆనందం నాలోనే ఉంది'- అనే ఆలోచన ప్రతి వ్యక్తికి ఉంటుంది. దానినుంచి దూరం జరిగినప్పుడు ఈ సమస్యలు వస్తాయి. ప్రతి వ్యక్తి ఒక ద్వీపంలా మారుతున్నాడు. ఇతరులకు దగ్గరగా ఉండాలనుకోవటం లేదు. టెక్నాలజీ మనల్ని స్వతంత్రులుగా చేయటం లేదు. బానిసలుగా మారుస్తోంది.

> **జీవితంలో ఓటములు ఉండవు. కేవలం అనుభవాలే ఉంటాయి. కొన్నిసార్లు ఓటములు అనుకున్నవే మంచి అనుభవాలను నేర్పుతాయి.**

సైన్స్, ఆధ్యాత్మికతల మధ్య ఉన్న మౌలికమైన తేడాలు ఏమిటి?

ఆధ్యాత్మికత ఇతరులకు చెప్పలేని అందమైన అనుభవం. అది మన స్వభావంలో వచ్చిన మార్పుల ద్వారా బయటకు కనిపిస్తుంది. మేధ ద్వారా దానిని అర్థం చేసుకోలేం. జీవితం అంటే ఎనర్జీ అండ్ మేటర్ (శక్తి, పదార్థం)ల కలయిక. చావు అంటే ఎనర్జీ మైనస్ మేటర్. ఇక్కడ శక్తి అనేది స్థిరమైన అంశం. ఇది మనలోనే ఉంటుంది. దీన్ని అర్థం చేసుకోవటమే ఆత్మశోధన. మనలో ఉన్న శక్తితో పాటుగా బయట ఉన్న శక్తిని అనుభవించటమే దైవత్వం. ఇది అనుభవిస్తే కానీ తెలియని విషయం. ఇక సైన్స్- బయట ప్రపంచాన్ని అన్వేషించే ఒక సాధనం. ఇది మేధోపరమైనది. అనుభవించలేనిది. అందుకే ఈ రెండూ వేర్వేరు.

> **రాజయోగను చెప్పటం కష్టం. జ్ఞాన మార్గం, భక్తి మార్గం, కర్మ మార్గం- వాటి నిర్వచనాలను చెప్పగలం. రాజయోగం అంటే మన లోపల ఉన్న శక్తితో మనం అనుసంధానం కావటం. ఇది అనుభవిస్తేనే అర్థమవుతుంది.**

మతం, ఆధ్యాత్మికత- ఈ రెండింటి మధ్య విభజన రేఖను ఎలా గుర్తించాలి?

మతం ఒక విధానం. ఒక వ్యవస్థ. మనుషలను క్రమశిక్షణలో పెట్టే ఒక ప్రక్రియ. ఆధ్యాత్మికత వ్యక్తి ప్రధానం. దీనికి ఎటువంటి మతం అవసరం లేదు. మనిషి ఒంటరిగా పుడతాడు. ఒంటరిగా చనిపోతాడు. ఈ మధ్యలో జరిగే విషయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే ఆధ్యాత్మికతకు దూరంగా వెళ్లిపోతాం. ప్రపంచం నుంచి ఎంత ఎక్కువ కావాలనుకుంటే- అంత శక్తిహీనులం అవుతాం. ఒకసారి ప్రముఖ సూఫీ కవి రూమి తన గురువు దగ్గరకు వెళ్లి - "నాకు ఆధ్యాత్మికత మార్గాన్ని బోధించండి" అని అడిగాడట. అప్పుడు ఆ గురువు- "నీ పుస్తకాలన్నీ సముద్రంలో పడేసి నా దగ్గరికి రా!" అన్నాడట. ఇక మతాలన్నీ రాజకీయ ప్రేరేపితమైనవే! ఒక సమాజంలోని వ్యవస్థలు సమర్థంగా పనిచేయాలంటే మనుషులు కావాలి. వారిని ఒక క్రమశిక్షణలో పెట్టేదే మతం. దీనిలో దేవుడి పాత్ర తక్కువ. దేవుడి కోసం బయట వెతికితే బొమ్మలు, శిల్పాలు మాత్రమే కనిపిస్తాయి. మన లోపల అన్వేషిస్తే నిజమైన శక్తి అనుభవంలోకి వస్తుంది.

నిజమైన గురువు ఎవరు..

మనం ఎవరితో మమేకం కాగలుగుతామో అతనే నిజమైన గురువు. ఆయన మనకు ఒక మాధ్యమం. ఒక పిల్లవాడిని వాళ్ల నాన్న - "వెళ్లి అగ్గి తీసుకురా" అన్నాడట. ఆ పిల్లవాడు వెళ్లి దీపం తీసుకొచ్చాడు. వాళ్ల నాన్న "ఇది దీపం కదా..." అన్నాడట. అప్పుడు ఆ పిల్లవాడు వెలుగుతున్న కర్పూరాన్ని తీసుకువచ్చాడట. "ఇది కర్పూరం కదా" అన్నాడట. అగ్నిని ఒక మాధ్యమం లేకుండా ఎలా అనుభవించలేమో... దైవత్వాన్ని కూడా మాధ్యమం లేకుండా అనుభవించలేం. ఆ మాధ్యమమే గురువు. చాలామంది- 'నిజమైన గురువు' ఎవరు అని అడుగుతూ ఉంటారు. మనం మమేకం కాగలిగే వ్యక్తే నిజమైన గురువు. అది మన మనసుకు తెలుస్తుంది. చాలామంది రకరకాల మార్గాలు అన్వేషిస్తూ ఉంటారు. ఒక తలుపును తడితే అన్వేషి అవుతాడు. అనేక తలుపులు తడితే బిచ్చగాడు అవుతాడు. అన్వేషి తృప్తిగా జీవితాన్ని జీవించగలుగుతాడు. బిచ్చగాడికి ఇతరులు విదిల్చిన మెతుకులే దక్కుతాయి.

• **సీవీఎల్ఎన్ ప్రసాద్**



హైదరాబాద్‌లో జరిగిన జీసీసీ సదస్సులో కేటీఆర్, ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నందా తదితరులు

జీసీసీల రాజధానిగా హైదరాబాద్

- ప్రపంచ స్థాయి మహానగరాలకు తీసిపోని విధంగా దూసుకెళుతోంది
- ప్రస్తుతం 350 జీసీసీలు ఉన్నాయి..
- 2030నాటికి 1,600కు పెరుగుతాయి
- ప్రతిపక్షంలో ఉన్నా హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టమనే చెబుతా
- జీసీసీల సదస్సులో కేటీఆర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): 'నేను ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నా చెప్పేది ఒక్కటే.. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టండి. ఇది ఒక నగరం మాత్రమే కాదు.. వైవిధ్యాలకు కేంద్ర బిందువు. ఆర్థికంగా ప్రపంచస్థాయి మహానగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఇప్పుడు దూసుకుపోతోంద'ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హెచ్ఐసీసీ వేదికగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్-ఐసీఏఐ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్ జీసీసీలకు రాజధానిగా మారిందని, దీని వెనక గత ప్రభుత్వ కృషి ఎంతో ఉందని చెప్పారు. ప్రస్తుతం రెండో స్థానంలో ఉండగా.. త్వరలోనే మొదటి స్థానానికి వస్తుందన్నారు. బెంగళూరును దాటి మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. పదేళ్ల పాటు అన్ని రంగాల్లో, అన్ని కోణాల్లో హైదరాబాద్‌ను సమగ్రంగా తీర్చిదిద్దడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 350 వరకు జీసీసీలు ఉండగా, 2030 నాటికి 1,600కు పైగా ఏర్పాటు కావడంతో పాటు 19 లక్షల మంది నిపుణులకు ఉద్యోగావకాశాలు వస్తాయన్న ధీమా వ్యక్తం చేశారు. వ్యక్తుల ఆధారంగా కాకుండా శాశ్వతంగా మంచి ఫలితాలు వచ్చేలా వ్యవస్థలు, చట్టాలు, సంస్కరణలను తీసుకురావడం వల్ల తెలంగాణ వ్యాపార, వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అందుకే బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్‌కేర్, ఐటీ రంగాల్లో భారీగా పెట్టుబడులు, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించగలిగిందన్నారు. 15 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు వచ్చేలా టీఎస్ ఐపాస్‌ను తెచ్చామని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో అత్యంత అనుకూలమైన వాతావరణం, వనరులు, మౌలిక వసతులు ఉన్నాయన్నారు. రాజకీయాలు మారుతాయి, కానీ రాష్ట్ర పురోగతి మారాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా తెలంగాణకు భారీగా పెట్టుబడులు రావాలని ఎప్పుడూ కోరుకుంటామని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నందా, హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ చిన్న సీతారాంరెడ్డి, ఐటీ, ఐటీఈఎస్ రంగాల ప్రముఖులు, దేశంలోని వివిధ నగరాలకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ చలో బస్‌భవన్ ఉద్రిక్తం

- సిటీ బస్సుల్లో చార్జీల పెంపునకు నిరసనగా కార్యక్రమం
- ఆర్టీసీ బస్సుల్లో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు
- కాలినడకన బస్ భవన్‌కు వెళ్లి ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం అందజేత
- క్రాస్‌రోడ్స్‌కు భారీగా బీఆర్‌ఎస్ శ్రేణులు
- ధర్నా, బస్సులను అడ్డుకునే యత్నం
- పోలీసుల అదుపులో పలువురు



ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కేటీఆర్, హరీశ్

రాంనగర్, చిక్కడపల్లి, నార్సింగ్, కార్వాన్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సిటీ బస్సుల చార్జీల పెంపునకు నిరసనగా చలో బస్‌భవన్ పేరిట బీఆర్‌ఎస్ గురువారం చేపట్టిన కార్యక్రమం ఉద్రిక్తంగా సాగింది. చలో బస్‌భవన్ కోసం గురువారం ఉదయం నుంచే బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు చేరుకోగా.. ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావు సహా నగరంలో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నేతలు వేర్వేరు ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో అక్కడికి చేరుకున్నారు. కేటీఆర్ సిటీ బస్సు దిగుతుండగా పార్టీ కార్యకర్తలు సీఎంసీఎం అంటూ నినదించారు. కేటీఆర్, హరీశ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు గౌడ్, సబితారెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరలు కార్యకర్తలతో కలిసి క్రాస్‌రోడ్స్ నుంచి బస్ భవన్ వరకు కాలినడకన ర్యాలీగా వెళ్లారు. అనంతరం బస్ భవన్‌లోకి వెళ్లిన నేతలు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని కలిసి చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. మరోపక్క, బస్ భవన్ బయట బీఆర్‌ఎస్ కార్యకర్తలు ధర్నాకు దిగారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ఆ మార్గంలో వచ్చిన బస్సులను అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అలాగే, బస్‌భవన్‌లోకి ప్రవేశించేందుకు యత్నించిన బీఆర్‌ఎస్ శ్రేణులను కూడా పోలీసులు అడ్డగించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరగ్గా.. పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి తరలించారు. అంతకు ముందు హరీశ్‌రావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహ సహా పలువురు నేతలను పోలీసులు గురువారం ఉదయం కాసేపు హౌస్ అరెస్టులు చేశారు. చలో బస్‌భవన్ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐదు సార్లు బస్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని ఆరోపించారు. ప్రజారవాణా వ్యవస్థలో నష్టాలు వస్తే ప్రభుత్వాలే భరించాలి కానీ ప్రజలపై భారం వేయడమేంటని ప్రశ్నించారు. పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని, మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామంటూ ఇచ్చిన హామీని అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చలో బస్‌భవన్‌కు వచ్చే నేతల హౌస్ అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, సిటీ బస్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో బీఆర్‌ఎస్ పోరాటం ఆగదని హరీశ్ రావు పేర్కొన్నారు మహిళల ఉచిత ప్రయాణం పేరుతో ఆ భారాన్ని పురుషులపై మోపుతున్నారని తెలిపారు. టికెట్ రేట్లు, వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంపు వంటి నిర్ణయాలతో సీఎం రేవంత్ ప్రజలను దొంగ దెబ్బ కొడుతున్నారని ఆరోపించారు.

ప్రతి రోడ్డు ప్రమాద మరణంపై విశ్లేషణ

స్టేషన్ ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లాలి

- మరో ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలి: డీజీపీ శివధర్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏటా దాదాపు 900 హత్య కేసులు నమోదవుతుంటే.. అంతకు తొమ్మిది రెట్లు ఎక్కువగా 8,000 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని డీజీపీ శివధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న రోడ్డు ప్రమాద కేసుల విషయంలో పోలీసులు కొత్త మార్గం అనుసరించాలని చెప్పారు. ఆయా స్టేషన్ల ఉన్నతాధికారులు ఘటన స్థలానికి వెళ్లాలని, ఆ ప్రమాదం ఎలా జరిగింది? మరణం సంభవించడానికి కారణాలేమిటి? ఎలాంటి చర్యల ద్వారా మరో ప్రాణం పోకుండా చూడవచ్చనే విశ్లేషణ చేపట్టాలని సూచించారు. నైట్ పెట్రోలింగ్, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, అవగాహనా కార్యక్రమాల నిర్వహణ, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంలో ప్రతి పోలీసు అధికారి నిజాయితీగా కృషి చేయాలని కోరారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గురువారం వివిధ జిల్లాల ఎస్పీలు, రేంజ్ డీఐజీలు, ఐజీలు, కమిషనర్లు, సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించి, పోలీసులకు కీలక సూచనలు చేశారు. న్యాయమైన, దృఢమైన, స్నేహపూర్వక, వృత్తిపరమైన పోలీసింగ్‌ను అనుసరించాలని పేర్కొన్నారు. 'ప్రతి పౌరుడిని సమానంగా చూసి న్యాయాన్ని పరిరక్షించడం న్యాయపరమైన పోలీసింగ్. భయం, పక్షపాతం లేకుండా చట్టాన్ని అమలు చేసి శాంతిభద్రతలను కాపాడడం దృఢమైన పోలీసింగ్. పౌరుల్లో నమ్మకం, సానుభూతి సంపాదించుకోవడం స్నేహపూర్వక పోలీసింగ్. సమర్థత, జవాబుదారీతనంతో ఉండడం వృత్తిపరమైన పోలీసింగ్' అని డీజీపీ వివరించారు. ఈ నాలుగు సూత్రాలు ఆధునిక పోలీసింగ్ ఆత్మను నిర్వచిస్తాయని, నిజాయితీగా, సమర్థవంతంగా పనిచేయాలని, మానవత్వంతో, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని పోలీసులకు సూచించారు. పోలీసింగ్‌లో తెలంగాణ పోలీసులు దేశంలో మొదటి స్థానంలో ఉన్నారని, మరింత జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. వివిధ నేరాల్లో పక్కాగా చార్జిషీట్లు దాఖలు చేసి నేరస్థులకు శిక్షలు వేయించడం ద్వారా ప్రజలకు పోలీసులంటే భరోసా ఉంటుందన్నారు.

ఉనికి కోసమే బీఆర్‌ఎస్ నేతల నాటకం

'చలో బస్‌భవన్'పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చలో బస్‌భవన్ అంటూ బీఆర్‌ఎస్ నేతలు చేసిన హడావుడి హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. పదేళ్ల పాలనలో బంద్‌లు, ధర్నాలు, నిరసనలపై ఉక్కుపాదం మోపి ఆర్టీసీని సర్వనాశనం చేసిన బీఆర్‌ఎస్‌కు చలోబస్‌భవన్ అనే హక్కు లేదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో ఉనికి కోసమే బీఆర్‌ఎస్ నాయకులు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు సీఎం హోదాలో కేసీఆర్ అనేక ప్రయత్నాలు చేశారని దయాకర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో మూడు సార్లు ఆర్టీసీ చార్జీలను భారీ ఎత్తున పెంచిన విషయాన్ని బీఆర్‌ఎస్ నేతలు మరిచిపోయారా ? అని ప్రశ్నించారు. ఆర్టీసీ ఆస్తులు కాజేసి, సంస్థను అమ్మే ప్రయత్నం చేసి, నాడు సమ్మె చేసిన కార్మికుల ప్రాణాలను బలిగొన్న బీఆర్‌ఎస్ నేతలు ఏముఖం పెట్టుకుని చలోబస్‌భవన్ అంటున్నారని నిలదీశారు. బీఆర్‌ఎస్ నేత జీవన్‌రెడ్డి ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకొని రూ.7.50 కోట్లను ఎగవేశార ని అద్దంకి దయాకర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వికసిత్ భారత్ సరే ముందు
ఆరోగ్య భారత్‌గా ఎదగాలి

- మైనే క్యాన్సర్ కో జీత్ లియా పుస్తకావిష్కరణలో కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):మన దేశం వికసిత్ భారత్‌కన్నా ముందూ ఆరోగ్య భారత్‌గా ఎదగాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు కేంద్రం నిరంతర కార్యాచరణ చేపడుతోందన్నారు. ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ పాల్వాయి విజయ్ ఆనంద్‌రెడ్డి రచించిన 'ఐ యామ్ ఎ క్యాన్సర్ సర్వైవర్' హిందీ అనువాదం 'మైనే క్యాన్సర్ కో జీత్ లియా' పుస్తకాన్ని గురువారం కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో క్యాన్సర్‌ను జయించిన 108 మంది విజయగాథలను, వారి అనుభవాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ పట్ల ప్రజల్లో గల భయాందోళనలు, అపోహల తొలగింపునకు 30 ఏళ్లుగా వైద్యవృత్తిలో కొనసాగుతున్న డాక్టర్ పాల్వాయి విజయ్ ఆనంద్ రెడ్డి విశేష కృషి చేశారని కిషన్‌రెడ్డి అన్నారు. ఈ పుస్తకం క్యాన్సర్ బాధితులు ఆత్మస్థైర్యంతో దాన్ని జయించడంతోపాటు సాధారణ జీవితం గడపొచ్చనే మనో ధైర్యాన్నందిస్తుందన్నారు. ప్రపంచంలో 2022లో 2 కోట్ల క్యాన్సర్ కేసులు నమోదైతే 97 లక్షల మంది మృత్యువాత పడ్డారని తెలిపారు. మన దేశంలో 14 లక్షలకు పైగా క్యాన్సర్ కేసులు నమోదయ్యాయన్న కిషన్ రెడ్డి.. ఏటేటా క్యాన్సర్ కేసులు పెరుగుతుండటంతో దానిపట్ల అవగాహన, చికిత్స, మెరుగైన సదుపాయాల కల్పన చాలా ముఖ్యమన్నారు. 2025-26లో దేశవ్యాప్తంగా 200 సెంటర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణ తర్వాత వైద్యులు కౌన్సిలింగ్ ఇస్తున్నా బాధితుల్లో భయం పోవట్లేదన్నారు.

వక్ఫ్ ఆస్తుల నమోదు గడువు పెంపుపై విచారణకు సుప్రీంకోర్టు సమ్మతి

వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువును పెంచాలని కోరుతూ ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ప్రభుత్వ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువును పొడిగించాలని కోరుతూ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పరిశీలించింది. వక్ఫ్ ఆస్తుల నమోదుకు ఇచ్చిన ఆరు నెలల గడువులో అయిదు నెలల సమయం వక్ఫ్ సవరణ చట్టంపై కోర్టు మధ్యంతర తీర్పు కోసం ఎదురుచూడడంలోనే గడిచిపోయిందని ఒవైసీ తరఫు న్యాయవాది నిజాం పాషా తెలిపారు. దాంతో ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నామని జస్టిస్ గవాయ్ చెప్పారు.

'గ్రూప్ 1'పై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ

గ్రూప్-1 పరీక్షలపై తెలంగాణ రాష్ట్రప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఉపశమనం లభించింది. ఈ పరీక్షలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. గ్రూప్ -1 నియమాకాలపై తెలంగాణ హైకోర్టు తీర్పును వేముల అనూష్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీల ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వు ఇచ్చినందున, ఈ దశలో జోక్యం చేసుకోలేమని బెంచ్ స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా నియామకాలు జరగాలని పేర్కొంది. ఈ నెల 15న హైకోర్టు డివిజన్ బెంచ్‌లో మళ్లీ విచారణ జరగనున్న నేపథ్యంలో ఈ దశలో జోక్యం చేసుకోలేమని తెలిపింది.

సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం ఆర్టీఐ: గవర్నర్

రవీంద్రభారతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిదని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమైన ఈ చట్టం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. రవీంద్రభారతిలో జరిగిన సమాచార హక్కు చట్టం వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విజేతలను సత్కరించి అభినందించారు. 2005లో అమల్లోకి వచ్చిన ఈ చట్టం పాలకులు.. సామాన్యుడికి జవాబుదారీగా ఉండేలా చేసిందన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్యామ్ కోషి మాట్లాడుతూ ఆర్టీఐపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏటా 8వేల పిటిషన్లు వస్తున్నాయని, వాటిని వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మక్కల కొనుగోళ్లు

» 8.66 లక్షల టన్నుల మక్కల సేకరణకు ప్రణాళిక: తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో మొక్కజొన్నల ధరలు పడిపోయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మక్కలు సేకరిస్తామని చెప్పారు. గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. మక్కల ధరలు, కొనుగోళ్లపై చర్చించారు. సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో రాష్ట్ర ప్రభుత్వం మక్కలు కొనుగోలు చేయనున్నట్లు మంత్రి తుమ్మల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగైందని, సాగు పరిస్థితులు మెరుగవటంతో సగటున ఎకరానికి 18.50 క్వింటాళ్ల దిగుబడితో మొత్తం 11.56 లక్షల మెట్రిక్ టన్నుల పంట రానుందని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ ధరలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎమ్మెస్పీ రూ.2,400 కంటే తక్కువగా ఉన్నాయన్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు సగటున రూ.1,959 చొప్పున కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.441 చొప్పున నష్టపోతున్నారని తెలిపారు. ఈ సీజన్‌లో మక్కల కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,400 కోట్ల నిధులు సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.

సౌరవిద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం: భట్టి

రాష్ట్రంలో సౌర విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సచివాలయంలో ఆయనను జర్మనీ ప్రతినిధులు కలుసుకున్నారు. సౌర విద్యుత్ వినియోగానికి తెలంగాణ ఇస్తున్న ప్రాధాన్యాన్ని గుర్తించిన జర్మనీ ప్రతినిధులు.. ఆ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి వీలుగా ప్రతిపాదనలు అందించారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ.. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, వీరిని సౌరవిద్యుత్ రంగంలో భాగస్వాములు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. జర్మనీ ప్రతినిధుల ప్రతిపాదనలు ఏ విధంగా తెలంగాణకు మేలు చేస్తాయో అధ్యయనం చేసి, నివేదిక అందించాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

కొత్తగా మరో 100 ఎంబీబీఎస్ సీట్లు

» నోవా, మహావీర్ కాలేజీలకు చెరో 50 సీట్లు..

రాష్ట్రంలో మరో వంద ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. నోవా మెడికల్ కాలేజీకి 50 ఎంబీబీఎస్ సీట్లు, మహావీర్ మెడికల్ కాలేజీకి 50 సీట్ల చొప్పున పెంచుకోవడానికి జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చింది. నోవా కాలేజీలో ప్రస్తుతమున్న 150 సీట్లు 200కు.. మహావీర్ మెడికల్ కాలేజీలో ఉన్న 150 సీట్లు 200కు పెరగనున్నాయి.

అన్ని యూజీ కోర్సుల్లో పాఠ్యాంశంగా ఆర్టీఐ

» ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం గురించి ప్రతి విద్యార్థికీ తెలియాలన్న లక్ష్యంతో ఇప్పటివరకు ఎల్ఎల్‌బీ డిగ్రీలో మాత్రమే ఉన్న ఆర్టీఐ పాఠ్యాంశాలను వచ్చే ఏడాది నుంచి ఇంజనీరింగ్, ఫార్మసీతోపాటు అన్ని యూజీ కోర్సుల్లో ప్రవేశపెట్టనున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి ప్రకటించారు. ఆర్టీఐ చట్టంపై అవగాహన కలిగిన విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గురువారం కీసరలోని హోలీమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన సదస్సులో బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత భారత దేశంలో రూపొందించిన చట్టాల్లో సమాచార హక్కు చట్టం అత్యంత శక్తివంతమైందన్నారు.

పదిహేనేళ్ల... పరుగు!

» సీఎంగా చంద్రబాబు అరుదైన రికార్డు
» ప్రజా జీవితంలో 15 ఏళ్లు సీఎంగానే
» దక్షిణాదిలో కరుణానిధి, రంగస్వామికే ఈ ఘనత
» నేటితో ఆ మైలురాయి దాటుతున్న బాబు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎలాంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేదు! తిరుపతికి కాస్తంత దూరంలో సరైన రోడ్డు కూడా లేని ఓ కుగ్రామంలో నడక మొదలు పెట్టారు. విద్యార్థి నేతగా ప్రస్థానం ప్రారంభించారు. ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనే... చంద్రబాబు నాయుడు! తన ప్రజా రాజకీయ జీవితంలో ఆయన మరో మైలురాయి దాటనున్నారు. శుక్రవారంతో (అక్టోబరు 10) ముఖ్యమంత్రి పదవిలో ఆయన 15 ఏళ్ల కాలాన్ని పూర్తి చేసుకోనున్నారు. దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా చేసిన వారి జాబితా పెద్దదే ఉంటుంది. కానీ, దక్షిణ భారతంలో అలాంటి ఘనత కొందరికే దక్కింది. కరుణానిధి 18 ఏళ్ల 362 రోజులపాటు సీఎంగా పదవిలో ఉన్నారు. పుదుచ్చేరి సీఎంగా ఎన్.రంగస్వామి 16 ఏళ్లకుపైగా ఆ పదవిలో ఉన్నారు. వారిద్దరి తర్వాత ఇప్పుడు దక్షిణాదిలో చంద్రబాబు మాత్రమే '15 ఏళ్ల రికార్డు'ను అధిగమించారు. ఎంజీ రామచంద్రన్, ఈకే నయనార్, జయలలిత, రామకృష్ణ హెగ్డే వంటి నాయకులు కూడా తమ జీవిత కాలంలో 15 ఏళ్లపాటు సీఎంగా కొనసాగలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పని చేసిన రికార్డు కూడా చంద్రబాబు ఖాతాలోనే ఉంది. ఆయన ఉమ్మడి ఏపీకి 8 సంవత్సరాలా 255 రోజులు సీఎంగా చేశారు. నవ్యాంధ్ర సీఎంగా ఆయన పదవీకాలం నేటికి ఆరేళ్లా 110 రోజులు! వెరసి.. ఇప్పటికి ఆయన తన జీవితకాలంలో 15 ఏళ్లపాటు సీఎంగా ఉన్న అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు.



సీఎంగా చంద్రబాబు పదవీకాలం	
తొలిసారి:	1995 సెప్టెంబరు 1 నుంచి 1999 అక్టోబరు 11
రెండోసారి:	1999 అక్టోబరు 11 నుంచి 2004 మే 13
మూడోసారి:	2014 జూన్ 4 నుంచి 2019 మే 29
నాలుగో సారి:	2024 జూన్ 12 నుంచి....

ఖండాలు దాటిన కల్తీ కథ!

ఆఫ్రికాలో జగన్ సోదరుల మద్యం దందా.. కామెరూన్‌లో ఏపీ మార్కు జే బ్రాండ్లు

» ఇష్టారాజ్యంగా కల్తీ ఆల్కహాల్ ఉత్పత్తి
» రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరిట వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్‌రెడ్డి తయారీ
» ఆ మద్యం తాగి అనేకమంది మృతి
» ఉత్పత్తి ఆపాలంటూ ఆ దేశ ప్రజల ఉద్యమం
» డిస్టిలరీ మూసేసిన కామెరూన్ ప్రభుత్వం
» ఆఫ్రికా ఖండమంతా విస్తరించిన రెడ్డీస్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వైఎస్ సునీల్‌రెడ్డి, వైఎస్ అనిల్‌రెడ్డి వరసకు సోదరులు. మద్యం స్కాంలో అనుమానితులు. రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ కంపెనీ పెట్టి ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో మద్యం వ్యాపారం చేస్తున్నారు. ప్రమాణాలు పాటించకుండా కల్తీ మద్యం తయారు చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆ కంపెనీపై అక్కడి మీడియాలో పెద్దఎత్తున కథనాలు వచ్చాయి. దానిపై ప్రజలు ఉద్యమం కూడా చేపట్టారు. ఆఫ్రికాలో జగన్ సోదరులు చేసిన ఈ మద్యం దందా గురించి ఇన్నాళ్లూ ఇక్కడ పెద్దగా తెలియదు. తాజాగా ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్‌రెడ్డి 2013లో ఆఫ్రికాలోని కామెరూన్‌లో రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరుతో మద్యం వ్యాపారం ప్రారంభించారు. తర్వాత టాంజానియా, ఐవరీకోస్ట్, ఘనా, జాంబియా, మొజాంబిక్ దేశాల్లో మద్యం, మైనింగ్ ఇతరత్రా వ్యాపారాలు ప్రారంభించారు. పేద ప్రజలకు తక్కువ ధరకే మద్యం అమ్ముతున్నామని ప్రజాసేవలా కలరింగ్ ఇస్తూ మద్యం సామ్రాజ్యాన్ని విస్తరించారు. రాయల్ విస్కీ, రాయల్ జిన్, రాయల్ రమ్, జెడ్ జిన్ బ్రాండ్లను విక్రయిస్తున్నారు. ప్రమాణాలు పాటించి సీసాల తరహాలో మద్యం ఉత్పత్తి చేస్తే నిరాటంకంగా వ్యాపారం సాగేదే. కానీ అధిక ఆదాయార్జన లక్ష్యంగా షాంపూ ప్యాకెట్ల(సాచెట్) తరహాలో మద్యం అమ్మడం ప్రారంభించారు. మద్యం ఉత్పత్తి ప్రారంభించిన ఏడాది కాలంలోనే సాచెట్ ప్యాకెట్ల మద్యం తాగి ఆ దేశ ప్రజలు అనేక మంది చనిపోయారు. అయితే ఫలానా కంపెనీ అని పేరు ప్రస్తావించకుండా అన్ని కంపెనీల సాచెట్ తరహా మద్యం ఉత్పత్తిని ఆ దేశ ప్రభుత్వం నిషేధించింది. అయినా ఆదాయమే లక్ష్యంగా రెడ్డీస్ గ్లోబల్ కంపెనీ మద్యం ఉత్పత్తిని కొనసాగించింది. 2020 తర్వాత ఈ తరహా కల్తీ మద్యం వద్దంటూ ఆ దేశ ప్రజలు రోడ్డెక్కారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా జోక్యం చేసుకుని కల్తీ మద్యం నివారణకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే కొందరు కామెరూన్‌యువకులు మద్యం పోటీ పెట్టుకున్నారు. సాచెట్ల మద్యం తాగి ఇద్దరు యువకులు చనిపోయారు. ఆ మద్యం తాగిన వారందరి ఆరోగ్యం దెబ్బతింది. ఈ ఘటనతో ప్రజలు పెద్దఎత్తున ఉద్యమానికి దిగారు. దీనితో ఆ దేశ ప్రభుత్వం రెడ్డీస్ గ్లోబల్ కంపెనీలో తనిఖీలు చేపట్టింది. ఆ దేశ గనులు, పరిశ్రమలు, సాంకేతిక అభివృద్ధి మంత్రి ఫుహ్ కాలిస్టస్ జెంట్రీ స్వయంగా కంపెనీని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం ఉత్పత్తి చేస్తున్నారని గుర్తించి వెంటనే డిస్టిలరీని మూసివేశారు. రెడ్డీస్ కంపెనీలో కల్తీ ఆల్కహాల్ తయారు చేస్తున్నారని, నిబంధనలు పాటించాలని సూచించినా పాటించకపోవడంతో మూసివేతకు నిర్ణయించామని మంత్రి ఫుహ్ కాలిస్టస్ జెంట్రీ స్పష్టం చేశారు కూడా. కానీ రెడ్డీస్ కంపెనీ మరోలా ప్రచారం చేసుకుంది. అది కార్పొరేట్ కంపెనీల కుట్రని, పేదలకు తక్కువ ధరకు మద్యం దొరక్కుండా చేస్తున్నాయని ఆరోపించింది. తాము ప్రజలకు సేవ చేస్తున్నట్లుగా కలరింగ్ ఇచ్చింది.

ఇక్కడ నకిలీపై గగ్గోలు

కమీషన్ల కోసం పాపులర్ బ్రాండ్లను రాష్ట్రం నుంచి తరిమేసి తక్కువ ఖర్చుతో నాసిరకం మద్యం ఉత్పత్తి చేసిన ఘనత గత జగన్ ప్రభుత్వానిదే. గత ప్రభుత్వంలో విషపూరిత మద్యం తాగి ఎంతో మంది చనిపోయారు. జే బ్రాండ్లలో ప్రమాదకర విషపూరిత రసాయనాలు ఉన్నాయని లేబొరేటరీలు కూడా నిర్ధారించాయి. అయితే ఆ నివేదికలను గత ప్రభుత్వం అధికార బలంతో తొక్కిపెట్టింది. వైసీపీ ప్రభుత్వంలో తయారు చేసిన మద్యంపై వచ్చినన్ని ఆరోపణలు గతంలో ఎప్పుడూ రాలేదు. కమీషన్ల రూపంలో వేల కోట్లు దోపిడీ చేశారు. నకిలీ మద్యం తయారీకి కూడా గత ప్రభుత్వంలోనే నాంది పడింది. అయితే ఇవన్నీ మరిచిపోయి కూటమి ప్రభుత్వంపై వైసీపీ రాద్ధాంతం చేస్తోంది. కూటమి ప్రభుత్వం వల్లే నకిలీ మద్యం బాగోతం జరిగిందంటూ గగ్గోలు పెడుతోంది. వాస్తవానికి ఈ ప్రభుత్వం నకిలీ మద్యం దొరికిన వెంటనే అప్రమత్తమైంది. ములకలచెరువులో నకిలీ మద్యం పట్టుబడగా దాని ఆనవాళ్లు ఎక్కడున్నాయో అన్ని చోట్లా తనిఖీలు చేసి నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకుంది.

వైసీపీ నేత చెవిరెడ్డి పేరిట రూ. 18 కోట్లు వసూళ్లు

» కంటైనర్ల వ్యాపారం అంటూ హైదరాబాద్‌లో ఓ మహిళ మాయ
» డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగిన మహిళలపై ఎదురుదాడి
» బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి

పటాన్‌చెరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ఏపీలోని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చెప్పి గృహిణుల నుంచి ఓ మహిళ రూ.18 కోట్ల మేర వసూళ్లు చేసిన ఘటన హైదరాబాద్‌లో గురువారం వెలుగు చూసింది. కంటైనర్ల వ్యాపారం పేరిట వసూళ్లకు పాల్పడిన సదరు మహిళ.. తమ డబ్బు తిరిగి ఇవ్వమని నిలదీసిన మహిళలపై ఎదురుదాడికి పాల్పడడంతో విషయం బయటికొచ్చింది. ఇందుకు సంబంధించి పటాన్‌చెరు పోలీసుస్టేషన్ సీఐ వినాయక రెడ్డి, బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఆరు నెలల క్రితం వరకు సికింద్రాబాద్ సీతాఫల్‌మండి ప్రాంతంలో నివాసమున్న విద్య అనే మహిళ రెండేళ్ల క్రితం ఈ వసూళ్లకు పాల్పడింది. వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చెప్పి కంటైనర్ల వ్యాపారం చేస్తున్నామని, తమ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అంతకు రెట్టింపు డబ్బులు వస్తాయని గృహిణులకు నమ్మబలికింది. నాడు ఏపీలో వైసీపీ అధికారంలో ఉండడం, చెవిరెడ్డి పేరు చెప్పడంతో ఆమెను నమ్మిన మహిళలు రూ.లక్షల్లో డబ్బు ఆమెకు ఇచ్చారు. కొందరు మహిళలు తమ ఇంట్లోని బంగారం అంతా ఆమెకు ఇచ్చారు. సికింద్రాబాద్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, దిల్‌షుక్‌నగర్ ప్రాంతాలకు చెందిన మహిళలకు ఆమెకు డబ్బు ఇవ్వగా.. విద్య రెండేళ్ల క్రితం రూ.18 కోట్ల మేర వసూలు చేసింది. కానీ తీసుకున్న డబ్బుకు సంబంధించి ఎవ్వరికీ ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు. తమ డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడం, డబ్బు ఏమైందో తెలియకపోవడంతో సదరు మహిళలంతా కొంతకాలం తర్వాత సీతాఫల్‌మండిలోని విద్య ఇంటికి వెళ్లి అడగటం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వీపీ నుంచి తనకు రూ.2000 కోట్లు రాబోతున్నాయని, అవి చేతికి అందగానే డబ్బు చెల్లిస్తానని విద్య వారికి చెప్పేది. ఆ మాటలను నమ్మిన మహిళలు మరికొంత కాలం ఆగారు. ఈ లోగా విద్య సీతాఫల్‌మండీలోని ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయింది. అయితే, ఆరు నెలల క్రితం పటాన్‌చెరు ఏపీఆర్ గ్రాండియా కాలనీలోని 74 నంబరు విల్లాకు మకాం మార్చిన విద్య.. డబ్బు కోసం తనకు ఫోన్లు చేసిన కొందరు మహిళలను గురువారం మధ్యాహ్నం తన ఇంటికి రావాలని పిలిచింది. దీంతో బాధిత మహిళలు కొందరు ఆమె ఇంటికి వెళ్లగా.. విద్యతో మాటామాటా పెరిగి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో విద్య భర్త దిద్ది రాజశేఖర్, అతని సోదరులు రంజిత్, శివ, నిఖిల్, విద్య కుమారుడు అభి, పనిమనిషి స్వప్న కలిసి బాధితులపై కట్టెలు, సుత్తి, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో కళమ్మ అనే మహిళ తలకు బలమైన గాయమైంది. అనంతరం బాధిత మహిళలు తమకు జరిగిన మోసంపై పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు



స్థానిక నీలాంగరైలో వున్న 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్ నివాసానికి వచ్చిన బాంబు బెదిరింపు కలకలం రేపింది. గురువారం ఉదయం పోలీసు కంట్రోల్ రూమ్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి.. విజయ్ ఇంట్లో బాంబులు పెట్టాం, అవి కొద్ది సేపట్లో పేలుతాయని బెదిరించాడు. దీంతో హుటాహుటీన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు, జాగిలాలతో కలిసి విజయ్ ఇంటికి పరుగులు పెట్టారు. అక్కడ క్షుణ్ణంగా తనిఖీ చేశాక, ఎలాంటి బాంబు లేదని నిర్ధారించారు. అది కేవలం బెదిరింపేనని తేల్చారు. బాంబు బెదిరింపునకు పాల్పడిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

-చెన్నై, (ఆంధ్రజ్యోతి)

పాత్రను ఆస్వాదిస్తూ నటించాను

- శ్రీనిధి శెట్టి



'నాకు రొమాంటిక్ స్టోరీస్ చేయడం ఇష్టం. అందుకే 'తెలుసు కదా' కథ వినగానే హీరోయిన్‌గా చేసేందుకు అంగీకరించాను. ఇది నా కెరీర్‌లో తొలి పూర్తిస్థాయి ప్రేమకథా చిత్రం. అందుకే పాత్రను ఆస్వాదిస్తూ నటించాను' అని శ్రీనిధి శెట్టి చెప్పారు. సిద్ధు జొన్నలగడ్డకు జోడీగా ఆమె నటించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా మరో కథానాయిక. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోనను దర్శకురాలిగా పరిచయం చేస్తూ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీనిధి శెట్టి మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

● ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది. ఈ తరహా కథలతో గతంలో చాలా సినిమాలు వచ్చాయి. కానీ ఇందులో ఓ కొత్త కోణాన్ని స్పృశించాం. అది ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది. తెరపై అందమైన ప్రణయ భావనల్ని ఆవిష్కరిస్తుంది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. ప్రేక్షకులు మంచి రొమాంటిక్ డ్రామాని ఫీల్ అవుతారు.

● నీరజ గారు చాలా ఫ్యాషన్‌తో సినిమా చేశారు. ఆమె విజన్ కచ్చితంగా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్. కథలో బిగి చివరి వరకూ కొనసాగేలా అందమైన సన్నివేశాలను అల్లుకోవడంలో ఆమె విజయం సాధించారు.

● సిద్ధూకి అన్ని విభాగాలపై పట్టు ఉంది. తన టైమింగ్ అద్భుతం. రాశీ ఖన్నా చాలా క్రమశిక్షణ గల నటి. తన డైట్, వర్కౌట్ అన్నీ పద్ధతిగా ఉంటాయి. పీపుల్ మీడియా ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. వెంకటేశ్, త్రివిక్రమ్ గారి సినిమాలో హీరోయిన్‌గా నా పేరు వినిపిస్తోంది. ఆ అవకాశం నాకే దక్కాలని కోరుకుంటున్నాను.

ప్రతి ఒక్కరినీ హాయిగా నవ్విస్తుంది

- నిహారిక ఎన్.ఎం



"మిత్రమండలి' చిత్రంలో నా పాత్ర లలితంగా ఉంటుంది. ఈ సినిమాలో కథ, కథనం చాలా కొత్తగా ఉండడంతో పాటు థియేటర్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ హాయిగా నవ్విస్తుంది' అని నిహారిక ఎన్. ఎం అన్నారు. ప్రియదర్శికి జోడీగా ఆమె నటించిన చిత్రమిది. విజయేందర్ దర్శకుడు. బీవీ వర్క్స్ పతాకంపై బన్నీ వాస్ సమర్పిస్తున్నారు. కల్యాణ్ మంథిన, భాను ప్రతాప్, డా. విజయేందర్‌రెడ్డి తీగల నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 16న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిహారిక ఎన్.ఎం మీడియాతో ముచ్చటించారు.

● ఈతరం యువతీ యువకుల ప్రేమకథ నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది. ఒక స్నేహబృందం జీవితంలో జరిగిన సంఘటలను వినోదాత్మకంగా చూపించాము. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే అంశాలతో దర్శకుడు చిత్రాన్ని తీర్చిదిద్దారు.

● ఇన్‌ఫ్లూయన్సర్‌గా నటన నాకు కొత్త కాదు. కానీ సినిమాల్లో నటించడం మాత్రం చాలా కొత్త అనుభూతిని, ఆనందాన్నిచ్చింది. ఇందులో నా పాత్ర చిత్రణ నవ్యపంథాలో సాగుతుంది. ప్రియదర్శి చాలా అద్భుతమైన నటుడు, మంచి వ్యక్తి. మా దర్శకనిర్మాతలు నన్ను తమ కుటుంబ సభ్యురాలిలా చూసుకున్నారు. నాకు ఎక్కువగా కామెడీ చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయి. వైవిధ్యమైన పాత్రలు పోషించి నటిగా మంచి పేరు తెచ్చుకోవాలనేది నా కోరిక.

నేను గర్వించే సినిమా

- సాయికుమార్



"అరిషడ్వర్గాల నేపథ్యంలో 'అరి' అనే సినిమా చేస్తున్నాం' అని మా దర్శకుడు జయశంకర్ చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఆరు పాత్రలతో జయశంకర్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. 'అరి' లాంటి గొప్ప చిత్రం చేసినందుకు నటుడిగా గర్వపడుతున్నాను' అని సాయికుమార్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రధారిగా శ్రీనివాస్ రామిరెడ్డి, శేషురెడ్డి మారంరెడ్డి తదితరులు నిర్మించిన చిత్రమిది. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు జయశంకర్ మాట్లాడుతూ 'మంచి సందేశంతో పాటు వినోదం మేళవించి తీసిన చిత్రమిది. సినిమాలోని పాత్రలతో ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. మనం ఆధునికంగా ఎంత ఎదిగినా మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని మరచిపోకూడదనే అంశాన్ని ఈ తరానికి తెలియజెప్పాలనేదే మా ప్రయత్నం' అని తెలిపారు. నిర్మాత శ్రీనివాస్ రామిరెడ్డి మాట్లాడుతూ 'మనలోనే అరిషడ్వర్గాలు అనే శత్రువులు ఉంటాయి. వాటిని జయించినప్పుడే మనిషికి ప్రశాంతత లభిస్తుంది. మనిషి ఎలా జీవించాలి, ఎలా జీవించకూడదు అనే పాయింట్‌తో దర్శకుడు 'అరి' చిత్రాన్ని తీర్చిదిద్దారు' అని చెప్పారు.

220 కిలోల ఎపిడ్రిన్ స్వాధీనం

» హైదరాబాద్‌లో నలుగురి అరెస్టు

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రమాదకరమైన ఎపిడ్రిన్ మత్తుమందు తయారీ ముఠా గుట్టురట్టయింది. ఈ ముఠాకు చెందిన నలుగురిని హైదరాబాద్ ఈగల్ బృందాలు జీడిమెట్లలో అరెస్టు చేశాయి. వీరి వద్ద నుంచి 220 కిలోల ఎపిడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దేశీయ మార్కెట్‌లో దీని విలువ రూ.10 కోట్లు, అంతర్జాతీయ మార్కెట్లో రూ.70 కోట్లు ఉంటుందని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఈగల్ డైరెక్టర్ వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన వత్సవాయి శివరామ కృష్ణ పరమావర్మ గతంలో కొన్నాళ్లు సిరిస్ తదితర కెమికల్ కంపెనీల్లో పనిచేశారు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయగా అందులో నష్టాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గతంలో రెండు సార్లు అల్ప్రాజోలం తదితర మత్తుమందులు అమ్ముతూ పట్టుబడ్డాడు. నాలుగేళ్ల క్రితం వర్మ కాకినాడకు వెళ్లి ఆక్వా వ్యాపారం ప్రారంభించారు. కాకినాడకే చెందిన అనిల్ సైతం చాలా ఏళ్లుగా వివిధ రసాయన పరిశ్రమల్లో పనిచేస్తున్నాడు. వర్మ, అనిల్ పాత మిత్రులు కావడంతో గత ఏడాది వీరిద్దరు కలిసి మత్తుమందుల తయారీని ప్రారంభానికి పథకం రచించారు. తాను పనిచేస్తున్న పీఎస్ఎం లైఫ్ సైన్సెస్ సంస్థలో డ్రగ్స్ తయారీకి కావాల్సిన అన్ని వసతులున్నాయని, దీని యజమానులైన వెంకటకృష్ణ, ప్రసాద్‌లతో మాట్లాడుదామని అనిల్ చెప్పడంతో అందరూ ఓ హోటల్‌లో కలిశారు. మంచి కమీషన్ ఇస్తామని వర్మ చెప్పడంతో వెంకటకృష్ణ, ప్రసాద్‌లు అంగీకరించారు. దూలపల్లిలోని పీఎస్ఎం లైఫ్ సైన్సెస్‌లో ఎపిడ్రిన్ తయారీకి వీరి మధ్య ఒప్పందం కుదిరింది. వర్మ ఇచ్చిన ఫార్ములా ప్రకారం అనిల్ 220 కిలోల ఎపిడ్రిన్ సిద్ధం చేశాడు. దీని అమ్మకానికి వర్మ తన ఇంట్లో పలువురితో ఇటీవల సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా.. గతంలో మత్తుమందుల కేసుల్లో పట్టుబడి బెయిల్‌పై బయటకు వచ్చిన వారి కదలికలను ఈగల్ బృందాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ క్రమంలో వర్మ కదలికలపై అనుమానంతో అతడిని ఈగల్ బృందాలు వెంటాడాయి. గురువారం జీడిమెట్లలోని వర్మ ఇంట్లో సమావేశమైన ముఠా సభ్యులను అరెస్టు చేశాయి. ఈ కేసులో వర్మ, అనిల్, వెంకట కృష్ణ, ప్రొడక్షన్ వర్కర్ దొరబాబును అరెస్టు చేశామని, ప్రసాద్ పరారీలో ఉన్నట్టు సందీప్ శాండిల్య తెలిపారు.

చనిపోతూ.. ఆరుగురికి ప్రాణదానం!

» రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్ డెడ్

» అవయవదానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు


యుగంధర్ (ఫైల్)

రఘునాథపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాను కన్నుమూస్తూ మరో ఆరుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాడో యువకుడు.. దసరాకు ఇంటికొచ్చి హైదరాబాద్ వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైన అతడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో పుట్టెడు బాధలోనూ ఒక్కగానొక్క కుమారుడి అవయవాల దానానికి తల్లిదండ్రులు ముందుకొచ్చారు.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మండేలగూడేనికి చెందిన గాదె మురళీధర్-శోభ దంపతుల కుమారుడు యుగంధర్ (29) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. దసరాకు స్వగ్రామానికి వచ్చిన అతడు.. ఈనెల 5న ఆదివారం సాయంత్రం తన మేనబావ చందుతో బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. రామంతపూర్ సమీపంలో బైక్ అదుపు తప్పి పడిపోవడంతో యుగంధర్ తలకు హెల్మెట్ లేకపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉప్పల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి.. మరుసటి రోజు సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులు చికిత్స అందించిన వైద్యులు.. బుధవారం అతడి బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే అతడి అవయవాలు దానం చేయాలని వైద్యులు కోరడంతో తల్లిదండ్రులు అందుకు అంగీకరించారు. యుగంధర్ గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కళ్లు తీసి.. అపోలో, కిమ్స్ తదితర ఆస్పత్రుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆరుగురు రోగులకు అమర్చారు.

నిజామాబాద్‌లో ముగ్గురు బాలికల అదృశ్యం

నిజామాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ముగ్గురు బాలికలు అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. నగరంలోని కోటగల్లి ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్న ముగ్గురు బాలికలు బుధవారం సాయంత్రం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో హాస్టల్ వార్డెన్ బాలికల తల్లిదండ్రులకు తెలియజేయడంతో పాటు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వారిలో ఒకరు తొమ్మిదో తరగతి, ఇద్దరు పదో తరగతి చదువుతున్నారు. ఫిర్యాదును స్వీకరించిన రెండో టౌన్ పోలీసులు మొదట హాస్టల్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలికలు ముగ్గురూ చెప్పాపెట్టకుండా ఎటైనా వెళ్లారా.. లేక వారిని ఎవరైనా కిడ్నాప్ చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముజాయిద్ తెలిపారు.

20 ఎకరాలు తీసుకొని బుక్కెడు బువ్వ పెడ్తలేరు!

» ఇద్దరు కొడుకులు పట్టించుకోవట్లేదంటూ గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో వృద్ధురాలి ఆవేదన


కర్ల నర్సమ్మ

గజ్వేల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తన 20 ఎకరాల భూమిని తీసుకున్న ఇద్దరు కొడుకులు బుక్కెడు బువ్వ కూడా పెడ్తలేరంటూ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం మంతూరుకు చెందిన వృద్ధురాలు కర్ల నర్సమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ ముందు గోడు వెళ్లబోసుకొని గురువారం దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ.. తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూమితో పాటు, తాము సంపాదించిన భూమిని తన ఇద్దరు కుమారులు వారి పేరుపై పట్టా మార్పిడి చేసుకున్నారని తెలిపారు. పెద్ద కుమారుడు ఇంటికి వెళ్తే బయటకు గెంటేశాడని.. చిన్న కుమారుడు తీసుకెళ్లి నెల తర్వాత పెద్ద కుమారుడి దగ్గరికే పోవాలని పంపించేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన కూతురు దగ్గర రెండేళ్లున్నానని.. చివరకు సోదరులు తిట్టడంతో ఆమె సైతం బయటకు పంపించేసిందని వాపోయారు. ఈ విషయమై గతంలో ఆర్డీవోను కలిస్తే తనకు పోషణ ఖర్చులు చెల్లించాలని కొడుకులకు చెప్తే పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయాలని మరోసారి ఆర్డీవోను కలిసి కోరినట్టు నర్సమ్మ చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో అన్నదాత ఆత్మహత్య

» కరెంటు షాక్‌తో యువ రైతు మృతి


భరత్ (ఫైల్)

పర్వతగిరి/తాడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన మద్దెల శ్రీనివాస్(42).. 1.10 ఎకరాల పొలంలో వరి వేశాడు. అలాగే వ్యవసాయ కూలీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య, కుటుంబ సమస్యలతో శ్రీనివాస్ మనోవేదనకు గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయిన శ్రీనివాస్.. గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పొలంలో మోటారు వైర్లను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో ఓ యువ రైతు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన భరత్(32) గురువారం సాయంత్రం పొలంలో మోటారు వైర్లను సరిచేస్తుండగా కరెంట్ షాక్ వచ్చి చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

నకిలీ లెక్చరర్లు!

(మొదటి పేజీ తరువాయి)



విచారణ కమిటీ 700 మంది తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రెగ్యులరైజ్ అయ్యారని గుర్తించింది. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో జూనియర్ లెక్చరర్లు కొందరు రెగ్యులరైజ్ అయ్యారని, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని గత ఏడాది నుంచి తెలంగాణ నిరుద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ విద్యారంగ పరిరక్షణ సమితి సహా పలు సంస్థలు ఉన్నత విద్యామండలికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశాయి. ఈ మేరకు నిరుడు జూలైలో వరంగల్ ఆర్‌జేడీ అధ్యక్షతన ఇంటర్ బోర్డు కమిటీని ఏర్పాటు చేసింది. 2023లో రెగ్యులరైజ్ అయిన జూనియర్ లెక్చరర్ల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆ కమిటీని ఆదేశించింది. ఈ కమిటీ అప్పటినుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు మినహా 31 జిల్లాల్లో క్రమబద్ధీకరణ పొందిన జూనియర్ లెక్చరర్ల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఆ పత్రాలకు సంబంధించి వివిధ యూనివర్సిటీల నుంచి వివరణ కూడా తీసుకుంది. క్రమబద్ధీకరణ పొందేందుకు ఇంటర్ బోర్డు నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా పలువురు తప్పుడు విధానాలు అవలంబించినట్లు కమిటీ తేల్చింది. ప్రధానంగా రాష్ట్రంలో చెల్లుబాటు కాని ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేటు యూనివర్సిటీల నుంచి పీజీ చేసినట్లు కొందరు, ఇతర రాష్ట్రాల్లోని యూనివర్సిటీల నుంచి దూరవిద్య ద్వారా ఆయా కోర్సులు పూర్తి చేసినట్లు ఇంకొందరు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లుగా కమిటీ గుర్తించింది. అలాగే.. జీవో 16 ప్రకారం, 2014లో మంజూరైన పోస్టుల్లో కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న వారిని, 14 ఏళ్ల పాటు వరుసగా సర్వీసులో ఉన్న వారినే క్రమబద్ధీకరించాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా మధ్యలో సర్వీస్ బ్రేక్ అయిన వారిని కూడా హడావుడిగా క్రమబద్ధీకరించినట్లు కమిటీ గుర్తించింది. అదేవిధంగా పుట్టిన తేదీని మార్చటం, కొన్ని యూనివర్సిటీలతో సంబంధిత కోర్సులే లేకపోయినా ఆ కోర్సు చదివినట్లు తప్పుడు పత్రాలు సృష్టించడం వంటి అంశాలను కమిటీ సభ్యులు గుర్తించారు.

ఉన్నత స్థాయిలో నకిలీల పైరవీలు

నకిలీ ధ్రువీకరణ పత్రాలతో క్రమబద్ధీకరణ పొందిన 700 మందిపై చర్యల నిమిత్తం అటార్నీ జనరల్ నుంచి ఇంటర్ బోర్డు న్యాయపరమైన సలహా పొందినట్లు తెలిసింది. అయితే నకిలీలపై చర్యలు తీసుకుంటే, వారిని రెగ్యులరైజ్ చేసిన సమయంలో క్రియాశీలక బాధ్యతలు నిర్వహించిన ఇంటర్ బోర్డుకు చెందిన అధికారిపై వేటు పడే అవకాశం ఉంది. దీంతో నకిలీలపై చర్యలు తీసుకోకుండా ఉన్నత స్థాయిలో బేరసారాలకు తెరలేపినట్లు చర్చ సాగుతోంది. అక్రమంగా క్రమబద్ధీకరణ పొందిన లెక్చరర్లను తొలగించకుండా ఉండేందుకు ప్రధానంగా ఒక సంఘం నేత, మరో ఇద్దరు కీలక ఇంటర్ బోర్డు అధికారులు రాష్ట్ర ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తుల ద్వారా పైరవీలు చేస్తున్నారని చెబుతున్నారు. ఓ మంత్రి ద్వారా సీఎస్‌పైనా ఒత్తిడి తెచ్చి చర్యల నుంచి తప్పించుకోవాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారు కూడా అప్పట్లో తలా రూ.5లక్షల వరకు అప్పటి నేతలు, సంఘం నాయకులు, ఇంటర్ బోర్డులో పనిచేసిన వారికి ఇచ్చారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భారీ మొత్తంలో డబ్బులు వెచ్చించైనా ఉద్యోగాలను కాపాడుకునేందుకు తాజాగా ఈ నకిలీ ఉద్యోగులు కొంత నిధిని సమకూర్చారని సమాచారం. వీరిని కాపాడటం ద్వారా తనపై పడే వేటును కూడా తప్పించుకునేందుకు ఇంటర్ బోర్డులోని ఓ అధికారి ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

సీఎం దృష్టి సారించాలి

అక్రమంగా క్రమబద్ధీకరణ పొందిన లెక్చరర్ల వ్యవహారంపై చర్యలు సూచించాలని కోరుతూ సుప్రీంకోర్టులోనూ నిరుద్యోగ జేఏసీ నాయకులు పిటిషన్ వేయగా, సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని కౌంటర్ వేయాల్సిందిగా సూచించిందని ఆ నాయకులు చెప్పారు. సుప్రీంకోర్టుకు తప్పుడు సర్టిఫికెట్ల వ్యవహారాలన్నింటినీ ఆధారాలతో సమర్పిస్తామని వారు చెబుతున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో రెగ్యులరైజ్ అయిన లెక్చరర్లను తాజా విచారణ కమిటీ నివేదిక ఆధారంగా తొలగించాలని, వారికి మొదటినుంచి సహకరిస్తున్న ఇంటర్ బోర్డులోని కీలక అధికారిని సస్పెండ్ చేయాలని కోరుతూ తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకులు, ప్రభుత్వ కాలేజీల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు, తెలంగాణ విద్యారంగ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని తాము సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతామని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అశోద గ్రామంలో ఎం. భుజంగరావు అనే వ్యక్తి పత్తి, కంది పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న 160 గంజాయి మొక్కలను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

గంజాయి మత్తులో ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం

సైదాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో ఓ యువకుడు ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో 15 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సైదాబాద్‌లో నివాసముంటున్న దంపతులకు కుమార్తె(8), కుమారుడు(7) ఉన్నారు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా, మూడవ తరగతి చదువుతున్న చిన్నారి(8), తమ్ముడి(7)తో కలిసి స్కూల్‌కు వెళ్లి తిరిగివచ్చింది. వారి ఇంటి సమీపంలో ఒంటరిగా నివసించే ఓ యువకుడు బాలికను ఇంట్లోకి పిలిచి తమ్ముడి ముందే అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే అందరినీ చంపేస్తానని బెదిరించాడు. భయపడిన చిన్నారులు ఎవరికీ చెప్పలేదు. బాలిక అనారోగ్యానికి గురి కావడంతో తల్లి ఆరా తీయగా జరిగిన విషయాన్ని బాలుడు వివరించాడు. తల్లి ఈ విషయాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లి వారి సూచనలతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. స్థానిక సింగరేణి బస్తీలో విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయికి యువకులు బానిసై ఇలాంటి ఘోరాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సారక్కనా.. సారలమ్మనా..?!

» సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ లోగో ఆవిష్కరించిన కేంద్రం

» వర్సిటీ పేరులో సారలమ్మకు బదులు సారక్కగా పేర్కొన్న వైనం

» సమ్మక్క-సారలమ్మగా పేర్కొనాలంటున్న గిరిజన విద్యార్థులు

SAMMAKKA SARAKKA CENTRAL TRIBAL UNIVERSITY

వరంగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ములుగు జిల్లాలోని గిరిజన యూనివర్సిటీ పేరులో సారలమ్మకు బదులు సారక్కగా పేర్కొనడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీకి సమ్మక్క-సారక్కగా నామకరణం చేసింది. బుధవారం విడుదల చేసిన యూనివర్సిటీ లోగోలో సారలమ్మ పేరు సారక్కగా పేర్కొనడంపై ఆదివాసీ విద్యార్థులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ రికార్డుల్లో సారలమ్మగా ఉంది. మహాజాతరతోపాటు గద్దెల సమీపంలోని దేవాదాయశాఖ బోర్డులు, కన్నెపల్లిలోని గుడిపైనా సారలమ్మగానే ఉంది. తాడ్వాయి మండలానికి సమ్మక్క, సారలమ్మ తాడ్వాయి మండలంగా నామకరణం చేశారు. ప్రజలు తల్లులను సమ్మక్క-సారలమ్మగానే కొలుచుకుంటున్నారు. మేడారం మహాజాతర సమయంలో ప్రభుత్వం చేసే ప్రతి ప్రకటనలో సారలమ్మగానే ఉంటుంది. ఏ పేరుతో పిలిచినా ఒక్కటే అయినా ప్రజలు పిలుచుకునే సారలమ్మ పేరు ఉంటేనే వర్సిటీకి గుర్తింపు ఉంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఆదివాసీ తెగలు, జీవన ప్రమాణాలు, ఇలవేల్పులు, గొట్టు, గోత్రాలపై పరిశోధన చేస్తున్న ఆర్కియాలజీ రిసెర్చ్ స్కాలర్, ఆదివాసీ విద్యార్థి మైపతి అరుణ్‌కుమార్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. గిరిజన వర్సిటీ పేరులో సారక్కకు బదులు సారలమ్మగా రాయాలని కోరారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

మావోయిస్టుల్లో మరిన్ని చీలికలు

» సాయుధ పోరాట విరమణకు మరో మూడు డివిజన్ల మద్దతు

» ఉత్తర బస్తర్, గడ్చిరోలి, అబూజ్‌మడ్ నుంచి లేఖలు

రాయ్‌పూర్, అక్టోబరు 9: నిషేధిత కమ్యూనిస్టు పార్టీ ఇండియా (మావోయిస్టు)లో మరిన్ని చీలికలు వస్తున్నట్లు ప్రస్ఫుటమవుతోంది. సాయుధ పోరాట విరమణపై ఇటీవల మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోనూ రాసిన లేఖ పార్టీలో విభజనను బయటపెట్టింది. ఇప్పుడు సోనూకు మరిన్ని డివిజన్ల నుంచి మద్దతు వస్తోంది. భద్రతా దళాల సమాచారం మేరకు.. సోనూ పిలుపునిచ్చిన సాయుధ పోరాట విరమణకు ఉత్తర బస్తర్, గడ్చిరోలి, అబూజ్‌మడ్ డివిజన్ల నుంచి మద్దతు తెలుపుతూ లేఖలు విడుదలయ్యాయి. మావోయిస్టులకు కంచుకోట లాంటి అబూజ్‌మడ్ (మాడ్) ప్రాంతం నుంచి కూడా మద్దతు రావడం గమనించాల్సిన విషయం. వచ్చే ఏడాది మార్చిలోగా వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపుతామన్న కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో మావోయిస్టులపై భద్రతా దళాలు దాడులను తీవ్రం చేశాయి. ఈ నేపథ్యంలో సాయుధ పోరాటానికి స్వస్తి చెప్పేందుకు మద్దతు పెరుగుతోందని భద్రతా దళాల వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం మద్దతు పలికిన మూడు డివిజన్లతో పాటు బస్తర్ రేంజ్‌లో మరో నాలుగు డివిజన్ కమిటీలు ఉన్నాయి. వాటిలో దర్భా, తూర్పు బస్తర్ డివిజన్ కమిటీలు క్యాడర్ లేక పూర్తిగా క్షీణించిపోయాయి. ఇక దక్షిణ, పశ్చిమ బస్తర్ డివిజన్లు మాత్రమే క్రియాశీలకంగా ఉన్నాయని బస్తర్ పోలీసు వర్గాల సమాచారం. సాయుధ పోరాట విరమణకు మద్దతు లేఖలపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఇదో నిర్ణయాత్మక మార్పని అన్నారు. క్షేత్రస్థాయిలో మార్పులను ఇది ప్రతిబింబిస్తుందని చెప్పారు. మావోయిస్టు క్యాంపుల్లో అంతర్గత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని, వారు విడుదల చేసిన ప్రెస్ నోట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. కాగా, తాజాగా 16 మంది మావోయిస్టులు సామూహికంగా లొంగిపోయారు. దీంతో 2024 నుంచి ఇప్పటి వరకు లొంగిపోయిన వారి సంఖ్య 1850కి పెరిగింది. అలాగే 2022-23లో 813 మంది సాయుధపోరాటానికి స్వస్తి పలికారు. గత రెండేళ్లలో లొంగుబాట్లు 128 శాతం పెరిగినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

పాఠశాలకు ఫోన్ తెచ్చాడని టీసీ ఇచ్చిన ప్రిన్సిపాల్!

» నిజామాబాద్ జిల్లాలో ఘటన

ధర్పల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు సెల్‌ఫోన్ తెచ్చాడని విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించేశారు స్కూల్ ప్రిన్సిపాల్. ప్రధానోపాధ్యాయురాలు. ఘటన నిజామాబాద్ జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. ధర్పల్లి మండలంలోని దుబ్బాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వల్పబండ తండాకు చెందిన విద్యార్థి ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గత నెల 20న పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల కోసం సెల్ ఫోన్ తీసుకువచ్చాడు. గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంటనే ఫోన్ లాక్కుని విద్యార్థిని మందలించడంతో పాటు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. కాగా, సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థికి ప్రధానోపాధ్యాయురాలు శశికళ టీసీ ఇచ్చి పంపించారు. దీంతో పాఠశాలకు ఫోన్ తెచ్చుకోవడమే నేరమా.. ? అంటూ బంజారా సేవా సంఘం నాయకులతో కలిసి తండా వాసులు ఆందోళనకు దిగారు. విద్యార్థిపై దుర్భాషలాడి.. టీసీ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. తక్షణమే సదరు ప్రధానోపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని, ఈ విషయమై మండల విద్యాధికారికి సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. విద్యార్థికి టీసీ ఇచ్చి.. తల్లిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించడంపై బంజారా సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అన్న మరణవార్త విని ఆగిన తమ్ముడి గుండె


నరసింహారావు, సురేందర్‌రావు

జడ్చర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్న మరణవార్త విని తమ్ముడు హఠాన్మరణం చెందారు. ఒకే రోజు అన్నాతమ్ముళ్లు ఇద్దరూ గుండెపోటుతో మృతి చెందారు. సోదరులలో పెద్దవాడైన వలిపె నరసింహారావు (65) వనపర్తి జిల్లా కేంద్రంలో మృతి చెందగా, తమ్ముడు వలిపె సురేందర్‌రావు (62) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. వనపర్తిలో నివాసం ఉంటున్న నరసింహారావు గురువారం తెల్లవారుజామున బాత్రూమ్‌కు వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సురేందర్‌రావు జడ్చర్ల హౌజింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా బుధవారం గుండెకు స్టంట్స్ వేశారు. గురువారం ఉదయం తన సోదరుడి మరణవార్త విన్న సురేందర్‌రావు ఆసుపత్రిలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి హఠాన్మరణం చెందారు. ఇలా ఒకేరోజు ఇద్దరు సోదరులు మృతి చెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

విధి నిర్వహణలో విషాదం

» కంటెయినర్ దూసుకెళ్లడంతో హోంగార్డు దుర్మరణం

» యాదాద్రి జిల్లా రామన్నపేటలో ఘటన


సురేందర్‌చారి(ఫైల్)

రామన్నపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వాహన తనిఖీ విధుల్లో నిర్వహిస్తున్న హోంగార్డుపైకి కంటెయినర్ దూసుకెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున యాదాద్రి-భువనగిరి జిల్లా రామన్నపేటలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ డి.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం రామన్నపేట మండలం సిరిపురం గ్రామ వాసి కూరెళ్ల ఉపేందర్‌చారి (36) రామన్నపేటలో హోంగార్డుగా.. మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి భువనగిరి-చిట్యాల రహదారిపై వాహన తనిఖీలు చేస్తుండగా.. భువనగిరి నుంచి వస్తున్న లారీ కంటెయినర్.. ఉపేందర్ చారి మీదుగా దూసుకెళ్లింది. దీంతో కంటెయినర్ టైర్ల కింద పడ్డ ఉపేందర్ చారి అక్కడికక్కడే మృతి చెందగా, ఆ వాహనం డ్రైవర్ ఆపకుండా వెళ్లడంతో.. అక్కడే ఉన్న ఇద్దరు పోలీసులు.. చిట్యాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తిప్పర్తి వద్ద చిట్యాల పోలీసులు కంటెయినర్‌ను పట్టుకున్నారు. మృతుడు ఉపేందర్ చారికి భార్య, కుమార్తె (6), కొడుకు (4) ఉన్నారు. ఉపేందర్‌చారి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్జ్నహోర్కైకు సాహిత్య నోబెల్

స్టాక్‌హోం, అక్టోబరు9: ప్రముఖ హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్జ్నహోర్కై ఈఏటి సాహిత్య నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఎర్నెస్ట్ హెమింగ్వే, ఆల్బర్ట్ కామూ, టోనీ మారిసన్ వంటి దిగ్గజ రచయితల అడుగుజాడల్లో నడిచిన లాస్లో శైలి.. కఠినంగా, పాఠకులను పరీక్షించేలా ఉంటుందని సాహితీ ప్రియులు అంటారు. ప్రపంచాన్ని ఒక్క సత్యం, ఒక్క తత్వం, ఒక్క కథనంలో కట్టిపడేయలేమని.. అనేక సత్యాలు ఉంటాయని, ప్రతిదీ దాని దృక్కోణంలో నిజమని చెప్పే లోతైన తాత్విక దృష్టి ఆయన రచనల్లో ఉంటుందని.. పతనం దిశగా కదిలే మనుషులపై ఆసక్తి ఆయన రచనల్లో కనపడుతుందని వారు పేర్కొంటారు. తాత్వికతను, విషాదంతో కూడిన హాస్యాన్ని మేళవించిన నవలలతో సుప్రసిద్ధుడయ్యారాయన. 1954లో హంగరీలోని జులా పట్టణంలో ఓ మధ్యతరగతి యూదు కుటుంబంలో జన్మించిన లాస్లో తొలుత ఫ్రీలాన్స్ రైటర్‌గా కొన్నాళ్లు పనిచేశారు. 1985లో తన తొలి నవల 'శాటాన్ టాంగ్' రాశారు. మొదటి నవలతోనే హంగరీ సాహితీ ప్రపంచంలో తనదంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ప్రముఖ హంగేరియన్ ఫిలిం మేకర్ బెలా టారో ఆ నవల చదివి ముగ్ధుడై.. దాన్ని ఎలాగైనా తెరకెక్కించాలనే పట్టుదలతో 1994లో ఏడున్నరగంటల సినిమాగా రూపొందించారు. లాస్లో రాసిన 'ద మెలాంకలీ ఆఫ్ రెసిస్టెన్స్' నవలను బెలా టారో తెరకెక్కించారు. లాస్లో నవలల్లో కనిపించే ప్రత్యేకత.. పొడవాటి వాక్యాలు. కొన్ని వాక్యాలైతే పేజీ.. పేజీన్నర ఉంటాయి.

ట్రంప్‌నకు 'శాంతి' లేదా?

అమెరికా అధ్యక్షుడికి నోబెల్ పురస్కారం దక్కే అవకాశాల్లేవనేది నిపుణుల అంచనా

- నోబెల్ కమిటీ సమావేశాల్లో ఆయన పేరు చర్చకు వస్తుందా? అనే విషయమ్మీద స్పష్టత కరువు
- టంప్ వ్యక్తిగత రికార్డే మైనస్?

స్టావెంజర్ (నార్వే), అక్టోబరు 9: ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతిని ఎవరికి ఇవ్వనున్నారు? ఈ పురస్కారం తనకే దక్కాలన్న పట్టుదలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విశ్వప్రయత్నాలు చేస్తుండటంతో ఇది మరింత ఆసక్తిగా మారింది. నార్వే పార్లమెంటు కమిటీ నియమించిన ఐదుగురు సభ్యుల నోబెల్ కమిటీ రహస్య సమావేశాల్లో ట్రంప్ పేరు చర్చకు వస్తుందా? అనే విషయంపై స్పష్టత కరువైంది. గతంలో ఈ పురస్కారానికి ట్రంప్ అనేకసార్లు నామినేట్ అయ్యారు. ఇజ్రాయెల్, పలు అరబ్ దేశాల మధ్య సంబంధాలను సాధారణస్థితికి తీసుకురావడంలో ట్రంప్ చేసిన కృషికిగాను ఆయన్ను 2025 సంవత్సరానికి నోబెల్ శాంతి పురస్కారం కోసం సిఫారసు చేస్తున్నట్లు గత డిసెంబరులో అమెరికా ప్రభుత్వ ప్రతినిధి క్లాడియా టెన్నీ ప్రకటించారు. నోబెల్ నామినేషన్లకు గత ఫిబ్రవరి 1వ తేదీతో గడువు ముగిసిన తర్వాత ట్రంప్ పేరును ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ నోబెల్ కమిటీకి సిఫారసు చేశారు. అయితే ఈసారి ఏడాది కూడా ఆయనకు శాంతి పురస్కారం లభించే అవకాశాలు లేవని నిపుణులు అంచనా వేస్తున్నారు. తొలిసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే శాంతి బహుమతి కోసం ఆయన నోబెల్ దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత్-పాక్ యుద్ధం సహా ఏడు యుద్ధాలను తాను ఆపానని అనేక సార్లు చెప్పుకొన్నారు. గత నెలాఖరులో.. ఐరాస వేదికగా కూడా "నాకు నోబెల్ శాంతి బహుమతి దక్కాలని అంతా కోరుకుంటున్నారు" అని తనకు తాను గొప్పలు పోయారు. శాంతి పురస్కారం కోసం పలువురు దేశాధినేతల మద్దతును ట్రంప్ కూడగట్టుకున్నప్పటికీ ఆయనకు బహుమతి దక్కే చాన్స్ లేకపోవొచ్చునని అంటున్నారు. ఇందుకు ట్రంప్ వ్యక్తిగత రికార్డే ఆయనకు మైనస్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉమ్మడి ప్రయోజనాలను కాంక్షిస్తూ పలు సమస్యల పరిష్కారం కోసం పలుదేశాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సంస్థల పట్ల సానుకూలంగా లేకపోవడం, వాతావరణ మార్పులపై ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఆందోళనలను అస్సలు పట్టించుకోకపోవడం వంటివి ట్రంప్‌నకు మైనస్ అవుతాయని చెబుతున్నారు. శాంతి పురస్కారం కోసం.. ఎలాంటి ప్రచార ఆర్భాటాలు లేకుండా అంతర్జాతీయంగా శాంతి, సౌభ్రాతృత్వాల కోసం కృషి చేస్తున్న సంస్థలపై నోబెల్ కమిటీ దృష్టి పెట్టే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.



'శాంతి'కి రాకుంటే.. నరకం చూపిస్తానని..

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను నివారించానని చెప్పి శాంతి బహుమతి పొందాలని ట్రంప్ ఎప్పటినుంచో తహతహలాడుతున్నారు. ఈ క్రమంలోనే పలు దేశాల మధ్య వివాదాలను పరిష్కరించడంలో భాగస్వామి అయ్యారు. ఉక్రెయిన్, రష్యా మధ్య సంధికోసమూ ప్రయత్నించారు. గాజాలో ఇజ్రాయెల్ దాడులపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వస్తున్న వేళ.. తమ మిత్రదేశమే అయినా ఇజ్రాయెల్‌ను కట్టడి చేసి శాంతిని నెలకొల్పిన పేరు పొందాలని ట్రంప్ భావించారు. పలు ముస్లిం దేశాలను కలుపుకొని ఇజ్రాయెల్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇజ్రాయెల్ తీరుకు వ్యతిరేకంగా ఇస్లామిక్ దేశాలన్నీ ఒక్కటవుతున్నాయని చెప్పి నెతన్యాహూ దిగివచ్చేలా చేశారు. అదే సమయంలో శాంతి ఒప్పందానికి రాకుంటే నరకం చూపిస్తామని తీవ్రస్థాయిలో బెదిరించి హమాస్‌ను కూడా దారికి తెచ్చారు. అంతేకాదు శుక్రవారం (ఈ నెల 10న) నోబెల్ శాంతి బహుమతి ప్రకటన ఉన్న నేపథ్యంలో.. శాంతి ఒప్పందాన్ని వేగవంతం చేయాలని ఇజ్రాయెల్, హమాస్‌లపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో శాంతి ఒప్పందంపై గురువారమే ప్రకటన రావడం గమనార్హం.

హరియాణా డీజీపీపై కేసు

- సీఎంకు దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ భార్య, ఐఏఎస్ అమనీత్ లేఖతో ఎట్టకేలకు కేసు
- తన భర్తకు ఆత్మహత్యకు డీజీపీ శత్రుజీత్ కపూర్, ఎస్పీ నరేంద్రలే కారణమని అమనీత్ ఆరోపణ

చండీగఢ్, అక్టోబరు 9: హరియాణా దళిత ఐపీఎస్ అధికారి వై పూరన్ కుమార్ ఆత్మహత్య కేసులో ఆ రాష్ట్ర డీజీపీ శత్రుజీత్ సింగ్ కపూర్‌తో పాటు రోహతక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాపై కేసు నమోదైంది. తన భర్త బలవన్మరణానికి డీజీపీ, ఎస్పీలే కారణమని కుమార్ భార్య, ఐఏఎస్ అధికారిణి అమనీత్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు చండీగఢ్ ఎస్ఎస్పీ ధ్రువీకరించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు పెట్టారు. పలువురు సీనియర్ అధికారుల కుల వివక్ష, మానసిక వేధింపులు భరించలేక కుమార్ మంగళవారం చండీగఢ్‌లోని ఇంట్లో సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తనను ఎవరెవరు ఎలా వేధించిందీ అవమానించిందీ కుమార్ 8 పేజీల సూసైడ్ నోట్‌లో రాశారు. అందులో కొందరు రిటైర్డ్ అధికారుల పేర్లు కూడా ఉన్నాయి. కుమార్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో జపాన్ పర్యటనలో ఉన్న అమనీత్.. వెంటనే చండీగఢ్ బయలుదేరి వచ్చారు. బుధవారం రాత్రి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీజీపీ, ఎస్పీలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆమె గురువారం సీఎం నాయబ్ సింగ్ సైనీకి ఘాటు లేఖ రాశారు. దాంతో ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. తన భర్త సూసైడ్ నోట్ ఉన్నా.. తాను ఫిర్యాదు చేసినా నిందితులు శక్తిమంతులు కావడంతో కేసు నమోదు చేయలేదని అమనీత్ తన లేఖలో విమర్శించారు. దళితుడివంటూ కుమార్‌ను సూటిపోటి మాటలతో అవమానించేవారని ఆమె పేర్కొన్నారు. తన కుటుంబానికి ముప్పు ఉందని, రక్షణ కల్పించాలని సీఎంను కోరారు. 2001 బ్యాచ్ హరియాణా క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన కుమార్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. అమనీత్ కూడా 2001 బ్యాచ్‌కే చెందిన ఐఏఎస్ అధికారిణి.

విమాన సర్వీసుల పునరుద్ధరణతో భారత్‌తో బంధం బలోపేతం: చైనా

బీజింగ్, అక్టోబరు 9: చైనాకు విమాన సర్వీసుల పునరుద్ధరణపై భారత్ నిర్ణయాన్ని డ్రాగన్ దేశం స్వాగతించింది. ఇరుదేశాల మధ్య ఐదేళ్లుగా నిలిచిపోయిన విమాన సర్వీసులు తిరిగి ప్రారంభంకానుండడం.. భారత్, చైనా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం దిశగా పడిన అడుగని గురువారం పేర్కొంది. ఈనెల 26 నుంచి చైనాకు విమాన సర్వీసులు పునరుద్ధరిస్తామని భారత్ అక్టోబరు 2న ప్రకటించింది. అయితే, దేశవ్యాప్తంగా 8 రోజుల సెలవుల తర్వాత గురువారం తిరిగి కార్యకలాపాలు ప్రారంభించిన చైనా విదేశాంగ శాఖ.. విమాన సర్వీసుల అంశంపై స్పందించింది. తమ అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత ప్రధాని మోదీ మధ్య కుదిరిన ఉమ్మడి అవగాహనకు ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయనేందుకు విమాన సర్వీసుల పునరుద్ధరణ నిదర్శనమని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

జిల్లా జడ్జిల ఎంపికలో ప్రతిభకే పట్టం

- లాయర్ల కోటా భర్తీ ప్రక్రియలో న్యాయాధికారులూ పాల్గొనవచ్చు: సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబరు 9: జిల్లా జడ్జిల నియామకం విషయమై తలెత్తిన ఓ సందేహానికి గురువారం సుప్రీంకోర్టు సమాధానం ఇచ్చింది. ప్రతిభకే ప్రాధాన్యం ఇస్తూ తీర్పును వెలువరించింది. ప్రస్తుతం న్యాయాధికారులుగా పనిచేస్తున్న వారు అంతకుముందు ఏడేళ్ల పాటు న్యాయవాదిగా ప్రాక్టీసు చేసి ఉంటే వారు కూడా బార్ కోటాలో జిల్లా జడ్జి పదవులు పొందడానికి అర్హులేనని తెలిపింది. అడ్వకేట్ల కోటా కింద నమోదు చేసిన ఖాళీల్లో అలాంటి వారిని కూడా నియమించవచ్చని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎస్.సి.శర్మ, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పరస్పరం సమ్మతి తెలుపుతునే రెండు వేర్వేరు తీర్పులను వెలువరించింది. అడ్వకేట్ల కోసం మాత్రమే ప్రత్యేకించిన డైరెక్టు రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో న్యాయవాదిగా ఏడేళ్ల అనుభవం ఉన్న జ్యుడీషియల్ ఆఫీసర్లు పాల్గొనవచ్చని సీజేఐ గవాయ్ తన తీర్పులో పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో రాజ్యాంగ సిద్ధాంతాలకు సహజమైన పద్ధతుల్లో అన్వయం చెప్పాలే తప్ప, పాండిత్య ప్రకర్ష చూపించకూడదన్నారు. అన్ని రాష్ట్రాలు హైకోర్టులతో సంప్రదించిన అనంతరం మూడు నెలల్లోగా ఇందుకనుగుణంగా నిబంధనలను సవరించాలని ఆదేశించారు. ఇదే అభిప్రాయంతో ఏకీభవిస్తూ జస్టిస్ సుందరేశ్ విడిగా తీర్పు రాశారు. అందరికీ అవకాశమిచ్చి ప్రతిభావంతులను గుర్తించాల్సి ఉంటుందన్నారు.

భారత ముస్లిం మహిళలపై జైషే గురి!

- హిజాబ్, నిత్య ప్రార్థనలు, షరియత్ అంటూ కొత్త వ్యూహం

న్యూఢిల్లీ, అక్టోబరు 9: పాకిస్థాన్‌కు చెందిన జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ సరిహద్దు వెంబడి విద్యావంతులైన ముస్లిం మహిళల లక్ష్యంగా మతపరమైన, భావోద్వేగ అభ్యర్థనలతో కూడిన కొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నట్టు ఇంటెలిజెన్స్ సంస్థలు గుర్తించాయి. మహిళలను ప్రేరేపించడానికి మక్కా, మదీనా చిత్రాలు, ఖురాన్ శ్లోకాలు, భావోద్వేగమైన అప్పీళ్లను ఆ సంస్థకు చెందిన ఉగ్ర గ్రూపులు ఉపయోగిస్తున్న ఉర్దూ ప్రచార మెటీరియల్ ఇటీవలే వెలుగులోకి వచ్చింది. మహిళలను బ్రెయిన్‌వాష్ చేసి, ఉగ్రవాద నెట్‌వర్క్‌లలో వారిని నియమించుకోడానికి 'నిత్య ప్రార్థనలు, దాతృత్వం, హిజాబ్' అంటూ మతపరమైన భావజాలాన్ని ఉగ్రగ్రూపులు వాడుకుంటున్నాయి. జమ్మూకశ్మీర్, యూపీ, దక్షిణభారత మహిళల లక్ష్యంగా 2004 నుంచి ఈ సంస్థ క్రియాశీలకంగా పనిచేస్తోంది. వాట్సాప్, టెలిగ్రామ్, మదర్సా నెట్‌వర్క్‌ల ద్వారా చిన్న గ్రూపులను ఈ సంస్థ నిర్వహిస్తోంది.

ఇప్పుడది మరచిన అధ్యాయం

- బూటు విసిరిన ఘటనపై చీఫ్ జస్టిస్ గవాయ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబరు 9: సుప్రీంకోర్టులో తనపై ఓ న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించడం చూసి బెంచ్‌పై ఉన్న తాను, సోదర న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్ షాకయ్యామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. అయినా ఇప్పుడది మరచిపోయిన అధ్యాయమని పేర్కొన్నారు. వనశక్తి వ్యవహారంలో గురువారం కోర్టులో విచారణ సందర్భంగా గత సోమవారం (6న) జరిగిన బూటు సంఘటనను ఆయన ప్రస్తావించారు. కాగా సీజేఐపై బూటు విసిరేందుకు ప్రయత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌ను ఇప్పటికే సస్పెండ్ చేసిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ గురువారం ఆయన్ను బహిష్కరించింది. బార్‌లో ఆయన తాత్కాలిక సభ్యత్వాన్ని టెర్మినేట్ చేసింది.

ఇదిగో 'శాంతి'.. ఏదీ బహుమతి?

(మొదటిపేజీ తరువాయి)



అంగీకరించాయి. ప్రస్తుతానికి యుద్ధాన్ని నిలిపివేసి, పరస్పరం బందీలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు ప్రారంభించాయి. దీనిపై ట్రంప్ గురువారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం) 'ట్రుత్' సోషల్‌లో పోస్టు పెట్టారు. "గాజాలో శాంతి ప్రణాళిక మొదటి దశకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ఇరువర్గాలు తమ వద్ద ఉన్న బందీలను త్వరలోనే విడుదల చేస్తాయి. ఇజ్రాయెల్ తమ సైన్యాన్ని వెనక్కి తీసుకుంటుంది. గాజాలో శాశ్వత శాంతి దిశగా ఇదొక ముందడుగు. ఈ వ్యవహారంలో అందరినీ సమానంగా చూస్తాం.." అని ట్రంప్ పేర్కొన్నారు. అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, హమాస్ కూడా శాంతి ప్రణాళిక తొలిదశ అమలుపై ప్రకటనలు చేశాయి. అంతకుముందు ఈజిప్టులో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, ఈజిప్టు, టర్కీ, ఖతార్ దేశాల ప్రతినిధులు, ఇజ్రాయెల్ ప్రధాని సలహాదారు రాన్ డెర్మర్ పాల్గొన్నారు. ఆ సమయంలో ట్రంప్ వైట్‌హౌజ్‌లో ఓ సమావేశంలో ఉన్నారు. ఆ సమయంలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో ట్రంప్ వద్దకు వెళ్లి ఒక నోట్ చూపించి, శాంతి ఒప్పందం విషయం చెప్పారు. తర్వాత ట్రంప్ ఈ అంశంపై పోస్టు పెట్టారు. కాగా శాంతి ప్రక్రియ మొదలైందని, హమాస్ వద్ద బందీలుగా ఉన్న తమవారు దేవుడి దయతో తిరిగివస్తున్నారని నెతన్యాహూ పేర్కొన్నారు. మరోవైపు గాజాలో యుద్ధాన్ని ముగించే ఒప్పందానికి అంగీకరించామని హమాస్ ప్రకటించింది. ఇక ఇజ్రాయెల్ దళాల ఉప సంహరణ, బందీల విడుదల, గాజాకు మానవతా సాయం కోసం మార్గాలను తెరవడానికి ఒప్పందం కుదిరిందని తెలిపింది. అయితే శాంతి ఒప్పందంలోని షరతులను ఇజ్రాయెల్ కచ్చితంగా అమలు చేసేలా చూడాలని ట్రంప్‌కు, మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు హమాస్ విజ్ఞప్తి చేసింది. కాగా, శాంతి ఒప్పందంపై బ్రిటన్, ఇటలీ ప్రధానులు స్టార్మర్, జార్జియా మెలొని.. తుర్కియే, ఈజిప్టు, ఫ్రాన్స్ అధ్యక్షులు ఎర్డోగాన్, అబ్దెల్ ఎల్‌సిస్సి, మేక్రాన్ హర్షం వ్యక్తం చేశారు. శాంతి ఒప్పందం పూర్తిస్థాయిలో అమలయ్యేలా ఐక్యరాజ్యసమితి సహకరిస్తుందని.. పాలస్తీనా ప్రజలకు మానవతా సాయంతోపాటు గాజా పునర్నిర్మాణానికి తోడ్పడుతామని ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ప్రకటించారు. చైనా, జోర్డాన్, సౌదీ అరేబియా, లెబనాన్, నెదర్లాండ్స్, కెనడా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలు కూడా ఒప్పందంపై హర్షం వ్యక్తం చేశాయి.

బందీల విడుదల.. సైన్యం వెనక్కి..

శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా హమాస్ తమ వద్ద బందీలుగా ఉన్న 20 మంది ఇజ్రాయెలీలను విడుదల చేస్తుంది. మరోవైపు ఇజ్రాయెల్ వద్ద బందీలుగా ఉన్న సుమారు 2 వేల మంది పాలస్తీనీయులను వదిలిపెట్టనుంది. అందులో ఇజ్రాయెల్ గతంలోనే అరెస్టు చేసి దీర్ఘకాలిక శిక్షలు వేసినవారు 250 మందికిపైగా ఉండగా, మరో 17 వందల మంది గత రెండేళ్లలో అదుపులోకి తీసుకున్నవారు ఉన్నట్టు హమాస్ వర్గాలు తెలిపాయి. ఇక శాంతి ఒప్పందంలో భాగంగా గాజా సిటీ, ఖాన్ యూనిస్, రఫా నగరాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళుతుంది. శాంతి ప్రణాళికలో భాగంగా.. ఇక ముందు హమాస్ ఆయుధాలు వదిలేయడం, గాజా పరిపాలనను పాలస్తీనా అథారిటీకి అప్పగించడం వంటి చర్యలు అత్యంత కీలకంగా మారాయి. కాగా, ఐక్యరాజ్యసమితి శాంతి దళాలకు అమెరికా ఇచ్చే నిధులను గణనీయంగా తగ్గించడంతో.. శాంతి పరిరక్షణ దళాలను 25శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ఐక్యరాజ్యసమితి సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

గాజాలో శాశ్వత శాంతి నెలకొంటుంది: మోదీ

ఇజ్రాయెల్, హమాస్ ఒప్పందంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. "ట్రంప్ శాంతి ప్రణాళిక తొలిదశ అమలు ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గొప్ప నాయకత్వానికి ప్రతీక ఇది. బందీల విడుదల, గాజా ప్రజలకు మానవతా సాయం సాఫీగా సాగాలని.. శాశ్వత శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నా" అని గురువారం మధ్యాహ్నం ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో ట్రంప్‌పై ఎలాంటి ప్రశంసలు చేయలేదు. కానీ గురువారం రాత్రి మోదీ మరో ట్వీట్ చేశారు. "నా స్నేహితుడు ట్రంప్‌తో మాట్లాడాను. గాజా శాంతి ప్రణాళికపై అభినందించాను. భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం చర్చల పురోగతిపైనా చర్చించాం. తరచూ సంప్రదింపులు జరుపుతూ ఉండాలని నిర్ణయించాం" అని మోదీ పేర్కొన్నారు. అలాగే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు కూడా ఫోన్ చేసి అభినందించానని తెలిపారు. కాగా, మోదీ ఫోన్ చేసినప్పుడు కీలక కేబినెట్ భేటీలో ఉన్న నెతన్యాహూ.. దాని ఆపి వెళ్లి మరీ మోదీతో మాట్లాడారని నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది.

సమాచారం కావాలంటే.. 29 ఏళ్లు

(మొదటిపేజీ తరువాయి)

మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో అడిగిన సమాచారం ఇవ్వలేదని రాష్ట్ర సమాచార కమిషన్ వద్ద అప్పీలు చేస్తే దానిపై విచారణ 2054లో జరుగుతుందన్న మాట. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత దయనీయమైన పరిస్థితి లేదు. దేశవ్యాప్తంగా రాష్ట్ర స్థాయి కమిషనర్లలో 4 లక్షల కేసులు పెండింగులో ఉన్నట్లు సంఘటన్ తెలిపింది. తెలంగాణ కమిషన్ ప్రస్తుత పరిష్కార వేగాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది జూలై 1న వచ్చిన దరఖాస్తును పరిష్కరించడానికి 29 సంవత్సరాల 2నెలలు పడుతుందని అంచనా వేసింది. త్రిపురలో అయితే 23 ఏళ్ళ, ఛత్తీస్‌గఢ్‌లో అయితే 11 ఏళ్ల, మధ్యప్రదేశ్, పంజాబ్‌లలో ఏడేళ్ల పడుతుందని తెలిపింది. 18 రాష్ట్రాల కమిషన్లు ఏడాదికి మించిన సమయం తీసుకుంటున్నాయి. మొత్తం 29 కమిషన్లు ఉంటే 20 కమిషన్లకు 2023-24 వార్షిక నివేదికను ప్రచురించే తీరికే లేదని తేలింది. ఆ రకంగా చూస్తే 69% కమిషన్లు తమ బాధ్యతను నిర్వర్తించడం లేదు. కేంద్ర సమాచార కమిషన్‌కు, రెండు రాష్ట్రాల సమాచార కమిషన్‌కు ప్రధాన కమిషనర్ లేరు. హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్‌లలో ఒక్క కమిషనర్‌కూడా లేడు. ఈ ఏడాది జూన్ 30వరకు 29 రాష్ట్ర కమిషన్లలో 4,13,972 అప్పీళ్లు వచ్చాయి. ఏడాది క్రితం ఆరు కమిషన్లు మూలన పడితే ఇటీవలే నాలుగు కమిషన్లకు కమిషనర్లను నియమించారు. పలుకమిషన్లు ఎలాంటి ఆదేశాలివ్వకుండానే అప్పీళ్లను తిప్పిపంపుతున్నాయి.

మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు

- కర్ణాటక క్యాబినెట్ నిర్ణయం

బెంగళూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులకు ఒక రోజు వేతనంతో కూడిన 'నెలసరి' ఐచ్ఛిక సెలవు ఇవ్వాలని కర్ణాటక మంత్రిమండలి నిర్ణయించింది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను శాసనసభ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో నెలసరి సెలవు అమలులో ఉందని, కర్ణాటకలోనూ మహిళా ఉద్యోగులకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తామని చెప్పారు.

మూడు దగ్గు మందులు వెనక్కి

- ఉత్పత్తి ఆపేయాలని సీడీఎస్‌సీవో ఆదేశం

న్యూఢిల్లీ/ చెన్నై, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దగ్గు మందులు కోల్డ్‌రిఫ్, రెస్పిఫ్రెష్‌టీఆర్, రీలైఫ్‌లను రీకాల్ చేశామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) సమాచారం ఇచ్చింది. ఈ మూడు మందుల ఉత్పత్తిని నిలిపివేయాలని తయారీదారులను ఆదేశించామని తెలిపింది. వీటిలో ఏ మందునూ విదేశాలకు ఎగుమతి చేయలేదని పేర్కొంది. ఇదిలా ఉండగా, కోల్డ్‌రిఫ్ సిరప్ తాగి చిన్నారులు మృతి చెందిన సంఘటనకు సంబంధించి ఆ మందును తయారు చేసిన శ్రీసన్ ప్రైవేట్ ఫార్మాస్యూటికల్స్ సంస్థ యజమాని జి.రంగనాథన్ అరెస్టయ్యారు. తమిళనాడు పోలీసుల సహకారంతో మధ్యప్రదేశ్ పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, దగ్గు మందులను తయారు చేస్తున్న కంపెనీల్లో తనిఖీలు, ఆడిట్ కోసం సీడీఎస్‌సీవో గురువారం దేశవ్యాప్త డ్రైవ్‌ను ప్రారంభించింది.

భారత్-యూకే భాగస్వామ్యం.. ప్రపంచ సుస్థిరతకు మూల స్తంభం!

(మొదటిపేజీ తరువాయి)

భారత్‌కు వచ్చిన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో గురువారం మోదీ భేటీ అయ్యారు. నేతలిద్దరూ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. అనేక రంగాల్లో ఇరుదేశాల మధ్య బంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం స్టార్మర్, మోదీ మీడియాకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భారత్, యూకేల భాగస్వామ్యం అత్యంత నమ్మకమైందని.. ఇది ప్రతిభ, సాంకేతికతతో ముందుకు వెళ్తోందని మోదీ చెప్పారు. ఇరు దేశాల ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, తాను కలిసి పనిచేస్తామన్నారు. భారత్, యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాన్ని స్టార్మర్ గొప్ప ముందడుగుగా అభివర్ణించారు. ఈ ఒప్పందంతో సుంకాలు భారీగా తగ్గిపోతాయన్నారు. ఇరుదేశాల మార్కెట్లలో పరస్పర వాణిజ్యం పెరుగుతుందని, పెద్దఎత్తున ఉద్యోగావకాశాలూ లభిస్తాయని చెప్పారు. 2028 కల్లా ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ప్రధాని మోదీకి, ఆయన నాయకత్వానికి అభినందనలు తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన అంశంపైనా తాము చర్చించినట్లు చెప్పారు. వివిధ రకాల లక్ష్యాలను ఛేదించగల తేలికపాటి క్షిపణి వ్యవస్థలను భారత సైన్యానికి సరఫరా చేయనున్నట్లు బ్రిటన్ అధికారులు చెప్పారు. అలాగే భారత నౌకాదళానికి అవసరమైన ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను సంయుక్తంగా అభివృద్ధి చేయాలని కూడా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అంశాలపై ఇరుదేశాల మధ్య రూ.4151 కోట్ల ఒప్పందం జరిగినట్లు తెలిపారు.



బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో ముచ్చటిస్తున్న మోదీ

భారత్‌లో 9 వర్సిటీ క్యాంపస్‌లు

భారత్‌లో కొత్తగా తొమ్మిది బ్రిటన్ యూనివర్సిటీల క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు స్టార్మర్ ప్రకటించారు. ఇటీవలే గురుగ్రామ్‌లో యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ క్యాంపస్‌ను ప్రారంభించగా.. ఇప్పుడు యూనివర్సిటీ ఆఫ్ లాంకెస్టర్, యూనివర్సిటీ ఆఫ్ సర్రే క్యాంపస్‌లు కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాదిలో యూనివర్సిటీ ఆఫ్ యార్క్, అబెర్డీన్, బ్రిస్టల్, లివర్‌పూల్, క్వీన్స్ యూనివర్సిటీ బెల్‌ఫాస్ట్, యూనివర్సిటీ ఆఫ్ కొవెంట్రీలు క్యాంపస్‌లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీంతో భారత్‌లో అత్యధిక ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పిన దేశంగా బ్రిటన్ నిలవనుందన్నారు.

భారత వృద్ధిలో భాగస్వాములు కండి

భారతదేశ అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని ప్రధాని మోదీ అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. గురువారం ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో, సీఈవో ఫోరం సమావేశంలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. సాంకేతికత అంటే కేవలం ఒక సౌకర్యం మాత్రమే కాదన్నారు. అది సమానత్వానికి ప్రతీక అని చెప్పారు. భారత్ ఇతర దేశాలతో టెక్నాలజీని మాత్రమే పంచుకోవడం లేదని, దాన్ని అభివృద్ధి చేయడంలో సాయపడుతోందని చెప్పారు. యూకే సహా అంతర్జాతీయ పెట్టుబడిదారులందరినీ ఆహ్వానిస్తున్నామని.. భారత అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. భారత్-యూకేల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ఇరుదేశాల పరస్పర పురోగతికి మార్గసూచీ అని పేర్కొన్నారు. భారత్‌లోని ప్రతిభ, భారీ అవకాశాలు, యూకేలోని పరిశోధన, అభివృద్ధి, నైపుణ్యాలు కలిస్తే ఫలితాలు చాలా గొప్పగా ఉంటాయని మోదీ చెప్పారు.

తుజే దేఖా తో యే జానా సనమ్..

బ్రిటన్ ప్రధాని స్టార్మర్ విశేష ప్రజాదరణ పొందిన బాలీవుడ్ పాటను వింటున్న వీడియోను యశ్‌రాజ్ ఫిలిమ్స్ గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. సూపర్ హిట్ సినిమా దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగేలోని 'తుజే దేఖా తో యే జానా సనమ్' పాటను స్టార్మర్ విన్నారు. తమ స్టూడియోను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ పాట విన్నట్లు యశ్‌రాజ్ ఫిలిమ్స్ తెలిపింది.

ప్రజాస్వామ్యంలో తీవ్రవాదానికి చోటు లేదు

బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో భేటీ సందర్భంగా ప్రధాని మోదీ ఖలిస్థానీ తీవ్రవాదుల అంశాన్ని కూడా ప్రస్తావించినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ప్రజాస్వామ్య దేశాల్లో తీవ్రవాదం, హింసకు చోటు లేదని మోదీ స్పష్టం చేశారన్నారు. ఖలిస్థానీ తీవ్రవాదంపై నేతలిద్దరూ సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు. అలాంటి తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మోదీ తేల్చిచెప్పారన్నారు.

బిహార్‌లో ముదిరిన సీట్ల పేచీ!

- ఎన్డీయేలో పాశ్వాన్, మాంఝీతో.. మహాఘట్‌బంధన్‌లో సీపీఐ ఎంఎల్‌తో తలనొప్పి
- నేటి నుంచే నామినేషన్లు
- ఇప్పటికీ తేలని సీట్ల పంపకాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో అసెంబ్లీ సీట్ల పంపకాల పేచీ ముదురుతోంది. శుక్రవారం నుంచే నామినేషన్ల పర్వం మొదలవుతున్నా.. ఇంకా అధికార ఎన్డీయేలోగానీ, ప్రతిపక్ష మహాఘట్‌బంధన్‌లోగానీ సీట్ల పంపకాలు తేలలేదు. ఎన్డీయేలో లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ) నేత చిరాగ్ పాశ్వాన్ 30 సీట్లకు తగ్గనని పట్టుబడుతుండగా, హిందూస్తాన్ ఆవామ్ మోర్చా (హెచ్‌ఏఎం) నేత జితన్‌రాం మాంఝీ కనీసం 15 సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎల్‌జేపీకి 20, హెచ్‌ఏఎంకు 8 సీట్లు ఇస్తామని బీజేపీ, జేడీయూ ప్రతిపాదించాయి. సీట్ల కేటాయింపుపై ఢిల్లీలో చిరాగ్ పాశ్వాన్‌తో బీజేపీ బిహార్ ఎన్నికల ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, బిహార్ నేత మంగళ్‌పాండే చర్చలు జరుపుతున్నారు. మరోవైపు జితన్‌రాం మాంఝీని బుజ్జగించేందుకు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రయత్నిస్తున్నారు. ఈ నెల 12కల్లా మిత్రపక్షాలతో చర్చలు ముగుస్తాయని, పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై 13న అభ్యర్థుల తొలి జాబితా ప్రకటిస్తామని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఎన్డీయే కూటమి వర్గాల ప్రకారం.. జేడీయూ 102 సీట్లలో, బీజేపీ 101, ఎల్‌జేపీ 20-25, హెచ్‌ఏఎం 8-10, రాష్ట్రీయ లోక్ మోర్చా 5-7 సీట్లలో పోటీ చేసే అవకాశాలున్నాయి. మరోవైపు ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమిలో కీలకమైన ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య ఎక్కువ సీట్ల కోసం పోటీ నెలకొంది. కాంగ్రెస్ సీనియర్ నేతలు గురువారం సాయంత్రం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో చర్చలు జరిపారు. ఇక సీపీఐఎంఎల్‌కు 19 సీట్లు ఇచ్చేందుకు ఆర్జేడీ సిద్ధమైనా.. 30 సీట్లు కావాల్సిందేనని ఆ పార్టీ పట్టుబడుతోంది. కూటమి వర్గాల మేరకు.. ఆర్జేడీ, సీపీఐఎంఎల్ కలసి 130-133, కాంగ్రెస్ 55-58, వీఐపీ 14-1,8 జేఎంఎం 2-3 సీట్లు, ఆర్ ఎల్ జేపీ 0-2 సీట్లలో పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. కాగా, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాధనాలను దుర్వినియోగం చేయవద్దని ఈసీ పేర్కొంది.

స్థానిక ఎన్నికలకు బ్రేక్!

మొదటిపేజీ తరువాయి)

బీసీ నాయకులు, బీసీ సంఘాలు దాఖలు చేసిన దాదాపు 60 ఇంప్లీడ్ పిటిషన్‌లను విచారణకు స్వీకరిస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాల్ చేస్తూ బుట్టెంగారి మాధవరెడ్డి, తదితరులు హైకోర్టులో దాదాపు 10 పిటిషన్‌లు దాఖలు చేశారు. బుధవారం వాదనలు ముగియక పోవడంతో గురువారం మధ్యాహ్నం 2.15 గంటల నుంచి చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చాలా కసరత్తు చేసిందని తెలిపారు. "స్వతంత్రం వచ్చిన నాటి నుంచి రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, కుల సర్వే చేపట్టాం. సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ అమలులో భాగంగా బీసీల రాజకీయ, సామాజిక వెనుకబాటును అంచనా వేయడం కోసం ఇంటింటి కుల సర్వే చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భారీగా 57.6 శాతం వెనుకబడిన వర్గాలు ఉన్నట్లు సర్వేలో తేలిసింది. సర్వే రిపోర్ట్‌ను ప్రభుత్వ అవసరం కోసం కాబట్టి దానిని ఎవరికీ చూపాల్సిన అవసరం లేదు. సర్వే నివేదికలోని ఎంపరికల్ డేటా ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే విద్య- ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రెండు బీసీ బిల్లులను అసెంబ్లీలో పెట్టింది. బిల్లులు ఎలాంటి వ్యతిరేకత లేకుండా ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. గవర్నర్ వాటిని రాష్ట్రపతికి పంపారు. పంచాయతీరాజ్ చట్టం- 2018లోని 285(ఏ)లో ఉన్న రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న గరిష్ఠ పరిమితిని ఎత్తేసేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. పరిణామక్రమంలో ఆర్డినెన్స్‌ను చట్టరూపంలోకి మార్చేందుకు దాన్ని అసెంబ్లీలో పెట్టారు. ఎలాంటి వ్యతిరేకత లేకుండా ఉభయ సభల ఆమోదం పొందింది. మరో కేసులో రాష్ట్ర ప్రభుత్వాలు పంపే బిల్లులను గవర్నర్, రాష్ట్రపతి మూడు నెలల్లో ఆమోదించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దాని ప్రకారం చూస్తే రాష్ట్రపతి దగ్గర పెండింగులో ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందినట్లే. అవి చట్టాలుగా అమల్లోకి కూడా వచ్చినట్లే భావించాలి. వాటిని మళ్లీ ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదు. అలాగే పంచాయతీరాజ్ సవరణ చట్టం సైతం ఆమోదం కోసం గవర్నర్ దగ్గరకు వెళ్లింది. దానిని గవర్నర్ రాష్ట్రపతికి పంపారు. ఆ సవరణకు మూడు నెలలు నిండకపోయినా అంతకు ముందు 285(ఏ)ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ఇప్పటికీ అమలులో ఉంది. ఆర్డినెన్స్ జారీ చేస్తే అది ఆరు నెలల పాటు అమలులో ఉంటుంది. ఇప్పటికీ ఆర్డినెన్స్ అమలులో ఉంది కాబట్టి 285(ఏ)లో 50 శాతం గరిష్ఠ పరిమితి అమలులో లేదు. అందుకే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేశాం. 2019లో (బీఆర్‌ఎస్ హయాంలో) పంచాయతీరాజ్ చట్టంలో 285 (ఏ)లో 50 శాతం గరిష్ఠ పరిమితి విధిస్తూ చట్టసవరణ చేసినప్పుడు గవర్నర్ వెంటనే ఆమోదించారు. అదే సెక్షన్‌కు ఇప్పుడు సవరణ చేస్తే మాత్రం గవర్నర్ ఆమోదం తెలపకుండా రాష్ట్రపతికి పంపారు. 50 శాతం గరిష్ఠ పరిమితిని చట్టంలో చేర్చడం ఒక వ్యతిరేక చర్య. ఎవరైనా రిజర్వేషన్ అంత ఇస్తాం, ఇంత ఇస్తాం అని చెప్తారే కానీ ఇంతకు మించి ఇవ్వం అని చట్టంలో చేరుస్తారా? అదొక నెగిటివ్ ప్రొవిజన్. ఈ మొత్తం పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బీసీ బిల్లు చట్టాలుగా మారి అమలులో ఉండటంతో పాటు ఆర్డినెన్స్ ద్వారా పంచాయతీరాజ్ సవరణ చట్టం అమలులో ఉంది. స్థానిక సంస్థలు రాష్ట్ర జాబితాలోని అంశం. దానిపై చట్టాన్ని రాష్ట్రపతికి పంపాల్సిన అవసరం ఏముంది? బీసీలకు 2025 లెక్కల ప్రకారం, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా ప్రకారం రిజర్వేషన్ ఇస్తారా ? అని పిటిషనర్లు అడుగుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా లెక్కల ప్రకారమే రిజర్వేషన్ ఇవ్వాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. ఇప్పటికీ 2011 జనాభా లెక్కలే అందుబాటులో ఉన్నాయి కాబట్టి ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారమే రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. బీసీల కులాల లెక్కలు ఎప్పుడూ తీయలేదు. ఇదే తొలిసారి కాబట్టి ప్రస్తుత సర్వే ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. దీనిని వ్యతిరేకించడం సరికాదు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కూడా బీసీ బిల్లులను, రిజర్వేషన్లను వ్యతిరేకించలేదు. ఇది రాష్ట్ర ప్రజల అభీష్టం. దానిని అడ్డుకోలేం. బిల్లుల ఆమోదం ముఖ్యం కాదు. రాష్ట్ర శాసన వ్యవస్థకు శాసన అధికారం(లెజిస్లేటివ్ కాంపిటెన్స్) ఉందా? లేదా? అనేది ముఖ్యం. ప్రస్తుత చట్టాలు చేయడానికి వంద శాతం రాష్ట్ర అసెంబ్లీకి శాసనాధికారం ఉంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై జోక్యం చేసుకోరాదు. అలాగే రాజ్యాంగంలోని 243(ఓ)లో నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల విషయంలో కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని, ఏ వివాదం ఉన్నా ఎన్నికల పిటిషన్‌ల రూపంలో తేల్చుకోవాలని స్పష్టమైన నిర్దేశం ఉంది. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదని స్పష్టమైన తీర్పులు ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే పిటిషన్లు దాఖలైనా సరే జోక్యం చేసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. ఇంద్రసహానీ తీర్పులో పెట్టిన 50 శాతం పరిమితి రాజకీయ రిజర్వేషన్లకు వర్తించదు' అని అడ్వకేట్ జనరల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచే మరో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రవివర్మ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని రాజ్యాంగంలో ఎక్కడా లేదని గుర్తు చేశారు. ఇది కేవలం సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్ మాత్రమేనన్నారు. కే కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం గరిష్ఠ పరిమితికి రాజ్యాంగబద్ధత లేదని చెప్పారు. 15 శాతం కూడా లేని ఇతర కులాలకు 33 శాతం ఓపెన్ క్యాటగిరీ ఉన్నప్పుడు పిటిషనర్లకు అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. వాదనలు విన్న ధర్మాసనం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 9 పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.



24 లక్షల టన్నుల పండ్లు...
84 లక్షల టన్నుల కూరగాయలు!

ఇదీ 2035 నాటికి రాష్ట్ర జనాభాకు సరిపడా నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యం

ప్రస్తుత లోటును భర్తీ చేసేలా ప్రణాళికలు..రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక విడుదల



హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2035 నాటికి ప్రతియేటా 24 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు, 84 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయల ఉత్పత్తి కావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉద్యానశాఖ వెల్లడించింది. భారత వైద్య మండలి సిఫారసుల మేరకు ప్రతి మనిషికి రోజుకు 100 గ్రాముల పండ్లు, 400 గ్రాముల కూరగాయలు అవసరమని, పండ్లు-కూరగాయలు కలిపి రోజుకు అర కిలో తినాలని, ఆ మేరకు రాష్ట్రంలో పండ్లు, కూరగాయల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్ అవసరాలు, ఉద్యాన పంటల ఆవశ్యకత దృష్ట్యా కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం-2035 అభివృద్ధి ప్రణాళికను గురువారం విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ ప్రణాళికలో రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు స్థితిగతులు, ఉత్పత్తి, భవిష్యత్ అవసరాలు, లక్ష్యాల గురించి వివరించారు. రాష్ట్ర ఏర్పాటు నాటికి 2014-15లో రాష్ట్రంలో 3,77,977 ఎకరాల్లో పండ్ల తోటలు ఉన్నాయి. గత ఏడాది (2024-25)కల్లా ఆ విస్తీర్ణం 4,49,265 ఎకరాలకు పెరిగింది. బత్తాయి, నిమ్మ, జామ, దానిమ్మ పంటల విస్తీర్ణం స్వల్పంగా పెరిగినప్పటికీ... వృద్ధి రేటు తక్కువగా నమోదైంది. కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. 2020లో 97,329 ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తే... 2025లో కేవలం 41,625 ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగు చేస్తున్నారు. దీంతో ఉత్పత్తి తగ్గిపోయింది. ప్రతి రోజూ ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో పండ్లు, కూరగాయల ఉత్పత్తి జరగటం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తలు 2035 ప్రణాళిక తయారు చేశారు. ప్రస్తుతం 23.18 లక్షల మెట్రిక్ టన్నుల అవసరం ఉంది. 2030 నాటికి 23.56 లక్షల టన్నులు, 2035 నాటికి 23.74 లక్షల టన్నుల పండ్ల ఆవశ్యకత ఉంటుందని ప్రణాళికలో వెల్లడించింది. కూరగాయల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఏడాదికి 81.49 లక్షల మెట్రిక్ టన్నుల అవసరం ఉంది. 2030 నాటికి 82.43 లక్షల టన్నులు, 2035 నాటికి ఏడాదికి 83.47 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయల అవసరం ఉంటుందని ప్రణాళికలో పేర్కొన్నారు. ఈ ప్రణాళిక ప్రకారం 2030 నాటికి పండ్ల తోటల విస్తీర్ణం 1.32 లక్షల ఎకరాలు, కూరగాయల విస్తీర్ణం 2.45 లక్షల ఎకరాలు పెంచటం ద్వారా దిగుబడి, ఉత్పత్తి పెరుగుతుందని, దిగుమతులు తగ్గుతాయని వెల్లడించింది. ఐదేళ్లలో రూ.921 కోట్ల సాగు పెట్టుబడి, రూ.942 కోట్ల వ్యయంతో డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం కల్పించడం ద్వారా ఒక రూపాయి పెట్టుబడి పెడితే, నాలుగు రూపాయల ఆదాయం వస్తుందని ప్రణాళికలో పేర్కొన్నారు.

ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ

ఇతర రాష్ట్రాల్లో పండ్లు, కూరగాయల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. మొత్తం సాగు విస్తీర్ణంతో చూస్తూ తమిళనాడులో 18.96 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 18.60 శాతం, కర్ణాటకలో 20.36 శాతం, కేరళలో 71.06 శాతం విస్తీర్ణంలో ఈ ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. తెలంగాణలో మాత్రం 6 శాతమే ఉంది. రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు, సాగు భూముల దృష్ట్యా ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచటానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ రైతులు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. రాష్ట్రంలో కేవలం 37,205 మంది రైతులే కూరగాయలు సాగుచేస్తున్నారు.

సామాజిక న్యాయంతో
ఎన్నికలకు వెళ్తాం!

- **42% రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం**
- **బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్**
- **రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు: వాకిటి**
- **బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి బీసీలకు అన్యాయం చేశాయి: జూపల్లి**



హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయానికి చాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయంతో ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుదలపై హైకోర్టు స్టే ఇచ్చిన అనంతరం గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల కాపీ పరిశీలించిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వం తరఫున హైకోర్టులో బలమైన వాదనలు వినిపించినట్లు చెప్పారు. న్యాయస్థానం స్టే విధిస్తుందని అనుకోలేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరపకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు హైకోర్టులో వేసిన కేసులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదో బీసీలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, 42% రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేదే లేదని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. బీసీలెవరూ అధైర్యపడవద్దన్నారు. రిజర్వేషన్లకు ఎవరు అడ్డుపడుతున్నారో తెలంగాణ సమాజం ఆలోచన చేయాలని కోరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి బీసీలకు అన్యాయం చేస్తున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఆ రెండు పార్టీలు కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో కేసులు వేయించింది బీఆర్‌ఎస్ అని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



పార్టీ పరంగా బీసీలకు 42% రిజర్వేషన్లు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంపీ మల్లు రవి చెప్పారు. అయితే కాంగ్రెస్‌తో పాటు అన్ని పార్టీలూ అధికారికంగా 42% రిజర్వేషన్ ఇచ్చేలా తాము ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. జీవో 9పై హైకోర్టు స్టే ఇవ్వడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థను పక్కన పెట్టినట్టుగా భావించాల్సి ఉంటుందన్నారు. బీసీ కులగణన ద్వారా ప్రతి కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులను సీఎం రేవంత్ తెలుసుకున్నారని, హైకోర్టు తీర్పుతో వారి అభివృద్ధికి అడ్డుకట్ట వేసినట్లయిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. న్యాయ పోరాటం చేసి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే స్టే

- **బీసీ రిజర్వేషన్లపై వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలి**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శ**

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు జీవోపై హైకోర్టు స్టే ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుపై నిర్ణయం తీసుకోవడానికి గవర్నర్‌కు మూడు నెలల సమయం ఉంటుందని, అది ముగియకముందే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారని ఆరోపించారు. ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలోనే చూసి, బీసీల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆరోపించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు 'బీజేపీ అడ్డుకుంటోంది' అనే దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీసీలకు 42% రిజర్వేషన్లకు బీజేపీ పూర్తిగా మద్దతు ఇస్తూ, దానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42% రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లు వేసిందే కాంగ్రెస్ పార్టీకి చెందినవారని రాంచందర్‌రావు ఆరోపించారు. '9'తో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో భూస్థాపితం కాబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బీసీలకు చేసిన ద్రోహానికి గాను ఆ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని తేల్చిచెప్పారు. 'సోనియా పుట్టిన రోజు అంటూ ప్రత్యేక తెలంగాణపై 2009 డిసెంబరు 9న ప్రకటన చేసిన కాంగ్రెస్.. యూ టర్న్ తీసుకుంది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెప్పారు. అయినా బుద్ధి రాలేదు. ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరుతో జీవో '9' పేరిట మోసం చేయాలని చూసింది. కానీ, హైకోర్టు ఈ జీవోపై స్టే ఇచ్చింది. కోర్టు స్టే ఇచ్చింది కూడా 9వ తేదీనే కావడం గమనార్హం. ఆ 9వ నంబరే కాంగ్రెస్ మెడకు చుట్టుకోబోతోంది' అని సంజయ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో చరిత్ర పునరావృతం కాబోతోందని, కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవడం ఖాయమని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం నిర్వహించాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో గ్రామీణ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కోర్టు తీర్పుకు లోబడే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.



ఇలా మొదలైన నామినేషన్లు
అలా బ్రేకేసిన హైకోర్టు!

ఉదయాన్నే నోటిఫికేషన్లు ఇచ్చిన కలెక్టర్లు.. 119మంది అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

స్టే రావడంతో ఎన్నికల ప్రక్రియ నిలిపివేత.. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన



హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన 9వ నంబర్ జీవో మీద స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఎన్నికల షెడ్యూల్ నిలిచిపోయింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కమిషనర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటన జారీ చేసింది. అయితే, సెప్టెంబరు 29న జారీచేసిన షెడ్యూల్ మేరకు పలు జిల్లాల్లో కలెక్టర్లు నోటిఫికేషన్లు జారీ చేశారు. దాంతో కొంతమంది ఔత్సాహికులు నామినేషన్లు కూడా వేశారు. ఈ నేపథ్యంలో సదరు నోటిఫికేషన్లను నిలిపివేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి నోటిఫికేషన్‌లు వచ్చేవరకు ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దాంతో నామినేషన్లకు బ్రేక్ పడింది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అనుసరించాల్సిన విధానాలపై ఎస్ఈసీ కమిషనర్ సంబంధిత విభాగాలతో సమీక్షించారు. హైకోర్టు సూచనలతో పాటు ఎన్నికల ప్రక్రియపై ఏం చేయాలన్న దానిపై కూడా న్యాయ నిపుణులను సంప్రదించినట్లు తెలుస్తోంది. వారి సూచనల మేరకే ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయడమే కాకుండా, కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఈసీ గెజిట్‌ను సిద్ధంచేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం చూపే పరిష్కారాలను బట్టి ఎన్నికలపై ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకొంటామని ఎన్నికల సంఘం విభాగాలు తెలిపాయి. ఎన్నికలు ఎప్పుడు జరుపుతారు? ప్రభుత్వం ఏమైనా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతుందా? అన్న దానిపై రాజకీయ వర్గాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో చర్చ కొనసాగుతోంది. ఏడాదిన్నర తర్వాత స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధపడినప్పటికీ కోర్టు తీర్పుతో బ్రేక్ పడటం ఆశావహులను నిరాశకు గురిచేసింది. పూర్తి విచారణకు హైకోర్టు ఆరువారాల గడువు విధించిన నేపథ్యంలో న్యాయస్థానం తీసుకొనే తదుపరి నిర్ణయాన్ని బట్టి స్థానిక సంస్థల ఎన్నికల భవితవ్యం తేలనుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాల భర్తీ కోసం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం గత నెల 29న షెడ్యూల్ విడుదల చేసింది. తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం పలు జిల్లాల కలెక్టర్లు గురువారం నోటిఫికేషన్ జారీ చేయడంతో పలు మండలాల్లో కొందరు నామినేషన్లు వేశారు. జెడ్పీటీసీ స్థానాలకు 16 మంది, ఎంపీటీసీ స్థానాలకు 103 మంది తొలి రోజు నామినేషన్లు దాఖలు చేశారు. కోర్టులో విచారణ నేపథ్యంలో తొలిరోజు నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు చాలామంది సిద్ధపడలేదు.

బీసీలకు కాంగ్రెస్, బీజేపీ వెన్నుపోటు



- **బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టకుండా రాష్ట్రంలో కాంగ్రెస్.. బీసీ బిల్లును ఆమోదించకుండా కేంద్రంలోని బీజేపీ.. బీసీలకు వెన్నుపోటు పొడిచాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆ రెండు జాతీయ పార్టీలకు బీసీలపట్ల చిత్తశుద్ధి లేదని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జీవో న్యాయస్థానాల్లో నిలబడదని, కేవలం బీసీలకు మభ్యపెట్టేందుకు తీసుకొచ్చారని బీఆర్‌ఎస్ చెప్పిన మాట అక్షరాలా నిజమయిందని స్పష్టం చేశారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ పేరిట కొంతకాలం హంగామా చే సిన కాంగ్రెస్.. కులగణన నుంచి రిజర్వేషన్ల జీవో వరకు చేసిందంతా.. మోసమేనని అన్నారు. తన పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన ప్రజా వ్యతిరేకతను చూసి రేవంత్‌రెడ్డి భయంతో వణికిపోతున్నారని, అందుకే స్థానిక ఎన్నికలను వివాదంగా మార్చి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పల్లెల్లో పాలన పడకేసి ప్రజలు అవస్థలు పడుతున్నారని, కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

6 గ్యారెంటీల్లాగానే రేవంత్ బీసీ రిజర్వేషన్ల డ్రామా

- **మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు**



అధికారం కోసం ఆరుగ్యారెంటీల హామీల్లాగానే.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలాడుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదేవిధంగా లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం కోసం కేంద్రంతో కొట్లాడాల్సిన రేవంత్‌రెడ్డి, గల్లీలో కొట్లాడుతున్నట్లు 22 నెలలుగా డ్రామాలు చేశారు తప్ప.. ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని ఆయన విమర్శించారు. తూతూ మంత్రంగా ఓ జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారని అన్నారు. రిజర్వేషన్ల కోసం పోరాటంలో అఖిలపక్షాలను భాగస్వామ్యం చేయాలని, ఢిల్లీ వేదికగా యుద్ధ భేరి మోగించాలని పేర్కొన్నారు. బీసీలపట్ల కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చెల్లని జీవో తెచ్చి సీఎం రేవంత్ రెడ్డి బీసీలను మోసగించారని బీఆర్‌ఎస్ నేతలు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, కేవీ వివేకానంద ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే చట్టపరమైన లొసుగులు సృష్టించి స్థానిక ఎన్నికలు నిలిచిపోయేలా చేశారని మండిపడ్డారు.

మిత్రులారా.. గుండెకు
స్టంట్ వేసుకోవాలి.. అప్పు ఇవ్వండి

- **పదవీ విరమణ ప్రయోజనాలు అందలేదు**
- **ఉద్యోగుల జేఏసీకి విశ్రాంత ప్రభుత్వోద్యోగి లేఖ**

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ఓ ప్రభుత్వోద్యోగి ఉద్యోగుల జేఏసీకి రాసిన ఓ లేఖ చర్చనీయాంశంగా మారింది. తన గుండెజబ్బుకు, తన భార్య మోకాళ్ల చికిత్సకు, ఇల్లు కట్టుకోవడానికి, కుమారుడి పెళ్లికి డబ్బు కావాలని, పదవీ విరమణ ప్రయోజనాలు అందగానే తిరిగి చెల్లిస్తానని చెప్పినా.. ఎవరూ అప్పు ఇవ్వడం లేదని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. కొత్తగూడెం ఐటీఐలో సూపరింటెండెంట్‌గా పని చేసి ఈ ఏడాది మార్చి 31న పదవీ విరమణ చేసిన కంభంపాటి శ్రీనివాసరావు తన ఆవేదనను ఉద్యోగ సంఘం నేతల ముందుంచారు. ఆరు నెలలు దాటినా తనకు పదవీ విరమణ ప్రయోజనాలు అందలేదన్నారు. తన జీపీఎఫ్ ఖాతాలో ఉన్న నగదు, 300 రోజుల ఈఈఎల్, డీఏ, పీఆర్సీ బకాయిలు, 2024లో సరెండర్ చేసిన ఈఎల్ నగదు ఇవ్వలేదని తెలిపారు. అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. తొలిసారి గుండెపోటు వస్తే ఒక స్టంట్ వేశారని, వెన్నుపూసకు ఓపెన్ సర్జరీ జరిగిందని లేఖలో వివరించారు. ఈ నేపథ్యంలో పలుమార్లు గుండెపోటు రాగా మరో స్టంట్ వేయాలని వైద్యులు సూచించారన్నారు. తన వైద్యం, కుమారుడి వివాహం, ఇంటి నిర్మాణం, భార్య మోకాళ్ల చికిత్సకు అవసరమైన నగదు కోసం ఎవరిని అడిగినా అప్పు ఇవ్వడం లేదని తెలిపారు. పదవీ విరమణ చేసే ఉద్యోగుల మనోవేదనను జేఏసీ నేతలు దృష్టిలో పెట్టుకుని వారి ప్రయోజనాలను ఎన్నికల కోడ్‌తో ముడిపెట్టకుండా, జాప్యం లేకుండా వెంటనే ఇప్పించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తక్షణం ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయండి

- **సీఎస్ రామకృష్ణారావుకు టీజీఈజేఏసీ విజ్ఞప్తి**

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల చికిత్సలకు 'ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్)'ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) ప్రభుత్వాన్ని కోరింది.

టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, వంగ రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, కట్కం రమేష్, ముజీబ్ హుస్సేన్ తదితరులు గురువారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈహెచ్‌ఎస్ విధివిధానాలను ఖరారు చేయడంతోపాటు దాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఇదివరకే సర్కారు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు వెంటనే ఒక కరువు భత్యాన్ని (డీఏ) విడుదల చేయాలని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను సమావేశపరిచి ఉద్యోగుల ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

హైకోర్టు స్టేతో తీవ్ర నిరాశ:కూనంనేని

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు సంబంధించి హైకోర్టు స్టే ఇవ్వడం తీవ్ర నిరాశకు గురి చేసిందని, బీసీలకు అందించే రిజర్వేషన్లలో జాప్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో బీజేపీతో సహా అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని.. చట్టబద్ధత కల్పించేందుకు కేంద్రానికి పంపితే పెండింగ్‌లో పెట్టిందని ఓ ప్రకటనలో ఆక్షేపించారు. కేంద్రం స్పందించకపోవడం వల్లే కోర్టు స్టే ఇచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీ రాష్ట్ర నేతలు ఇప్పటికైనా చొరవ తీసుకుని బిల్లును ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద హైకోర్టు స్టే విధించడానికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బీజేపీని గద్దె దింపేందుకు సామాజిక న్యాయం కోరే ప్రజాస్వామిక వాదులంతా పోరాటానికి సిద్ధం కావాలని ఓ ప్రకటనలో కోరారు.

హైకోర్టు స్టేపై నేడు నిరసనలు: జాజుల

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా పెంచిన బీసీ రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడానికి నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలు డ్రామాలాడుతున్నాయని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించి ఉంటే హైకోర్టులో స్టే కు అవకాశం ఉండేది కాదన్నారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్రంలోని బీజేపీ బాధ్యత తీసుకోవాలనే తమ డిమాండ్‌ను ఖాతరు చేయడం లేదని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లను పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని బీజేపీ నేతలు బీసీ సమాజాన్ని తప్పుదోవ పట్టించారని విమర్శించారు. శుక్రవారం జరిగే ఆందోళనల్లో పార్టీలకు అతీతంగా బీసీలు పాల్గొనాలని జాజుల పిలుపునిచ్చారు. రాజ్యాంగ సవరణ జరగకుండా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు సాధ్యం కావని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టకుండా జీవో జారీ చేసి తమ పని అయిపోయిందని భావించటం అన్యాయమని జూలూరు గౌరీ శంకర్ విమర్శించారు.

కలెక్టర్ ఆదేశాలే పాటించా..!

- డీపీవో, డీఆర్‌డీఏ ఫైల్స్ మాత్రమే పరిశీలించా
- ఇతర శాఖల్లో జోక్యం చేసుకోలేదు.. ధరణి ఫైల్స్ రాలే
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి వరంగల్ జడ్పీ సీఈవో రాంరెడ్డి వివరణ

వరంగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జడ్పీ సీఈవోగా, పంచాయతీరాజ్ శాఖకు సీనియర్ మోస్ట్ అధికారిగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే డీపీవో, డీఆర్‌డీఏ నుంచి వచ్చిన ఫైళ్ల మాత్రమే తాను తనిఖీ చేశానని వరంగల్ జడ్పీ సీఈవో రాంరెడ్డి తెలిపారు. 'షాడో కలెక్టర్‌గా జడ్పీ సీఈవో' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. డీపీవో, డీఆర్‌డీఏ నుంచి వచ్చిన ఫైళ్లను తనిఖీ చేసి వాటిని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పరిశీలనకు పంపించానని తెలిపారు. తాను ఏ ఫైల్‌ని నేరుగా కలెక్టర్‌కు పంపించలేదని చెప్పారు. అలాగే తాను ఇతర శాఖకు సంబంధించిన ఏ ఫైలుపై కూడా సంతకం చేయలేదని తెలిపారు. సీనియర్ అధికారిగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు పంచాయతీరాజ్ శాఖ సమావేశాలకు, సమీక్షలకు మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఆరోగ్య, వైద్య శాఖలపై తాను సమీక్షించలేదని, డీఎంహెచ్‌వో, డీడబ్ల్యూవోతో కలిసి కలెక్టర్ నిర్వహించే సమావేశాల్లో ఒకసారి మాత్రమే పాల్గొన్నానని అంగీకరించారు. పూర్వ డీఆర్‌డీవో కౌసల్యదేవి తన కంటే సీనియర్ కాదని, ఆమె డిప్యూటీ సీఈవో కేడర్‌లోనే ఉన్నారని వివరించారు. ఇన్‌చార్జీ డీఆర్‌డీఏగా కలెక్టర్ తనను నియమించలేదని, ప్రభుత్వమే అదనపు బాధ్యతలు అప్పగించిందన్నారు. ధరణికి సంబంధించిన ఏ ఫైల్ కూడా తన వద్దకు రాలేదని, అది రెవెన్యూ శాఖకు సంబంధించిన అంశమని జడ్పీ సీఈవో రాంరెడ్డి వివరణ ఇచ్చారు.

కార్యకర్తల విజయానికి కృషి చేస్తా

- బీజేపీని గెలిపిస్తేనే గ్రామాలకు నిధులు
- టికెట్లు ప్రకటించేది రాష్ట్ర నాయకత్వమే
- పార్టీ శ్రేణులతో బండి సంజయ్



భగత్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తనను ఎంపీగా గెలిపించింది కార్యకర్తలేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వాళ్లను గెలిపించేందుకు కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. తాను పూర్తిస్థాయి సమయం కేటాయించి, ప్రచారం చేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ శ్రేణులతో స్థానిక ఎన్నికలపై ఆయన గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'నాకు గ్రూపులేవు, నాది బీజేపీ వర్గమే' అని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో బీజేపీని గెలిపించుకోవాలన్నారు. టికెట్లు ప్రకటించేది రాష్ట్ర నాయకత్వమే అని, ఈ విషయంలో తన ప్రమేయం ఉండదని చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన సర్వేలన్నీ బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. సర్వే నివేదికలు, గెలుపే ప్రాతిపదికగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థులను ప్రకటిస్తుందన్నారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని తెలిపారు.

గ్రూప్-1 నియామకాలు రద్దు చేయాలి

- నేడు అశోక్ నగర్ చౌరస్తాలో వంటా వార్పు: ఎమ్మెల్సీ కవిత

పంజాగుట్ట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 విషయంలో నోటిఫికేషన్ నాటి నుంచి ఫలితాల వరకు అడుగడుగునా తప్పులు జరిగాయని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. గ్రూప్-1 పోస్టుల నియామకాలను రద్దు చేసి తిరిగి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రూప్- 1 నిరుద్యోగ అభ్యర్థులకు మద్దతుగా అశోక్‌నగర్ చౌరస్తాలో శుక్రవారం వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అశోక్, ప్రభాకర్, నిరుద్యోగులు, జాగృతి నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అశోక్‌నగర్‌కు వచ్చి నిరుద్యోగ అభ్యర్థులకు మాయమాటలు చెప్పి దొంగ ప్రమాణాలు చేశారని, రెండేళ్లుగా ఆయన హైదరాబాద్‌కు రాకుండా పారిపోయారని విమర్శించారు. నిరుద్యోగులతరపున తాము కొట్లాడుతామని, అందరూ పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గాంధీభవన్‌లో బీజేపీ, బీఆర్‌ఎస్ నేతల పోస్టర్ల దగ్ధం

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ల పోస్టర్లను కాంగ్రెస్ బీసీ నేతలు దగ్ధం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్.. బీసీ వ్యతిరేక పార్టీలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల పట్ల బీజేపీ, బీఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్లకు అనుకూలంగా కేసులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆ రెండు పార్టీలూ అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను ఛేదిస్తామని చెప్పారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.. గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

400 కోట్లతో ఎలక్ట్రిక్ బస్సు చార్జింగ్ స్టేషన్లు

వచ్చే రెండేళ్లలో హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు లోపల 2800 ఎలక్ట్రిక్ బస్సుల్ని నడపాలని లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ ఆర్టీసీ రూ.400 కోట్ల వ్యయంతో డిపోల్లో చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. జిల్లాల్లోని డిపోల్లో కూడా చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 3200 డీజిల్ బస్సులు నడుస్తున్నాయి. డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సుల వాడకం వల్ల నిర్వహణ వ్యయం భారీగా తగ్గనుంది. డీజిల్ బస్సుకు ప్రతి కిలోమీటర్‌కు రూ.20 వరకు ఖర్చు అవుతుండగా ఎలక్ట్రిక్ బస్సుకు రూ.6 మాత్రమే ఖర్చు అవుతుంది.

రేపట్నుంచి డీసీసీల నియామక ప్రక్రియ షురూ!

జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లకు అధ్యక్షుల నియామక ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియలో భాగంగా జిల్లా స్థాయి ముఖ్య నేతల అభిప్రాయాలను సేకరించి నివేదిక ఇచ్చేందుకు 22 మంది పరిశీలకులను ఏఐసీసీ నియమించిన సంగతి తెలిసిందే. ఆ 22 మంది శనివారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటనకు వారు వెళ్లనున్నారు. వారం రోజుల పాటు జిల్లా స్థాయి నాయకుల అభిప్రాయాలు తీసుకుని ఆయా జిల్లాలకు డీసీసీల ఎంపికకు సంబంధించి సమగ్ర నివేదికను వారు రూపొందిస్తారు. ఆ నివేదికను పరిశీలించి డీసీసీ అధ్యక్షులను అధిష్ఠానం నియమించనుంది.

బొంతు రామ్మోహన్‌కు టికెటిస్తే బాగుంటుంది

- బీజేపీ నాయకత్వానికి ఎంపీ అర్వింద్ ప్రతిపాదన
- బీజేపీ అంతర్గత చర్చతో సంబంధం లేదన్న బొంతు

హైదరాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ టిక్కెట్టును కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు ఇస్తే బాగుంటుందని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ప్రతిపాదన చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావును కలుసుకున్న ఆయన బొంతు రామ్మోహన్‌కు ఏబీవీపీ నేపథ్యం ఉందన్నారు. అయితే ఉప ఎన్నికలో ఎవరిని నిలబెట్టాలన్న అంశంపై త్రిసభ్య కమిటీ తన నివేదికను ఇప్పటికే అందజేసింది. టిక్కెట్టు ఆశిస్తున్న ఐదుగురు ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకోవడంతో పాటు స్థానిక నాయకుల నుంచి కమిటీ అభిప్రాయ సేకరణ చేసింది. వీరిలో ముగ్గురి పేర్లను జాతీయ నాయకత్వానికి నివేదించినట్లు సమాచారం. పార్టీ అభ్యర్థి ఎవరనే విషయంపై నేడో, రేపో అధికారిక ప్రకటన రానుంది. ఈ తరుణంలో అర్వింద్ తాజా ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది.

కాంగ్రెస్‌లో సంతృప్తిగా ఉన్నా: బొంతు రామ్మోహన్

మరోవైపు బీజేపీలో జరిగిన అంతర్గత చర్చతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని బొంతు రామ్మోహన్ స్పష్టం చేశారు. తాను బీజేపీ నుంచి పోటీ చేస్తాననడం వాస్తవం కాదన్నారు. తాను కాంగ్రెస్‌లో సంతృప్తిగా ఉన్నానని ఆయన తేల్చి చెప్పారు.

చైనా ప్లస్ 1 వ్యూహానికి
తెలంగాణ అత్యుత్తమ ఎంపిక



అమెరికా ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలను స్వీకరిస్తోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అమెరికా తీసుకునే నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో, ఇండో-యూఎస్ సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. హెచ్1-బీ వీసాలపై అమెరికా విధించిన కఠిన నిబంధనలపైన, సుంకాల పెంపుపైన సీఎం ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావం చే యడంతో పాటు అస్థిరతకు, అపార్థానికి దారి తీస్తాయన్నారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. అలాగే చైనా+1 (చైనాతోపాటు మరో దేశంలో ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించే) వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ఎంపికగా నిలుస్తుందని రేవంత్ పేర్కొన్నారు. దానికోసం భవిష్యత్తు ప్రణాళికలను తమ ప్రభుత్వం రూపొందిస్తోందన్న ఆయన.. ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా, ప్రపంచ నగరంగా ఇప్పటికే హైదరాబాద్ అందరినీ ఆకర్షిస్తోందన్నారు. అందుకే దేశ, విదేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, సియోల్‌తో పోటీ పడుతోందన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని.. అందులో భాగంగానే హైదరాబాద్‌లో గేమ్-చేంజర్‌గా నిలిచే ప్రాజెక్టులను చేపడుతున్నామని వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు రీజినల్ రింగ్‌రోడ్, రీజినల్ రింగ్ రైల్, డ్రై పోర్ట్, మాన్యుఫాక్చర్ జోన్లను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్‌సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తున్నామన్నారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని.. మొత్తం 500 కంపెనీలు ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు రావాలని ఆకాంక్షించారు. ఇక.. హైదరాబాద్‌లో ఏఐ సిటీతో పాటు, ఏఐ వర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచన ఉందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఏఐ రంగంలో రాష్ట్రాన్ని దేశానికే రాజధానిగా తీర్చిదిద్దేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

సుప్రీం తీర్పు మేరకు
బీసీ బిల్లును ఆమోదించినట్లే!

- రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టం అయినట్లే
- అందుకే బీసీలకు రిజర్వేషన్లపై జీవో ఇచ్చాం
- 42% రిజర్వేషన్లను అడ్డుకున్నదే బీజేపీ, బీఆర్ఎస్
- ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క
- ఉత్తర్వులు పరిశీలించాక కార్యాచరణ: మహేశ్‌గౌడ్



మీడియాతో మాట్లాడుతున్న భట్టి, చిత్రంలో పొన్నం, మహేశ్‌గౌడ్, వాకిటి

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పును అనుసరించే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేశామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. "స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ మార్చి 17, 2025న ఏకగ్రీవంగా ఆమోదించి పంపిన బిల్లు రాష్ట్రపతి వద్ద ఇంకా పెండింగ్‌లోనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపితే మూడు నెలల్లోపు దాన్ని ఆమోదించాలి. లేదా తిప్పి పంపాలి. అలా తిప్పి పంపకుంటే ఆ బిల్లు ఆమోదం పొందినట్లేనని తమిళనాడు వర్సెస్ గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు ఏప్రిల్ 8, 2025న పేర్కొంది. ఆ ఆదేశాల మేరకు.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొంది, చట్టం అయినట్లే. ఆ చట్టం ప్రకారమే స్థానిక ఎన్నిలకు రిజర్వేషన్లపై జీవో జారీ చేశాం" అని భట్టి పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే శాస్త్రీయంగా ప్రక్రియను నిర్వహించి, జీవో జారీ వరకూ వచ్చామని తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి భట్టి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లు రాకుండా అడ్డుకున్నదే బీజేపీ, బీఆర్ఎస్‌లని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టం చేసిందని, ఆ చట్టమే బీసీల రిజర్వేషన్లకు ఉరితాడైందని చెప్పారు. అలాగే బీసీ బిల్లులను పెండింగ్‌లో పెట్టింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మడానికి బీసీలు అమాయకులేమీ కాదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఓబీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించడానికి ప్రభుత్వం వద్ద సమగ్ర సమాచారం ఉండాలని తెలిపారు. 2019లో పంచాయతీరాజ్ ఎన్నికల తర్వాత తగినంత సమయం ఉన్నా.. సమగ్ర సమాచారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కులగణన సర్వే ఎందుకు చేయలేదని నిలదీశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్రంలో ఓబీసీలు ఎంతమంది ఉన్నారన్న లెక్క తేల్చడానికే తాము కులగణన సర్వే చేశామన్నారు. సర్వే సమాచారాన్ని శాసనసభలో పెట్టి.. దాని ఆధారంగా బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ రూపొందించిన బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారని గుర్తుచేశారు. ఆ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి వద్దకు పంపితే పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను బీసీలు క్షమించరని చెప్పారు. కాగా, హైకోర్టు స్టే ఉత్తర్వులను అధ్యయనం చేసిన తర్వాత, సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ చెప్పారు.

నేడు మంత్రులతో సీఎం రేవంత్ భేటీ?

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వ పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు. ఈ కేసులో తుది తీర్పు వచ్చే వరకూ ఎదురు చూడాలా? లేక స్టేను ఎత్తివేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలా? అన్నదానిపై న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నారు. హైకోర్టు స్టే ఉత్తర్వులను పూర్తిగా అధ్యయనం చేసి, తదుపరి చర్యలకు ఉన్న అవకాశాలను వివరించాల్సిందిగా నిపుణులను కోరినట్లు తెలిసింది. వారి సూచనల ఆధారంగా తదుపరి కార్యాచరణ నిర్ణయించడానికి శుక్రవారం సీఎం రేవంత్ మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

బీసీలకు తీరని అన్యాయం: ఆర్. కృష్ణయ్య

చార్మినార్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంఘం నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక ఎన్నికలను వాయిదా వేయడమనేది సుప్రీంకోర్టు ఆదేశాలకు వ్యతిరేకమని చెప్పారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని, బీసీల హక్కులకు విఘాతం కలిగించిందన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. బీసీల నోటి కాడి ముద్దను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై గురువారం హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో హైకోర్టు నాలుగో గేటు వద్ద బీసీ సంఘాల నేతలతో కలసి ఆర్.కృష్ణయ్య రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారికి నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

మహిళా జడ్జిని దుర్భాషలాడిన వ్యాపారి!

- కారులో వెళుతుండగా చంచల్‌గూడ వద్ద ఘటన
- స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనాన్ని స్లో చేయడంతో వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టిన వ్యాపారి
- ఆపై తిట్లు.. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

సైదాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా జడ్జి ప్రయాణిస్తున్న కారును బైక్‌తో వెనుక నుంచి ఢీ కొట్టడమే కాకుండా ఆ వాహనాన్ని అడ్డగించి.. ఆమెను తీవ్రస్థాయిలో దుర్భాషలాడాడో వ్యాపారి. మాదన్నపేట పరిధిలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. సోమవారం రాత్రి 9.55 గంటలకు నాంపల్లి కోర్టు 17వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మహిళా మేజిస్ట్రేట్ విధులు ముగించుకుని కారులో ఇంటికి బయలుదేరారు. చంచల్‌గూడ జైలు రోడ్డులో యాకుత్‌పుర బాగే ఈ జహారాకు చెందిన మహ్మద్ ఖలీం ఉల్లా (56) అనే వ్యాపారి బైక్‌పై దూసుకొచ్చి కారుకు అడ్డంగా నిలబెట్టాడు. అనంతరం.. కారు వెనుక డోరును బలంగా బాదాడు. డ్రైవర్ జి.స్వామి(38) కారులో జడ్జి ఉన్నారని, డోరు ఎందుకు కొడుతున్నావంటూ ఖలీంను ప్రశ్నించాడు. మరింత రెచ్చిపోయిన ఖలీం ఉల్లా బూతులు తిట్టసాగాడు. అతడిని అడ్డుకునేందుకు డ్రైవర్ యత్నించగా తీవ్రస్థాయిలో బెదిరించాడు. ఈ ఘటనతో మహిళా జడ్జి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలోనే.. కోర్టులో విధులు నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ మన్సూర్ అహ్మద్ అక్కడికి వచ్చారు. కారులో సీనియర్ మెజిస్ట్రేట్ ఉన్నారని, అసభ్యకరమైన భాషలో తిట్టడం ఆపాలని వ్యాపారిని కోరారు. అయితే వ్యాపారి ఇంకా రెచ్చిపోయి పరుషపదాలతో దూషించాడు. ఈ ఘటనపై డ్రైవర్ స్వామి.. మాదన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బైక్ నంబర్ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.

సంస్కరణల సంఘం..
మాకేం సంబంధం?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ సంస్కరణలపై ఉన్నతస్థాయి కమిటీ
- ఏర్పాటు చేస్తామని నెల క్రితం మంత్రుల ప్రకటన
- సీఎస్ ఆదేశాలిచ్చినా జీవో విడుదలపై ఆర్థిక, విద్యాశాఖ కార్యదర్శుల నిర్లక్ష్యం
- తమ పరిధిలోని అంశం కాదంటూ తప్పించుకునే యత్నం

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ సంస్కరణలపై వెంటనే ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించి నెలరోజులు దాటుతున్నా ఆర్థిక, విద్యాశాఖ కార్యదర్శులు దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంజినీరింగ్ ఎప్‌సెట్‌లో 10 వేల లోపు ర్యాంకు వచ్చిన వారందరికీ ప్రస్తుతం ఫీజు రియింబర్స్‌మెంట్ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఉన్నత వర్గాలు, ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులే పెద్దసంఖ్యలో ఉన్నారు. దీని వల్ల ఏటా ప్రభుత్వ ఖజానాపై రూ.500 కోట్లకు పైగా భారం పడుతోంది. ఈ నేపథ్యంలో.. ర్యాంకు ఆధారంగా కాకుండా, ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఫీజు రీయింబర్స్ చేసేలా మార్పులు చేస్తే ఏడాదికి రూ.500 కోట్లకు పైగా ఆదా అవుతుందని.. గతంలో ఉన్నత విద్యామండలి నిర్వహించిన ఓ అధ్యయనంలో తేలింది. ఈ క్రమంలోనే.. దీనిపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం, మంత్రులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో.. సంస్కరణల సంఘం పేరుతో కమిటీ ఏర్పాటుకు జీవో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆర్థిక, విద్యాశాఖ కార్యదర్శులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. మరోవైపు.. రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. అయినా ఈ అంశంపై స్పందించేందుకు ఆర్థిక, విద్యా శాఖల కార్యదర్శులు ఆసక్తి చూపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇది విద్యాశాఖకు చెందిన అంశం కాబట్టి జీవో విడుదల తమ పరిధిలోకి రాదని ఆర్థికశాఖ కార్యదర్శి పేర్కొంటున్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సంక్షేమ శాఖలకు సంబంధించిన అంశం కాబట్టి.. తమ పరిధిలోకి రాదని విద్యాశాఖ కార్యదర్శి అంటున్నారు. సీఎస్ సమక్షంలో దీనిపై మూడుసార్లు సమావేశం జరిగినా జీవో విడుదల అంశం ఓ కొలిక్కి రాలేదు. కాగా.. సంస్కరణ సంఘం కమిటీ ఏర్పాటైతే.. ఫీజు రియింబర్స్‌మెంట్‌తోపాటు ఉన్నత విద్యకు సంబంధించిన అనేక సమస్యలపై ఆ కమిటీ చేసే సిఫారసుల ఆధారంగా ఒక నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

5,586 కి.మీ రోడ్ల అభివృద్ధి



- తొలి దశలో 10,986 కోట్లతో పనులు
- హ్యామ్‌లో చేపట్టనున్న ఆర్అండ్‌బీ
- మూడేళ్లలో అద్దంలా రోడ్లు: కోమటిరెడ్డి
- ట్రాఫిక్ సర్వే ప్రకారమే హ్యామ్ రోడ్లు: భట్టి



ఆర్అండ్‌బీ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(హ్యామ్)లో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించిన రహదారుల లెక్కలు ఎట్టకేలకు తేలాయి. ఇప్పటికే రెండుసార్లు మార్పులు చేసినా, అడుగుపడలేదు. గురువారం ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సచివాలయంలో హ్యామ్ రోడ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సర్వే ప్రకారం అవసరమైన చోట రోడ్లను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. దాని ప్రకారమే జాబితాను సిద్ధం చేశామని అధికారులు తెలపడంతో గురువారం ఆ జాబితాకు ఆమోదముద్ర పడింది. ఫలితంగా రాష్ట్రంలో ఆర్ అండ్ బీ పరిధిలో మొదటి దశలో రూ.10,986 కోట్లతో, 5,587 కి.మీ మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. వీటిలో ఒకటి, రెండు వరుసల రోడ్లు దాదాపు 3,792 కి.మీ ఉండగా.. వాటి కోసం రూ.4,416 కోట్లు, అలాగే మరో 1,795 కి.మీ మేర రోడ్లను రూ.6,569 కోట్లతో వెడల్పు చేయనున్నారు. వీటి ద్వారా మండల కేంద్రాల నుంచి జిల్లాలకు రెండు వరుసలు, జిల్లాల నుంచి రాష్ట్ర రాజధానికి 4 వరుసల రోడ్లను నిర్మించనున్నారు. హ్యామ్ విధానంలో రాష్ట్రంలోని రోడ్లకు మహర్దశ పట్టనుందని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోని రోడ్లను అద్దంలా తయారు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రోడ్ల నిర్మాణంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని.. మండలం, నియోజకవర్గ కేంద్రం నుంచి రాష్ట్ర రాజధాని వరకు రోడ్ల కారిడార్లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. మొదటి దశ హ్యామ్ పనులకు నవంబరు, డిసెంబరులో టెండర్లను ఆహ్వానిస్తామని తెలిపారు. హ్యామ్ విధానంలో చేపట్టే రోడ్ల పనులను ఆయా రహదారులపై ట్రాఫిక్ సర్వేలను దృష్టిలో పెట్టుకుని చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రోడ్ల నిర్మాణ పనులను దశల వారీగా చేపట్టి, పూర్తి చేయాలన్నారు.

10,986 కోట్లలో 40శాతం ప్రభుత్వ వాటా

ఆర్ అండ్ బీలో ప్రతిపాదనల మేరకు హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రూ.10,986 కోట్ల వరకు ఖర్చవుతుందని తేలడంతో.. హ్యామ్ నిబంధనల ప్రకారం మొత్తం ఖర్చులో 40 శాతం ప్రభుత్వమే తొలుత గుత్తేదారులకు అందించాల్సి ఉంటుంది. మిగిలిన 60 శాతం నిధులను గుత్తేదారులు రుణాల రూపంలో సేకరించాలి. పనుల టెండర్లను రెండు నెలల్లో ఆహ్వానించేలా ఆర్ అండ్ బీ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

ఓఎంసీ అక్రమాల గుట్టు తేల్చేందుకు..
జస్టిస్ సుధాంశు కమిటీ

- సుప్రీం ఆదేశాలతో రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు
- సభ్యులుగా అటవీ, గనులు, సర్వే, రెవెన్యూ, సీఈసీ అధికారులు
- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సీనియర్ అధికారి కూడా

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-కర్ణాటక మధ్య ఉన్న అటవీప్రాంతంలో గాలి జనార్దన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) సాగించిన అక్రమ తవ్వకాల నిగ్గుతేల్చేందుకు రాష్ట్రప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు.. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధూలియా ఛైర్మన్‌గా ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు(జీవో 167) జారీ చేశారు. ఇందులో అటవీ, గనులు, సర్వే, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) ప్రతిపాదించిన అధికారి, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సీనియర్ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు. గత నెలలో ఓఎంసీ అక్రమాలపై సుప్రీంకోర్టులో కీలక నిర్ణయాలు జరిగిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో అనంతపురం జిల్లా డీ హీరేహాళ్ మండలం పరిధిలోని అటవీ ప్రాంతం వెంట ఉన్న ఇనుప ఖనిజాన్ని ఓఎంసీకి లీజుకిచ్చింది. అయితే లీజు ప్రాంతాన్ని దాటి అటవీ ప్రాంతంలో కూడా ఓఎంసీ అక్రమంగా తవ్వేసింది. ఇంకా అనేక అక్రమాలకు పాల్పడింది. వీటిపై సీబీఐ కేసు నమోదుచేసి విచారణ చేసింది. ఓఎంసీకి లీజుకిచ్చిన భూములేమిటి.. అటవీప్రాంతంలో ఏ మేరకు తవ్వకాలు చేశారు.. అక్రమ మైనింగ్ ఏ మేరకు జరిగింది.. ఓఎంసీ పాల్పడిన ఇతర అక్రమాలేమిటో గుర్తించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం గత నెల 19న రాష్ట్రాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఓఎంసీ అక్రమాలు, లీజు ఏరియా, అటవీ ప్రాంతం హద్దులు, అక్రమ మైనింగ్ జరిగిన తీరును కనిపెట్టేందుకు జస్టిస్ సుధాంశు ధూలియా నేతృత్వాన కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి అవసరమైన పూర్తిసహాయ సహకారాలు అందించాలని అనంతపురం కలెక్టర్, గనులు, రెవెన్యూ, అటవీ శాఖలను ప్రభుత్వం ఆదేశించింది.

మ్యుటేషన్ కోసం
రూ.5లక్షల లంచం

- ఏసీబీకి చిక్కిన నల్లగొండ జిల్లా చిట్యాల తహసీల్దార్



చిట్యాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భూమి మ్యుటేషన్ చేసేందుకు లంచం డిమాండ్ చేసి.. ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారో తహసీల్దార్. ఈ మేరకు నల్లగొండ జిల్లా చిట్యాల తహసీల్దార్ గగులోతు కృష్ణను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ మహబూబ్‌నగర్ జిల్లా డీఎస్పీ, నల్లగొండ ఇన్‌చార్జి సీహెచ్ బాలకృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని మెస్సర్స్ రత్న హౌసింగ్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కొనుగోలు చేసిన భూమిని మ్యుటేషన్ చేసేందుకు తహసీల్దార్ గగులోతు కృష్ణ.. ఆ సంస్థ బాధ్యుల నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. అయితే రూ.5 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అనంతరం ఆ తహసీల్దార్‌పై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం రత్న హౌసింగ్ అండ్ ఎస్టేట్స్‌కు చెందిన వ్యక్తి రూ.2లక్షల నగదును తహసీల్దార్ సూచించిన గట్టు రమేశ్‌కు ఇస్తుండగా అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్‌తో పాటు గట్టు రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. తహసీల్దార్ కృష్ణ, రమేశ్‌ను నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. తహసీల్దార్, ఆయన బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.